JEE ADVANCED 2026
ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 100 లోపు 35 ర్యాంకులు
శ్రీచైతన్య విద్యాసంస్థలు

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తాడేపల్లిగూడెం

: fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

3-6-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 123 పేజీలు: 8+4 వెల: 6.50

JEE ADVANCED 2026
ఆలిండియా ఓపెన్ కేటగిరీ 1000 లోపు 201 ర్యాంకులు
శ్రీచైతన్య విద్యాసంస్థలు




ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 100లోపు 35 ర్యాంకులు, ఇందులో 12 ర్యాంకులు ఒక్క విజయవాడ నుండే..

RANK 21 YAJAT SHINGHAL HT. NO. 267020175
RANK 26 PASALA MOHITH HT. NO. 266060100
RANK 28 MUKKARA SAKETH HT. NO. 266059154
RANK 31 B SAMEERAJ REDDY HT. NO. 266131323
RANK 36 ARNAV GANDHI HT. NO. 267013646
RANK 37 ADITYA SINGH HT. NO. 261037065
RANK 38 B V C SEKHAR REDDY HT. NO. 266060225
RANK 40 KATA HIMAKAR HT. NO. 266009152
RANK 45 AARUSH SINGHAL HT. NO. 267015167
RANK 56 CHINNI PAWAN TEJA HT. NO. 266060479
RANK 62 K SAMITH CHOWDARY HT. NO. 266062106
RANK 64 U VENKATA YOGESH HT. NO. 266009162
RANK 66 J R MANIDEEP REDDY HT. NO. 266009143
RANK 67 TANMAY H.G HT. NO. 261043005
RANK 73 PALASH JAMBURE HT. NO. 261114121
RANK 74 RAM NIKIL PUVVADI HT. NO. 261048073
RANK 81 ADITYA GUPTA HT. NO. 267010589
RANK 87 NAIDU LAKSHMI TEJAL HT. NO. 266032030
RANK 91 S T VATHSAN HT. NO. 266097453
RANK 92 I ABHISHEK KANTH HT. NO. 266055215
RANK 93 PATURI JAYADEV HT. NO. 266009028
RANK 95 VAKA AVINASH NAIDU HT. NO. 266058086

RANK 10 DARSH SIKKA HT. NO. 262105093*
RANK 17 AARAV GUPTA HT. NO. 266100595*
RANK 30 AMRIT RAJ HT. NO. 267043075*
RANK 41 SNEHAL RAI CHOWDARY HT. NO. 266103545*
RANK 44 YASH YADAV HT. NO. 262067130*
RANK 52 YASHWARDHAN HT. NO. 267011368*
RANK 59 A SUSHANT KUMAR HT. NO. 262007260*
DLP/ONLINE/AITS*
ఇలాంటి మరెన్నో ర్యాంకులు

ఆలిండియా ఓపెన్ కేటగిరీ

| 100 లోపు | 500 లోపు | 1000 లోపు |
|---|---|---|
| 35 ర్యాంకులు | 126 ర్యాంకులు | 201 ర్యాంకులు |

ఆలిండియా ఆల్ కేటగిరీ

| 10 లోపు | 100 లోపు | 500 లోపు | 1000 లోపు |
|---|---|---|---|
| 10 ర్యాంకులు | 93 ర్యాంకులు | 412 ర్యాంకులు | 827 ర్యాంకులు |

వివిధ కేటగిరీల్లో శ్రీచైతన్య సాధించిన ర్యాంకులు 4,431+

శ్రీచైతన్య విద్యాసంస్థలు

IIT-JEE & NEET LONG-TERM 2027 అడ్మిషన్లు జరుగుచున్నవి » Ph: 040 66 06 06 06 | www.srichaitanya.net

*T & C apply | Note: Any inadvertent error published in this advertisement could be brought to our notice | Note: The information is as per students feedback

ఆదివారం
గత వారంరోజుల్లో పరిణామాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

తాడేపల్లిగూడెం

: fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

3-6-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 123 పేజీలు: 8+4 వెల: 6.50

విప్ పదవికి అరవ శ్రీధర్ రాజీనామా, ఆమోదం 7లో

యశ్వంత్‌పూర్ ప్రత్యేక రైలుకు తృటిలో తప్పిన ప్రమాదం

# పెరిగిన పన్ను వసూళ్లు



## మే నెలలో 19శాతం వృద్ధి

### మరింత పుంజుకొన్న ఆర్థిక కార్యకలాపాలు: మంత్రి లోకేష్

**విజయవాడ,జూన్ 2,ప్రభాతవార్తప్రతినిధి:** మే నెలలో రాష్ట్ర పన్నుల వసూళ్లు భారీగా పెరిగాయి. ఏకంగా 19 శాతం వృద్ధితో రూ.4,950 కోట్లకు చేరుకున్నాయి. గతేడాది ఇదే నెలలో రూ.4,165 కోట్లు వసూలు కాగా, ఈసారి అదనంగా రూ.737 కోట్ల ఆదాయం సమకూరింది. రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు పుంజుకోవడం, పన్నుల చెల్లింపుల్లో పారదర్శకత పెరగడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. ఈ అంశంపై మంత్రి నారా లోకేష్ ఎక్స్ వేదికగా షేర్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఆన్ ఫైర్ అంటూ తన సంతోషాన్ని పంచుకున్నారు. వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ బాబు ఏ. అధికారికంగా అందించిన సమాచారాన్ని అనుసరించి జిఎస్టీ వసూళ్లు 16 శాతం వృద్ధితో రూ.3,037 కోట్లకు చేరుకున్నాయి. 2025 మే నెలలో ఇవి రూ.2,629 కోట్లుగా ఉన్నాయి. అలాగే ఐజిఎస్‌టి సెటిల్మెంట్ ద్వారా రాష్ట్రానికి రూ.1,758.58 కోట్లు వచ్చాయి (గతేడాదితో పోలిస్తే 15.36 వృద్ధి). ఇక పెట్రోలియం ఉత్పత్తుల వ్యాట్ ఏకంగా 31.79 శాతం పెరిగి రూ.1,768.82 కోట్లకు చేరడం విశేషం. వృత్తి పన్నుద్వారా రూ.48.92 కోట్లు, మద్యం వ్యాట్ ద్వారా రూ.89 కోట్లు రాష్ట్ర ఖజానాకు చేరాయి. జీఎస్టీ వసూళ్లలో ఎపి జాతీయసగటు కంటే మెరుగ్గాఉంది. దక్షిణాది రాష్ట్రాల్లో కర్ణాటక (17 ) తర్వాతి స్థానంలో నిలిచి రెండో ప్లేస్ కైవసం చేసుకుంది.

కేరళ (15), తెలంగాణ (14), తమిళనాడు (12) రాష్ట్రాలు ఎపి తర్వాతి స్థానాల్లోనే ఆగిపోయాయి. పెట్రోలియం, రియల్ ఎస్టేట్, కన్స్ట్రక్షన్, ఎలక్ట్రికల్ మెషినరీ, బులియన్, జ్యువెలరీ రంగాల్లో లావాదేవీలు పెరగడమే ఈ రికార్డు వసూళ్లకు కారణమని అధికారులు విశ్లేషిస్తున్నారు. మరోవైపు పన్ను ఎగవేతలు, నకిలీ ఇన్వాయిస్‌లను అరికట్టేందుకు వాణిజ్య పన్నులశాఖ టెక్నాలజీకి >>7

## పుష్కరాలకు ముందుగానే

# పోలవరం పూర్తి

### పుణ్యస్నానాల కోసం దాదాపు 10 కోట్ల మంది రావొచ్చు

### 9.9 కి.మీ మేర పుష్కరఘాట్‌ల నిర్మాణం

### అత్యంత ప్రతిష్టాత్మకంగా పుష్కర వేడుకలు

### మెగాసిటీగా రాజమహేంద్రవరం అభివృద్ధి

### వివిధ శాఖల సమీక్షలో సిఎం చంద్రబాబు



మంగళవారం సచివాలయంలో గోదావరి పుష్కరాలపై మంత్రులు, అధికారులతో సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ, జూన్ 2,ప్రభాతవార్తప్రతినిధి:** వచ్చే యేడాది గోదావరి పుష్కరాల్లో ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక, చారిత్రక వైభవం ఉట్టిపడేలా... మరింత ఆకర్షణీయంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గోదావరి సమీప ప్రాంతాల్లో ఎన్నో పుణ్యక్షేత్రాలు కొలువై ఉన్నందున పుష్కరాల్లో ఆధ్యాత్మిక పర్యాటకానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పుష్కరాలకు వచ్చే భక్తులతో ఆర్థికకార్యకలాపాలు పెరగాలన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా గోదావరి పుష్కరాలను నిర్వహించేందుకు అన్ని శాఖలూ సమన్వయంతో పనిచేయాలని సిఎం స్పష్టం చేశారు. గోదావరి పుష్కరాలు- 2027నిర్వహణపై మంత్రుల కమిటీ, వివిధ శాఖల అధికారులతో సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. అఖండ గోదావరి అభివృద్ధి ప్రాజెక్టుపై సమీక్షలో ముఖ్యమంత్రి సమగ్రంగా చర్చించారు. గోదావరి పుష్కరాల కన్నా ముందే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని సమీక్షలో సీఎం వెల్లడించారు. దీంతో పోలవరం ప్రాజెక్టుకు కూడా సందర్శకులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ధవళేశ్వరం నుంచి పోలవరం ప్రాజెక్టు వరకు రహదారిని అఖండ గోదావరిగా అభివృద్ధి చేయాలన్నారు. కేవలం పుష్కరాలను మాత్రమే దృష్టిలో పెట్టుకుని పనులు పరిమితం చేయకుండా, ఇప్పుడు చేసే అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల కల్పన గోదావరి పరివాహక ప్రాంతానికి ఆస్తిగా మారాలన్నారు. పుష్కరాల నిర్వహణతో రాజమహేంద్రవరం మహా నగరంగా అభివృద్ధి చెందాలని సీఎం చెప్పారు. .

**పుష్కరాలకు కేంద్ర సాయం కోరండి..**

హైవే ట్రాఫిక్ మేనేజ్మెంట్, రైల్వే ట్రాఫిక్, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల రద్దీపైనా దృష్టి పెట్టాలని సిఎం చెప్పారు. భక్తుల సౌకర్యార్థం, ఎవరికీ ఎలాంటి గందరగోళం లేకుండా పుష్కర ఘాట్లకు నెంబరింగ్‌ఇవ్వాలని అధికారులకు సూచించారు. జాతీయ, రాష్ట్రరహదారుల అనుసంధానం, విశాఖ నుంచి విజయవాడ వరకూ రైలు సర్వీసులు పెంచడం జరగాలని సిఎం >>7

# తెలంగాణలోనూ పోటీ

### ● 2029 ఎన్నికల బరిలోకి జనసేన ● నన్ను ప్రశ్నించడానికి వాళ్లెవరు? ● ఎలాంటి బెదరింపులకు భయపడను ● జనసేనను తెలంగాణ నడిబొడ్డునే ఏర్పాటుచేశా ● నా ఆరోపణలు వెనుక కెసిఆర్, రేవంత్ లేరు ● హైదరాబాద్‌లో మీడియాతో డి.సిఎం పవన్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జూన్ 2, ప్రభాతవార్త:** తెలంగాణాలో జనసేన ఉంటుందని, ఇక్కడి నుంచి పోటీ చేస్తామని, అవసరమైతే తెలంగాణలో తాను పర్యటిస్తానని జనసేన అధినేత, ఏపి డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. 2029 ఎన్నికల్లో తెలంగాణాలో తాము తప్పకుండా పోటీ చేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణాలో ప్రతి సమస్య మీద మాట్లాడుతానని, ప్రతి అన్యాయాన్ని ఎదుర్కొంటామన్నారు. తెలంగాణ భారతదేశంలో అంతర్భాగంగా ఉందని, బెదిరిస్తే భయపడమని అన్నారు. తెలంగాణాను వ్యతిరేకించిన వారే పదవుల్లో కూర్చొన్నారని, వ్యతిరేకించిన వారు ఎమ్మెల్యే అయ్యారని అన్నారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలందరికి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణాపై తనకు ఎంతో ప్రేమ ఉందని, అది రాజకీయాలకు అతీతమైందని ఆయన స్పష్టం చేశారు. తెంలగాణ ప్రజలు తనకు ఎన్నోసార్లు అండగా నిలిచారన్నారు. ఈ మధ్యన హైదరాబాద్‌లో ఎలా అడుగు పెడుతావు అని, ఇక్కడ నీకేం పని అని కొందరు అంటున్నారని అసలు నన్ను అనడానికి, బెదిరించడానికి మీరెవరయ్యా అంటూ ప్రశ్నించారు. బెదిరించేవాళ్ల అయ్య జాగిరా.. తెలంగాణ అన్నారు. మీ ఇష్టానికి మాట్లాడితే నేను భయపడాలా?, నాపై దాడులు చేస్తామంటున్నారు కొందరు అందుకే తన చిరునామా తెలియాలని ఇంటి వద్దనే మీడియా సమావేశం ఏర్పాటుచేశానన్నారు. తనకు తెలంగాణాలో బెదిరింపులకన్నా, ఆంధ్రాలోనే బెదిరింపులు ఎక్కువన్నారు.




మంగళవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న డి.సిఎం పవన్

**బెదిరింపులకు లొంగను**

తెలంగాణాపై తనకు కమిట్‌మెంట్ ఉందని, కొండగట్టు అంజన్నకు రూ. 30కోట్లు, వరదలు వచ్చినప్పుడు కోటి రూపాయలు ఇచ్చామ >>7



## సిబిఎస్‌ఇ కొత్త చైర్మన్‌గా ప్రశాంత్ సీతారామ్ కార్యదర్శిగా భరద్వాజ్

**న్యూఢిల్లీ, జూన్ 2:** కేంద్ర మాధ్యమిక విద్యాబోర్డు సిబిఎస్‌ఇకి కొత్త చైర్మన్‌ను కేంద్రం నియమించింది. సీనియర్ ఐఎఎస్ అధికారి ప్రశాంత్ సీతారామ్ లోఖండేను కొత్తచైర్మన్‌గా నియమించారు. అంతకు ముందు లోఖండే 2001 ఆగ్మట్ కేడర్ అధికారి. కేంద్రహోంశాఖలో అదనపు కార్యదర్శిగా పనిచేసారు. ప్రస్తుత చైర్మన్ రాహుల్‌సింగ్ స్థానంలో లోఖండే నియమితులయ్యారు. రాహుల్‌సింగ్‌ను వ్యవసాయ శాఖలో అదనపు కార్యదర్శిగా నియమించారు. అలాగే కార్యదర్శిగా భరద్వాజ్‌ను నియమించారు. ప్రస్తుత కార్యదర్శి హిమాంశు గుప్తా స్థానంలో ఆయన్ను నియమించారు. గుప్తాను ఆయన మాతృశాఖ హోంమంత్రిత్వశాఖకే తిరిగి పంపించారు. సిబిఎస్‌ఇ కొత్తగా ప్రవేశపెట్టిన ఒఎస్‌ఎం వ్యవస్థను ఏకసభ్య కమిటీ పరిశీలనచేస్తోంది. సత్వరమే తన నివేదికను ప్రభుత్వానికి అందించేందుకు కసరత్తుచేస్తోంది. 12వ తరగతి పరీక్షలకు డిజిటల్ మదింపు పద్ధతిని బోర్డుప్రవేశపెట్టింది. ఈ పద్ధ >>7

# 'సైకిల్' సత్తా చూపండి

### ఇంటింటికి ఆ వాహనంపైనే వెళ్లండి..

### వన్ టైం ఎమ్మెల్యేలుగా మిగలొద్దు..

### పార్టీ ఎమ్మెల్యేలకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం

**విజయవాడ,జూన్2,ప్రభాతవార్తప్రతినిధి:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని టిడిపి ఎమ్మెల్యేలకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, సిఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. జనసేన, బిజెపితో కలిసి సమన్వయం చేసుకొని సర్‌ని పర్యవేక్షించాలన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఎస్‌ఐఆర్‌పై వర్క్ షాప్‌లో సిఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ నెల 4న ఎన్డీఏ నేతల సమావేశం జరగనుందని తెలిపారు. రాష్ట్ర, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ఎన్డీఏ సమన్వయ కమిటీల నియామకం జరగనున్నట్లు వెల్లడించారు. క్షేత్రస్థాయిలో టిడిపి ప్రధాన పార్టీగా ఉన్నందున పూర్తి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

మిత్రపక్షాలను కలుపుకువెళ్లాలని.. బలం ఎక్కువా తక్కువా అనేది అనవసరమని, అటువంటి ఆలోచనలు కూడా పెట్టుకోవద్దన్నారు. కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిందేనని ఎమ్మెల్యేలకు సిఎం స్పష్టం చేశారు. జెండా మోయాలంటే జెండా ద్వారావచ్చిన అధికారంలో కార్యకర్తలను భాగస్వాములను చేయాల్సిందే అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చిన్న పామైనా పెద్ద కర్రతో కొట్టాలనే సామెత తరహాలో గొడ్డలి పార్టీ విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. లేకుంటే విషం చిమ్ముతూనే ఉంటుందని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. తాను ఎన్నో పోరాటాలు చేశానని కానీ నీచులతో ఎప్పుడూ పోరాటాలు చేయలేదని అన్నారు. పార్టీ పెట్టినప్పటి నుంచి హిందూపురం, కుప్పం సహా ఇంకొన్ని నియోజకవర్గాల్లో గెలుస్తూనే ఉన్నాం.. ఇలాంటి నియోజకవర్గాల సంఖ్య పెరగాలని సూచించారు. కొత్తగా ఎమ్మెల్యేలు అయిన వారు వన్ టైమ్ ఎమ్మెల్యేలుగా మిగిలిపోకూడదని మళ్లీ మళ్లీ గెలవాలని సిఎం దిశానిర్దేశం చేశారు. అభివృద్ధి, సుపరిపాలన ద్వారానే ఓట్లు పడతాయన్నారు.ఎన్నికల్లో హామీ ఇచ్చి మొదటి సంతకం పెట్టి మెగా డిఎస్సీ నిర్వహించామని సిఎం గుర్తుచేశారు. మెగా డిఎస్సీ జరగకూడదని 241 కేసులు వేసి అడ్డుకున్నారని, కానీ వాటినిఎదుర్కొని అత్యంత పారదర్శకంగా డిఎస్సీ నిర్వహించి నియామకాలు >>7

## విజయవంతంగా తుంగభద్ర డ్యాం 33 గేట్లు మార్పిడి 5లో

## దేశ ప్రగతికి ఆరోగ్య సంరక్షణే కేంద్ర బిందువు

### గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్




# నేడో రేపో కేరళకు నైరుతి

### మరో ఐదు రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లోకి

### పలు ప్రాంతాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

**న్యూఢిల్లీ, జూన్ 2:** నైరుతి రుతుపవనాలు జూన్ 3వ తేదీ సాయంత్రం లేదా 4న కేరళం రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) అంచనా వేసింది. అరేబియా సముద్రం మీదుగా తేమతో కూడిన గాలులు బలపడుతుండంతో రుతుపవనాల కదలిక వేగవంతమవుతోంది. దీని ప్రభావంతో రుతుపవనాల రాకతో దక్షిణ భారత రాష్ట్రాల్లో వచ్చే ఆరు నుంచి ఏడు రోజుల పాటు విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. రుతుపవనాల పురోగతి, తూర్పు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ నుండి విదర్భ, తెలంగాణ, రాయలసీమ మీదుగా ఈశాన్య తమిళనాడు వరకు సుమారు 0.9 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉన్న ద్రోణి ప్రభావంతో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. తద్వారారాబోయే ఐదురోజుల్లో తెలుగురాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు 2 నుండి >>7

# వేలేరుపాడులో ఘోర అగ్నిప్రమాదం

### ఇద్దరు మహిళలు సజీవ దహనం



మంగళవారం వేలేరుపాడులో జరిగిన అగ్ని ప్రమాద దృశ్యం

**వేలేరుపాడు, జూన్2 (ప్రభాత వార్త):** వేలేరుపాడు మండలంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద సోమవారం రాత్రి ఒంటిగంట సమయంలో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. ప్రమాదంలో వలగాని సావిత్రి (60), సిగ పూలమ్మ (64) సజీవ దహనమై మృతి చెందారు. ప్రమాదం జరిగిన సమయంలో మంటలు వేగంగా వ్యాపించడంతో నివాస గృహంతో పాటు అక్కాచెల్లెళ్లు అగ్నికి ఆహుతయ్యారు. గృహానికి ఆనుకొని ఉన్న లక్ష్మి నివాస గృహం పూర్తిగా అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న గ్రామస్తులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా >>7

# నిరుద్యోగుల సంక్షేమమే లక్ష్యం

### చెప్పిన ప్రకారం మెగా డిఎస్సీతో 16 వేల పోస్టులు భర్తీ చేశాం

### పోటీ పరీక్షల నిర్వహణలో రాష్ట్రానికి మంచి పేరు: మంత్రి కొండపల్లి

**విజయనగరం, జూన్ 2 ప్రభాతవార్త:** ఐదేళ్ల వైసీపీ పాలనలో లక్షలాది నిరుద్యోగులను దగా చేసిన జగన్‌కు, వైసీపీ నేతలకు డీఎస్సీ గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే చెప్పిన టైంకు 16 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వేసి పారదర్శకంగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసిందన్నారు. పని పాటాలేని వైసీపీ నేతలు నియామకాలు పూర్తయిన ఆరేడు నెలలకు డీఎస్సీలో అక్రమాలు అంటూ విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సమైక్య రాష్ట్రం నుంచి ఎందరో ముఖ్యమంత్రులు పాలించినా ఒక్క ఉపాధ్యాయ పోస్టు కూడా భర్తీ చేయని ముఖ్యమంత్రిగా చెత్త రికార్డును వైఎస్.




జగన్మోహన్ రెడ్డి సొంతం చేసుకున్నారని కొండపల్లి విమర్శించారు. నిరుద్యోగులను ఐదేళ్లగా మాయ మాటలతో వంచించి మోసం చేసిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు.

చంద్రబాబు అంటేనే డిఎస్సీలు, ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి పెట్టింది పేరని మంత్రి కొండపల్లి ప్రశంసించారు. 9 డిఎస్సీలతో 2 లక్షలకు పైగా ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేసిన రికార్డు చంద్రబాబుకే సొంతమన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా 1996-1998, 2000-2001,2002-2003 సంవత్సరాలలో 6 డిఎస్సీలు, రాష్ట్ర విభజన తర్వాత 2014-2018లో రెండు డిఎస్సీలు నిర్వహిస్తే గత 2024 ఎన్నికలకు ముందు 6 వేల అరకొర పోస్టులతో నోటిఫికేషన్ రిలీజ్ చేసిన జగన్ చేతులు దులుపుకున్న విషయం వైసీపీ నేతలకు తెలియదా? అని కొండపల్లి ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే తొలి సంతకంతో 16 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ రిలీజ్ చేసి.. ఇచ్చిన మాట ప్రకారం ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీచేసిన ఘనత చంద్రబాబు గారు, కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని మంత్రి తెలిపారు. కాంపిటేటివ్ పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించడంలోనే తెలుగుదేశం >>7

## ఫేక్ జీవోల కేసు

## మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు ఇంటికి సిసిఎస్ పోలీసులు

**నరసరావుపేట, మే 2 ప్రభాతవార్త :** వినుకొండ మాజీ శాసనసభ్యుడు బొల్లా బ్రహ్మనాయుడు కోసం హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు స్థానికంగా తనిఖీలు నిర్వహించారు. స్థానిక ప్రకాష్‌నగర్‌లోని 60 అడుగులరోడ్‌లోఉన్న బ్రహ్మనాయుడు ఇంటికి చేరుకున్న పోలీసులు వివరాలు తెలుసుకున్నారు. తెల్లవారుజామున పట్టణానికి చేరుకున్న వారు స్థానికులు కొందరిని విచారించి మాజీ ఎమ్మెల్యే గురించి సమాచారాన్ని అడిగారు. ఆయన ఆచూకీ లేకపోవడంతో సిసిఎస్ పోలీసులు తిరిగి వెళ్లిపోయారు. హైదరాబాదులోని గండిపేటలో దాదాపు రూ. 1500 కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ భూమి కబ్జా వ్యవహారానికి సంబంధించి ఆయనపై కేసు నమోదు అయింది. తెలంగాణ ప్రభుత్వం ఈ కేసును సీరియస్‌గా తీసుకోవడంతో రెండు రాష్ట్రాల్లోనూ ఈ వ్యవహారం సంచలనంగా మారింది. సిసిఎస పోలీసులకు సంబంధించి ఎటువంటి సమాచారం తమకులేదని స్థానిక పోలీస్ అధికారులు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే >>7

వార్త


దిగజారడం ప్రారంభించనే కూడదు. ఒక్కసారి దిగజారితే ఇక దానికంతే ఉండదు.

- హెచ్. లాంగ్‌ఫెలో

# పటిష్టమైన విత్తన చట్టమే పరిష్కారం


బాధపడడం తప్ప బాధించడం తెలియని అన్నదాతల్లో ఇటీవల కాలంలో సహనం, ఓర్పు సన్నగిల్లి ఆందోళనబాటలు పడుతున్నారు. తనకు ఎంతటి నష్టం జరిగినా, ఎవరు ఎంతగా మోసగించినా తమలో తాము కుళ్లి కుళ్లి మనసులోనే బాధపడి చివరకు ప్రాణ త్యాగం చేయడానికి అయినా సిద్ధపడే వారేతప్ప తమను దగా చేసినవారిపై కక్ష కట్టి దాడులు చేసేందుకు సాహసించలేకపోయేవారు. పంటలకు గిట్టుబాటు ధర రాకపోయినా దళారుల హస్తలాఘవంతో కోలుకోలేని దగాకు గురవుతున్నా తమ కర్మకు తామే బాధపడుతూ మనోవేదనతో ఇంటిముఖం పట్టేవారు. కానీ ఇటీవల కాలంలో రోడ్లపైకి రావడం, ధర్నాలు, రాస్తారోకోలు లాంటి నిరసన కార్యక్రమాలు చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. ఆరుగాలం అష్టకష్టాలు పడి ఇటు తోటి మానవుడి దోపిడీని, అటు ప్రకృతి సహాయ నిరాకరణను ఎదుర్కొని పండించిన పంటలను అమ్ముకోవడంలో ముఖ్యంగా ఇటీవల కాలంలో వారు పడిన, పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. దేశవ్యాప్తంగా కూడా అధిక శాతం మార్కెట్ యార్డుల్లో దళారులదే రాజ్యం.కొలతల్లో మోసం, ధరలు నిర్ణయించడంలో దగా, ఒక్కటేమిటి ఎక్కడ వీలైతే అక్కడ చేతివాటం ప్రదర్శించేందుకు దళారులు నిత్యం పొంచి ఉంటూనే ఉన్నారు. అన్నదాతలు మోసపోతూనే ఉన్నారు. మోసపోయేవారు ఉన్నంత కాలం మోసం చేసేవారు ఉంటారన్నట్టే ఈ దళారీవ్యవస్థ ఉన్నంత కాలం రైతులకు ఈ బాధలు తప్పవు. అందుకే విత్తే దగ్గర నుంచి విక్రయించేవరకు అన్నిస్థాయిల్లో దగా జరుగుతున్నది. దీనిని నిరోధించేందుకు పాలకులు ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నట్లు చెప్తున్నా అవి మాటలకే పరిమితమవుతున్నాయి. ఇప్పుడు ఖరీఫ్ సీజన్ ఆరంభం కాబోతున్నది. రోహిణికార్తె దాటి మరోవారంలో మృగశిరలో అడుగుపెట్టబోతున్నాం. పంటలకు విత్తనాలు మూలం. యేటా ఎందరో రైతులు నకిలీ, నాసిరకం విత్తనాలతో మోసపోయి ప్రాణాలు తీసుకుంటున్నారు.మరొకపక్క నకిలీ, నాసిరకం విత్తనాలు సరఫరా చేసేవారిపై పటిష్టమైన చర్యలు తీసుకుంటామని, వదిలిపెట్టే ప్రసక్తే లేదని పిడి చట్టాన్ని ప్రయోగించి కటకటలా వెనక్కి పంపేందుకు వెనుకాడమని పాలకులు హెచ్చరికల మీద హెచ్చరికలు జారీ చేస్తున్నారు. కానీ ఆ నకిలీ విత్తనాల వ్యాపారులు అవేమీ పట్టించుకునే పరిస్థితుల్లో లేరు. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే నకిలీ విత్తనాల వ్యాపారం జోరందుకున్నది.అక్కడక్కడ పట్టుబడుతున్నాయి కూడా. రైతుల అవసరాలను, డిమాండ్‌ను ఆసరాగా తీసుకొని ఈ నకిలీ విత్తనాల వ్యాపారులు ఒక వ్యూహం ప్రకారం రైతులను దగా చేస్తున్నారు. ఇప్పుడే కాదు ప్రతియేడాది సీజన్‌లో అధికారులు చేస్తున్న దాడుల్లో వేలాది కోట్లాది రూపాయల విలువైన నకిలీ, నాసిరకమైన విత్తనాలు పట్టుబడుతున్నాయి. నిందితులను అదుపులోకి తీసుకుంటున్నారు. కేసులు పెడుతున్నారు.అలా జరిమానా చెల్లించి మరుసటి రోజు నుంచే జైలు నుంచి రాగానే వారు అదే వ్యాపారం చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్‌ను కూడా ఏర్పాటు చేసింది. ఆకస్మిక దాడులను చేయిస్తున్నారు.అయినా ఇదేమీ ఆగడం లేదు. తెలుగు రాష్ట్రాల్లో అధిక శాతం వరి, పత్తి పంటలుసాగు చేస్తున్నారు. అయితే ఈసారి తెలంగాణలో పత్తి విత్తనాలు కోటి ప్యాకెట్లు అవసరం ఉంటే మూడు కోట్లు తెప్పించామని,విత్తన కొరత లేదని అధికారవర్గాలు చెబుతున్నాయి. అలాగే వరి విషయంలో కూడా కొరత ఉండకపోవచ్చునని అంచనాలు వేస్తున్నారు. కానీ కొన్ని రకాల పత్తి విత్తనాలు,మరికొన్ని వరి విత్తనాలకే డిమాండ్ఉంది. రైతులు అవే కావాలని కోరడంతో దీన్ని ఆసరాగా తీసుకొని నకిలీలు విజృంభిస్తున్నారు. ఇక పప్పు దినుసులు, కూరగాయలు, తదితర పంటల సాగు గణనీయంగా తగ్గిపోతున్నది. ఆ విత్తనాలు కూడా సకాలంలో నాణ్యమైన విత్తనాలు దొరకడం లేదు. కూరగాయలకు సంబంధించిన నకిలీ విత్తనాలకు అదుపే లేకుండాపోతున్నది.బిల్లులు లాంటివి ఎలాంటి ఆధారాలు లేకుండా కోట్లాది రూపాయల విలువైన విత్తన వ్యాపారం జరుగుతున్నది. ఇతర రాష్ట్రాల నుంచి తెలుగు రాష్ట్రాలకు తెప్పించుకొని బహిరంగంగానే అమ్ముకుంటున్నారు.వీటికి రైతులు అడిగానా రసీదులు ఇవ్వకుండా ఆధారాలు లేకుండా జాగ్రత్తలు పడుతున్నారు. ఈవ్యాపారం ఇక్కడా అక్కడా అని కాదు. తెలుగు రాష్ట్రాల్లో బాహాటంగా జరుగుతున్నా, అధికారులకు స్పష్టంగా తెలిసినా మౌనంగా ఉండిపోతున్నారు. ప్రభుత్వపరంగా ఎన్ని చర్యలు తీసుకున్నా విత్తనాల కొరత దృష్ట్యా ఈ నకిలీ వ్యాపారులపై ఆధారపడక తప్పడం లేదు. అసలు ఈ వ్యాపారాన్ని అడ్డుకునేందుకు గత రెండు,మూడు దశాబ్దాలుగా పాలకులు చేస్తున్న ప్రయత్నాలు ఏమాత్రం సఫలీకృతం కావడం లేదు. పోలీసులన్నా, చట్టాలన్నా వ్యవసాయ శాఖ అధికారులన్నా పాలకులు చేస్తున్న హెచ్చరికలన్నా ఈవ్యాపారుల్లో భయభక్తులు లేకుండాపోయాయి. ఇందుకు ఎన్నో కారణాలున్నాయి.ఇందులో ప్రధానమైనది లోపభూయిష్టమైనవిత్తన చట్టమే. ఆ చట్టం రైతుల కంటే దళారులకే ప్రయోజనకరంగా ఉంది. ఆ చట్టాన్ని మార్చాలని, దాని స్థానంలో పటిష్టమైన కొత్తచట్టాన్ని తేవాలని ఏనాటి నుంచో ప్రయత్నాలు చేస్తున్నా ఫలించడం లేదు.విదేశాల్లో నకిలీ నాసిరకం విత్తనాలతో మోసం చేసిన దళారులపై తీవ్రమైన చర్యలు తీసుకుంటున్నారు. అలాంటి చర్యల కారణంగానే పోరుగునున్న చైనా లాంటి దేశాల్లో నకిలీ, నాసిరకం విత్తనాల ఉనికేలేదు. దేశంలో జరుగుతున్న రైతుల ఆత్మహత్యల్లో విత్తనాల్లో మోసపోయినవారి సంఖ్యతక్కువేమీ కాదు. ఇప్పటికైనా పాలకులు ఆలోచించాలి. వారికున్న ఒక్క ఉపాధిని వారిపాలిట మృత్యువుగా పరిణమించకుండా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉంది.

మన ఆలోచనలు నాణ్యమైనవైతే మన మానసిక ఆరోగ్యం చక్కగా ఉంటుంది.



షేక్స్పియర్

అంతరాయాలు కలుగుతున్న కొద్దీ సంకల్పాన్ని దృఢతరం చేసుకుంటూ పోవాలి.



శ్రీ రమణ మహర్షి

# ప్రజావాక్కు



### సనాతనం అంటే ఏమిటి?

ఈమధ్య సనాతనం అనే పదం ఎక్కువగా ఉపయోగించబడుతుంది. పాపం సనాతనాన్ని రూపుమాపాలి అన్న స్టాలిన్ కొడుకు మీద కొంతమంది ఇరుచుక పడ్డారు. అయితే సనాతనం అంటే ఇది అని మాత్రం ఖచ్చితంగా చెప్పటం లేదు? ఏమిటి కారణం? తెలియకనా,కాదు. ఎందుకంటే సాక్షాత్తు ప్రధాని అంతటి వాడికి సనాతనం అంటే తెలియక మాట్లాడుతున్నాడు అని అనుకోలేం. అయితే పవన్ కళ్యాణ్ లాంటివారికి కూడా తెలియదు అని అనుకోలేము. ఎందుకంటే ఆయన ఉప ముఖ్యమంత్రి.మరిసనాతనం అంటేఏమిటి? ఇది అని ఎందుకు చెప్పటంలేదు? అభ్యుదయవాదులు ఇంతటి అశాస్త్రీయ మనసనాతనాన్ని పాతరిపెట్టాలని కోరుకుంటారు. ఎందుకంటే అవన్నీ పాతకాలపు ఆచారాలు. వాటిని కాదని, ఈ కాలానికి అవి సరిపడవు అని ఎంతో ముందుకు పోతున్నాము.మరిసనాతనంకావాలనుకునేవారు ఆలోచించాలి.

- నార్నెవెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### శ్రమిస్తేనే ఫలితం దక్కుతుంది

పబ్లిక్ పరీక్షల్లో ఫలితాలు వెల్లడించిన తర్వాత కొంత మంది విద్యార్థులు వారి సహచర మిత్రులు కాస్త ఎక్కువ మార్కులు వచ్చిన తరుణంలో లేదా ఆశించిన ఫలితం రానప్పుడు కుంగుబాటు మరీ విపరీతమై అందరికీ బాధాకరమైన పనికి ఆలోచనారహితంగా సొంత నిర్ణయాలు తీసుకుంటున్నారు. పరీక్ష తర్వాత సంతృప్తి లేనప్పుడు వెంటనేరెండోమారు ప్రయత్నానికి పూర్తి ధ్యానంతో దృష్టి సారించాలి. జీవితంలో ఇదేమీ ఆఖరి ఛాన్సు కాదు. తోటి వారితో పోల్చుకోవడం సందర్భం కానేకాదు. చదువుమీద విశ్వాసం దానికి తగిన శ్రమ వారికి వారే పెంచుకోవాలి. బలహీనతధోరణిఎక్కడైనా కష్టాలుతెస్తుందని గుర్తెరగాలి.

- బి. మేఘనాదం, విశాఖపట్నం

### గౌరవ వేతనాలను తగ్గించాలి

రాష్ట్రంలో పశువుల సంఖ్య తగ్గింది. పశుగాణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పని చేస్తున్న గోపాల మిత్రల సేవలను రద్దు చేయాలి. వీరికి ఇచ్చే గౌరవ వేతనం వలన ప్రభుత్వానికి ఆర్థిక భారం పడుతుంది. వీరు గ్రామాలలో అవినీతిఅక్రమాలకు పాల్పడుతున్నారని కొన్ని చోట్ల వివాదాలు ఉన్నాయి. వీరిసేవలు నిలిపి వేస్తున్నట్లు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలి. గ్రామాలలో వీళ్ళు స్వచ్ఛంద సేవల పేరిట చందాలు వసూలు చేస్తున్నారు.

- రాపాక రవీందర్, జనగాం

### తెలుగుకు ప్రాముఖ్యతనివ్వాలి

ఈ విద్యాసంవత్సరంలో మన రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలను 6,17,827మంది రాయగా 5,26,677మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అందులో ప్రభుత్వ పాఠశాలలలో చదివిన బాల, బాలికలు అత్యధిక మార్కులు, ర్యాంకులు సాధించటంతో తల్లిదండ్రులందరూ సంతోష పడ్డారు. కానీ పదో తరగతి పరీక్షలలో తప్పిన వారిలో అత్యధిక మంది తెలుగు సబ్జెక్టులో తప్పటం తెలుగు భాషా వేత్తలు, భాషాభిమానుల హృదయాలను తీవ్ర నిరాశ పరుస్తోంది. రాష్ట్రంలో ఐదుకోట్ల మందికి మాతృభాషైన తెలుగు సబ్జెక్టులో ప్రభుత్వ పాఠశాలలోచదివిన విద్యార్థులు సైతం ఫెయిలవ్వటం శోచనీయం.తెలుగు సబ్జెక్టును బోధించే ఉపాధ్యాయుల లోపమా, విద్యార్థుల నిరాసక్తతా అనిసమీక్షించి సరిదిద్దుకోవాలి.మాతృభాషలోనే పట్టులేకుంటే ఇతర భాషలను ఎలా నేర్చుకుంటారు. కొంత మంది ఉపాధ్యాయులు కూడా తెలుగు నేర్పే ఏదో బోధిస్తున్నాములే అనుకుంటారు. కానీ అలా వ్యవహరించకుండా తెలుగు భాషను సరిగ్గా నేర్పాలి.

- సి.రామకృష్ణ, నల్గొండ జిల్లా

### తొలకరి జల్లుకు వేళయె...

వర్షాకాల సమయం ఆరంభం అవుతున్న శుభ తరుణంలో విత్తన నాటుకు సంసిద్ధంగా ఉన్న నా రైతన్నలు...ప్రతి ఏటా పెరుగుతున్న ఎరువుల ధరలు,వినియోగ వస్తువుల ధరలతో అప్పుల పాలుఅయిన పర్వాలేదు...అని మొక్కవోని ధైర్యంతో ప్రతి ఏడు నా సమాజానికి బుక్కెడు బువ్వ పెట్టాలని నిరంతరం శ్రమిస్తున్న నా రైతన్న సకాలంలో వర్షాలు పడి పాడిపంటలు పరిడవిల్లాలనీ ఆ ప్రకృతి కరుణిస్తేనే విజయం లేదంటే అపజయమే.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### ఆర్థిక వ్యవస్థ అల్లకల్లోలం!

పశ్చిమాసియా ఘర్షణ కేవలం ఆ ప్రాంత సరిహద్దులకే పరిమితం కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ గుండెకాయను తాకుతున్నాయి. ఈ ఘర్షణలు నేడు ప్రతి దేశపు వంటింటి బడ్జెట్‌ను, పారిశ్రామిక రంగాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ముఖ్యంగా అంతర్జాతీయ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిలో నెలకొన్న అనిశ్చితి, ప్రపంచ దేశాల ఇంధన భద్రతను ప్రశ్నార్థకం చేస్తోంది.నౌకల రాకపోకలు నిలిచిపోవడంతో సహజ వాయువు, చమురు ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక్కసారిగా ఎగబాకాయి. అందరూ ఖర్చులు తగ్గించుకొని పొదుపు పాటిస్తే బాగుంటుంది.

-ఎన్. నాగరాజు, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# బంగ్లాకు తరలిపోతున్న వలస ఓట్లు!

**చొరబాటుదార్లను గుర్తించడానికి ఎన్నికల కమిషన్ ఓటర్ల ప్రత్యేక గుర్తింపు కార్యక్రమం 'సర్' ను నిర్వహించింది. మైనార్టీలను ఏరివేసే మతతత్వ దురుద్దేశంతోనే నరేంద్ర మోడీ ప్రభుత్వం సర్ నిర్వహిస్తోందని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో రాద్ధాంతం చేసారు. చొరబాటుదార్ల ఓట్ల బ్యాంక్‌ను కాపాడుకోడానికి తృణమూల్ కాంగ్రెస్ అధినేత మమతా బెనర్జీ నల్లకోటు వేసుకుని సుప్రీం కోర్టు వరకూ వెళ్లారు. సెక్యులరిజం కాపాడుతామని చెప్పే మేధావులు సర్ కార్యక్రమానికి మతతత్వం అంటగట్టేసారు. పిటిషన్లతో విసిగిపోయిన సుప్రీం కోర్టు కూడా చివాట్లు పెట్టి 'వచ్చి పోయేవారికి భారత్ ధర్మసత్రం కాదని' తేల్చేసింది. అయినా మనవాళ్లు మతతత్వ వాదన మానుకోలేదు. లక్షలాది మంది చొరబాటుదార్లు బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లడం చూసి వీరంతా ఏమంటారో చూడాలి.**



సరికొండ రవీంద్రనాథ్

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమత బెనర్జీ ఓట్లన్నీ బంగ్లాదేశ్‌కు తరలిపోతున్నాయి. భారతదేశంలోకి వచ్చిన బంగ్లాదేశ్ చొరబాటు దార్లను ప్రభుత్వం వెనక్కు పంపించే పని మొదలు పెట్టడంతో సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.కాగా సరిహద్దులో ఉద్రిక్తతలను నివారించడానికి జూన్ 8వ తేదీన న్యూఢిల్లీలో డైరక్టర్ జనరల్ స్థాయి చర్చలు జరపాలని భారత్, బంగ్లా నిర్ణయించాయి. పశ్చిమ బెంగాల్‌లో సువేందు అధికారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత చొరబాట్లను నివారించడానికి కంచె నిర్మాణం ప్రారంభించారు. దీనితోబాటు మూడంచెలుగా 'అక్రమ వలసదార్లను గుర్తించడం, ఫేక్ గుర్తింపు కార్డుల రద్దు, దేశ బహిష్కరణ' కార్యక్రమాన్ని కఠినంగా అమలు చేస్తున్నారు. ఫలితంగా వేలాది మంది చొరబాటుదార్లు బంగ్లాదేశ్‌లోని సొంత గ్రామాలకు వెళ్లడానికి సరిహద్దులోని హాకీంపూర్ దగ్గరికి చేరుకుంటున్నారు. విశేషమేమంటే వీరంతా స్వచ్ఛందంగానే స్వదేశానికి వెళ్లిపోతున్నారు. సరిహద్దులో కంచె వేయడానికి పశ్చిమ బెంగాల్ అధికారులు ప్రయత్నించగా చొరబాటు దార్ల నుంచి, బిజిబి సిబ్బంది నుంచి హింసాత్మక ప్రతిఘటనలు ఎదురయ్యాయి. దీనితో కంచె వేయాల్సిన సుమారు 142 ఎకరాల భూభాగాన్ని (600 కిలోమీటర్ల దూరం) సరిహద్దు భద్రతా దళానికి (బిఎస్ ఎఫ్) పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి అప్పగించారు. సరిహద్దులోని కూచ్ బీహార్, జుల్పాయ్ గురి, డార్జిలింగ్, ఉత్తర్ దినాజ్ పూర్, దక్షిణ్ దినాజ్ పూర్, మాల్డా, ముర్షీదాబాద్, నదియా, ఉత్తర 24పరగణాల జిల్లాల్లో ఫెన్సింగ్ వేయాల్సిన ఈ భూభాగం విస్తరించి ఉంది. భారత్ బంగ్లా మధ్య 4వేల 96 కిలోమీటర్ల సరిహద్దుఉంది. ఇప్పటివరకూ 3 వేల 232 కిలోమీటర్ల కంచె నిర్మించారు. 174 కిలోమీటర్ల దూరం కంచె నిర్మించడానికి అవకాశం లేదు. సుమారు 600 కిలోమీటర్ల మేర మాత్రం కంచె నిర్మిస్తున్నారు. మమత బెనర్జీ అధికారంలో ఉన్నంతకాలం కంచె నిర్మించడానికి అనుమతి ఇవ్వలేదు. బిజెపి నేత సువేందు అధికారి ముఖ్యమంత్రి కావడంతో కంచె నిర్మాణంతోబాటు చొరబాటు దార్లను పంపించే ప్రక్రియ మొదలైంది. ఇప్పటి వరకూ సుమారు 30 లక్షల మంది చొరబాటుదార్లు బంగ్లాదేశ్‌కు వెళ్లిపోయారని అంచనా. మరో ఇరవై లక్షల మంది తమ దేశం వెళ్లిపోడానికి మూటాముల్లె సర్దుకుని సరిహద్దు దగ్గరికి చేరుకుంటున్నారు. చొరబాటుదార్లను గుర్తించడానికి మాల్టా, ముర్షిదాబాద్ జిల్లాల్లో చొరబాటుదార్ల శిబిరాలను ఏర్పాటు చేసారు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగానే చొరబాటు దారులను పంపించి వేయడానికి భారత్ ప్రయత్నిస్తోంది. పాస్‌పోర్ట్, వీసా,ఆధార్‌కార్డ్, ఓటర్ కార్డ్ ఇతర డాక్యుమెంట్లు, వారి స్టేట్‌మెంట్లు, చుట్టుపక్కల వారి నుంచి, ఇంటెలిజెన్స్ నుంచి సేకరించిన సమాచారం ఆధారంతో చొరబాటుదార్లను గుర్తిస్తున్నారు. ఇలా ఉండగా చొరబాటుదార్లను బలవంతంగా పంపించి వేయకూడదని, అంతర్జాతీయ చట్టాలను అమలు చేయాలని బంగ్లాదేశ్ కోరుతోంది. దౌత్య మార్గాల ద్వారానే చొరబాటు దార్లను తిరిగి పంపాలని అంటోంది. చొరబాటుదార్లను బలవంతంగా పంపిస్తే తాము 'తగిన చర్యలు తీసుకుంటామని' బంగ్లాదేశ్ విదేశాంగమంత్రి ఖలీలుర్ రహమాన్ భారత్‌ను హెచ్చరించారు. కానీ ఇటువంటి సమస్యలు దౌత్యం ద్వారా పరిష్కారం కావని గతంలో రుజువయింది. భారత్ దేశం సుమారు ఐదేళ్ల క్రితం 2,860 మంది చొరబాటు దార్ల పేర్లను బంగ్లాకు పంపించింది. కానీ వీరి జాతీయతను



ఇప్పటికీ బంగ్లా ప్రభుత్వం విచారించి తేల్చలేదు. లక్షలాది మంది గుర్తింపు ఎప్పటికి తేలుతుంది? దీనికి బంగ్లా నుంచి సమాధానం లేదు. అందుకే భారత్ తన దారిలో తను చొరబాటుదార్లను పంపించి వేస్తోంది. చీమ పుట్టల్లా బైట పడుతున్న చొరబాటు దార్లను చూసి ఇంతకాలం వీళ్ల ఎక్కడ ఉన్నారా అని ప్రపంచ దేశాలు విస్తుపోతున్నాయి. అస్సాంలో 20 లక్షల మంది చొరబాటుదార్లు ఉన్నట్టు అంచనా. కేరళ, తెలంగాణా నుంచి కూడా చొరబాటుదారులను ఎన్ఐఏ వెనక్కు పంపివేస్తోంది. చొరబాటుదార్లు స్వచ్ఛందంగా వెనక్కు వెళ్లడానికి భారత ప్రభుత్వ పట్టుదల ప్రధాన కారణం. కాగా మరో మూడు కారణాలున్నాయి. ఒకటి ఓట్లు లేకపోవడంతో నిన్నటి వరకూ చొరబాటుదార్ల చుట్టూ తిరిగిన రాజకీయ నాయకులు మొహం చాటేస్తున్నారు. రెండు రేషన్ కార్డుతో సహా అన్నిగుర్తింపు కార్డులు రద్దయిపోయాయి. మూడు తమను సమర్థించే మమతా బెనర్జీ ప్రభుత్వం అధికారంలో లేదు. ప్రభుత్వం తొలుత అరెస్టు చేసి నిర్బంధంలో ఉంచుతుంది.తర్వాత మూడేళ్ల వరకూ జైలు తప్పదు. దీనికి తోడు అక్రమంగా నిర్మించిన కట్టడాలన్నింటిని భద్రతా సిబంది కూల్చివేస్తున్నారు. ఇక భారతదేశంలో ఉండి ప్రయోజనం లేదని చొరబాటుదార్లే అభిప్రాయపడుతున్నారు. 'సర్' నివేదికను బట్టి పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో సుమారు ఎనభై లక్షలమంది చొరబాటు దార్లు ఉంటారని అంచనా. రాష్ట్ర జనాభా కోటి మంది. అంటే స్థానికుల సంఖ్యతో సమానంగా చొరబాటుదార్లు ఉన్నారన్న మాట. దీన్ని బట్టి స్థానికుల ఎన్ని కష్టాలు అనుభవిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. తమను త్వరగా తమ దేశానికి పంపించి వేయమని చొరబాటుదార్లు వేడుకుంటున్నారు. వీరంతా దళారులకు 5 వేల నుంచి పాతిక వేల వరకూ ఇచ్చి భారతదేశంలోకి చొరబడ్డారు. గుర్తింపు కార్డుల ప్యాకేజిని బట్టి దళారులు వీళ్ల దగ్గర డబ్బులు దండుకున్నారు. వీళ్లలో ఎక్కువ మంది మైనార్టీలు కావడం, ఓటు బ్యాంక్ పెరుగుతూండటంతో మమతా బెనర్జీ ప్రభుత్వం బహుముఖంగా చొరబాట్లను ప్రోత్సహించింది. వీరిలో ఎక్కువ శాతం గత ఐదేళ్లలో భారత దేశానికి వచ్చినవారే. వీరు చిన్న కూలీపని నుంచి లక్షల రూపాయల వ్యాపారాలు చేస్తున్నవారు ఉన్నారు. సరిహద్దులో చొరబాటుదార్లప్రత్యేక కాలనీలు కూడా కట్టుకున్నారు. పదేళ్ల క్రితం భారతదేశంలో ప్రవేశించిన చొరబాటు దార్ల దగ్గర కూడా బంగ్లాదేశ్ నేషనల్ ఐడెంటిటీ కార్డులు (గుర్తింపు కార్డులు) ఉండటం గమనార్హం. వీటిని చూపించి చొరబాటుదార్లు తిరిగి బంగ్లాదేశ్‌లోకి వెళ్లిపోతున్నారు.సరిహద్దులో ఉద్రిక్తతలు తీవ్రస్థాయిలో ఉండటంతో రెండు దేశాల మధ్య డైరక్టర్ జనరల్ స్థాయి ద్వైపాక్షిక సమావేశం జూన్ 8 న్యూఢిల్లీలో జరపాలని భారత్, బంగ్లాదేశ్ నిర్ణయించాయి. బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటువంటి సమావేశం ఏర్పాటు కావడం ఇదే మొదటిసారి.సరిహద్దులో సహకారం, నేరాల నియంత్రణ కోసంరెండు దేశాల మధ్య డిజి స్థాయి సమావేశాలు 1975లో ప్రారంభమయ్యాయి. 1993 నాటి నుంచి రెండు సంవత్సరాలకు ఒకసారి సమావేశాలు జరిగేవి. ఒకసారి ఢాకాలో, మరోసారి న్యూఢిల్లీలో నిర్వహించేవారు. జూన్ 8న జరగనున్న సమావేశంలో బంగ్లా తరపున డైరెక్టర్ జనరల్ మేజర్ జనరల్ మహ్మద్ అష్రఫుజ్జమాన్ సిద్దిఖీ, భారత్ తరపున బిఎస్ ఎఫ్ డైరెక్టర్ జనరల్ ప్రవీణ్ కుమార్ ఈ సమావేశంలో పాల్గొంటారు. చొరబాటు దార్లను గుర్తించడానికి ఎన్నికల కమిషన్ ఓటర్ల ప్రత్యేక గుర్తింపు కార్యక్రమం 'సర్' ను నిర్వహించింది. మైనార్టీలను ఏరివేసే మతతత్వ దురుద్దేశంతోనే నరేంద్ర మోడీ ప్రభుత్వం సర్ నిర్వహిస్తోందని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో రాద్ధాంతం చేసారు. చొరబాటుదార్ల ఓట్ల బ్యాంక్‌ను కాపాడుకోడానికి తృణమూల్ కాంగ్రెస్ అధినేత మమతా బెనర్జీ నల్లకోటు వేసుకుని సుప్రీం కోర్టు వరకూ వెళ్లారు. సెక్యులరిజం కాపాడుతామని చెప్పే మేధావులు సర్ కార్యక్రమానికి మతతత్వం అంటగట్టేసారు. పిటిషన్లతో విసిగిపోయిన సుప్రీం కోర్టు కూడా చివాట్లు పెట్టి 'వచ్చి పోయేవారికి భారత్ ధర్మసత్రం కాదని' తేల్చేసింది. అయినా మనవాళ్లు మతతత్వ వాదన మానుకోలేదు. లక్షలాది మంది చొరబాటు దార్లు బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లడం చూసి వీరంతా ఏమంటారో చూడాలి. ●

# ఫలరాజుల దిగుబడికి 'కాపు' కాసేదెవరు?

వరిగొండ నవీన్ కుమార్

ఈ యేడాది భారతీయ మామిడి పండ్ల ఎగుమతి విషయానికొస్తే కాస్త వెనుకబడి ఉన్నాం. జాతీయ స్థాయిలో ఉత్పత్తి పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నా క్షేత్రస్థాయిలో చూస్తే ఈ యేడాది తగినంత మామిడి కాపు జరుగలేదు. గత యేడాది ఎపెడా గణాంకాల ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారతదేశం సుమారు 29.93 మెట్రిక్ టన్నుల మామిడి పళ్లను ఎగుమతి చేయగా 56.5 మిలియన్ అమెరికన్ డాలర్ల రాబడి రాబట్టింది. మామిడి పండ్లు భారత్ నుంచి అరబ్ దేశాలు, అమెరికా యునైటెడ్ కింగ్ డమ్, కువైట్, ఖతార్ ప్రాంతాలకు ఎగుమతి చేసి సాలీనా 80 మిలియన్ డాలర్లకుపైగా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జిస్తున్నాం. మామిడి పల్ప్, జ్యూస్, ప్రాసెస్డ్ ఉత్పత్తుల ఎగుమతులు గణనీయంగా ఉన్నాయని చెప్పకుంటున్నా ఆల్ఫోన్సా వంటి విలువైన మామిడి పండ్ల ఎగుమతి బాగా తగ్గింది. ప్రధానంగా మహారాష్ట్రలో తీవ్రమైన వాతావరణ మార్పుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో 50 శాతం నుండి 90 శాతం వరకు దిగుబడి తగ్గింది. ఏదో మామిడి సాగు దిగుబడులతో విదేశీ మారక ద్రవ్యం ఆర్జిస్తున్నామని గొప్పగా చెప్పుకోడానికి ఉన్నా ఆ వెరైటీ మామిడి సాగును పెంచుకునేందుకు ప్రస్తుతమున్న ప్రయత్నాలు చాలవు. వాతావరణ ప్రభావంతో ఈసారి మామిడి సాగులో రైతు ఎంతో నష్టం అనుభవించాడు. తరచు ప్రకృతి బీభత్సంతో



అకాల వర్షాలతో పూత రాలిపోయింది. దిగుబడి తగ్గింది. ఈ సీజన్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్‌లలో మామిడి పుష్పదశలో ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులు, అకాల వర్షాలు, వడగళ్ల వానల ప్రభావంతో పూత, పిందె రాలిపోయి మామిడి సాగు పెద్ద సవాలే ఎదుర్కొంది. ప్రపంచంలోనే భారత్ అతిపెద్ద మామిడి ఉత్పత్తికాగా మామిడి ఉత్పత్తుల్లో 19శాతం మాత్రమే ఈసారి ఎగుమతులకు నోచుకుంది. ఈసారి ఎగుమతుల్లో షిప్‌మెంట్లు 40 శాతం తగ్గిందని అంచనా. ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ తన 'మన్ కీ బాత్' 134 ఎపిసోడ్ కార్యక్రమంలో మామిడి ప్రాధాన్యతను ప్రస్తావించారు. దేశంలో ఒక్కో ప్రాంతంలో ఒక్కోరకపు మామిడి పండ్లకు అనుకూలంగా ఉండి సాటిలేనివిగా మార్పుచెందాయని వివరించారు.దక్షిణ భారతదేశంలో బంగెన పల్లి తోతాపురి, నీలం, మాల్గో రకాలుఊరిస్తాయి.అటు ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లో సువర్ణ ముఖి రకాలు విరివిగా పండుతున్నాయని, ఉత్తరప్రదేశ్‌లో దశహరీ, బెంగాల్‌లో హిమసాగర్ విరివిగా పండుతున్నాయి. కాశీలోని లాంగ్రా రకం మామిడి పండిన తర్వాత కూడా ఆకుపచ్చగానే ఉంటాయి. కానీ ఎగుమతి చేసే విధంగా ప్రతిసీజన్‌కు ముందుగానే మామిడి తోటలవృద్ధికి, యజమాన్యానికి తోడ్పడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది.భవిష్యత్తులో వాతావరణ మార్పులకు తట్టుకునేసాగు పద్ధతులు, విలువ ఆధారిత ప్రాసెసింగ్, బలమైన ఎగుమతి విధానాలపై నిర్ణయాలు తీసుకోవడం అవసరం. ●

# నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లేదా?

పాపని నాగరాజు

దేశంలో ఉద్యోగ నియామకాల చుట్టూ పెరుగుతున్న అసంతృప్తి కేవలం నిరుద్యోగ సమస్యకు సంబంధించినది మాత్రమే కాదు. ఇది నియామక వ్యవస్థపై యువతలో పెరుగుతున్న నమ్మక సంక్షోభానికి ప్రతిబింబం. ఒకవైపు ప్రభుత్వాలు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని, నిరుద్యోగం తగ్గుతోందని గణాంకాలు చెబుతుండగా, మరోవైపు నేలమీద యువత అనుభవం పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది. నియామకాల ఆలస్యాలు, పారదర్శకత లోపం, పేపర్ లీకులు, కోర్టు వివాదాలు, సమాచార అస్పష్టత, ఫలితాలపై అనుమానాలు వంటి అంశాలు యువతలో తీవ్రమైన అనిశ్చితిని పెంచుతున్నాయి. ఈ సంక్షోభం అందరినీ సమానంగా ప్రభావితం చేయడం లేదు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోనూ, పట్టణ పేదలలోనూ మొదటి తరంలో విద్యావకాశాలు పొందుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ దళితబహుజన యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కేవలం ఉపాధి అవకాశాలు మాత్రమే కావు, అవి సామాజిక భద్రత,గౌరవం, కుటుంబ ఆర్థిక స్థిరత్వం, తరతరాల వెనుకబాటుతనాన్ని అధిగమించే మార్గం కూడా. అందువల్ల నియామక వ్యవస్థలో ఏర్పడుతున్న అవకతవకలు, ఆలస్యాలు, అపారదర్శక విధానాలు వీరిపైనే ఎక్కువ ప్రభావం చూపుతున్నాయి. లక్షలాది రూపాయలు అప్పులు చేసి, హైదరాబాద్‌లో కొన్నిప్రాంతాల్లో చిన్న చిన్న గదుల్లో సంవత్సరాల తరబడి జీవిస్తూ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత పరిస్థితి ఈ సంక్షోభ తీవ్రతను స్పష్టంగా చూపిస్తోంది.కుటుంబాల ఆశలు, అప్పులు,భవిష్యత్తు అన్నింటినీ భుజాలపై మోస్తూ చదువుతున్న యువతకు చివరికి ఎదురవుతున్నవి వాయిదాలు, రద్దయిన పరీక్షలు, కోర్టు కేసులు, అనిశ్చితి. ఒక విద్యార్థి కష్టపడి చదివితే ఉద్యోగం సాధించగలడనే ప్రాథమిక సామాజిక నమ్మకాన్నే నియామక వ్యవస్థలోని అవ్యవస్థ దెబ్బతీస్తోంది. దేశంలో నిరుద్యోగ పరిస్థితిపై అధికారిక గణాంకాలు కొంత మెరుగుదల కనిపిస్తున్నాయని చెబుతున్నాయి. కానీ అదేగణాంకాలు యువతకు స్థిరమైన, నాణ్యమైన ఉద్యోగ అవకాశాలు తగ్గుతున్నాయని కూడా సూచిస్తున్నాయి. సంఖ్యలు ఆశాజనకంగా కనిపిస్తున్నప్పటికీ, నేలమీద యువత అనుభవం మాత్రం భిన్నంగా ఉంది. ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల జరిగిన 69 వేల ఉపాధ్యాయ నియామకాలపై వచ్చిన నిరసనలు ఈ విభేదానికి స్పష్టమైన ఉదాహరణ. తెలంగాణలో టీఎస్‌పీఎస్‌సీ పరీక్షల రద్దులు, గురుకుల నియామకాలపై వచ్చిన వివాదాలు కూడా ఇదే ఆందోళనను మరింత పెంచాయి. దీంతో ఉద్యోగాల సంఖ్యకంటే వాటి నియామక ప్రక్రియపై నమ్మకమే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. కాన్పూర్‌లో జరిగిన గందరగోళమో, తెలంగాణలో జరిగిన పేపర్ లీకేజీలో కావొచ్చు, రాజకీయ పార్టీలు అధికారంలోకి రాకముందు యువతకు భారీ హామీలు ఇస్తాయి. ఉద్యోగాలు, పారదర్శక నియామకాలు,యువత భవిష్యత్తు గురించి గొప్పగా మాట్లాడుతాయి.కానీ అధికారంలోకి వచ్చినతర్వాత మాత్రం నియామకాల విషయంలో అదే నిర్లక్ష్యం,అదే ఆలస్యం,అదేఅపారదర్శకత కొనసాగుతోంది. ఎన్నికల సమయంలో యువతను 'దేశ భవిష్యత్తు' అంటున్న రాజకీయ పార్టీలు, అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం నియామకాల విషయంలో చీఫ్‌గా, బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు పెరుగుతున్నాయి.కాన్పూర్ కావచ్చు, తెలంగాణ కావచ్చు పార్టీలు వేర్వేరు అయినా నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న అవ్యవస్థ మాత్రం ఒకేలా కనిపిస్తోంది. నేటి నియామక వ్యవస్థలో ప్రధానసమస్య ఉద్యోగాల కొరత మాత్రమేకాదు, వాటి చుట్టూ ఉన్న సమాచార స్పష్టత లేకపోవడమూ ఒక పెద్ద సమస్య. తెలంగాణ గురుకుల నియామకాల సందర్భంలో ఒకే బోర్డు నిర్వహించిన ప్రక్రియలో పీజీటీ అభ్యర్థులకు మార్కులు, రెస్పాన్స్ షీట్లు చూసుకునే అవకాశం ఉండగా, టీజీటీ అభ్యర్థులకు అదే అవకాశం లేకపోవడంవివక్ష, అపారదర్శకత ఆరోపణలకు దారితీసింది. ఒకే విధానంలో నిర్వహించిన పరీక్షల్లో సమాచారం అందుబాటులో తేడాలుఉండటం పారదర్శకతపై ప్రశ్నలు లేవనెత్తుతుంది. ఫలితాల ప్రకటన కేవలం ఎంపిక జాబితాతో ముగియకూడదు. ప్రతి



అభ్యర్థికి తన మార్కులు, కట్‌ఆఫ్‌లు, ఎంపిక ప్రమాణాలు స్పష్టంగా తెలిసే విధానం అవసరం. లేకపోతే నియామక వ్యవస్థపై అనుమానం పెరుగుతూనే ఉంటుంది. నియామక వ్యవస్థలో పారదర్శకత లోపం, ఆలస్యాలు, అనిశ్చితి వంటి సమస్యలు అందరినీ ప్రభావితం చేసినప్పటికీ, వాటి తీవ్ర ప్రభావం ప్రధానంగా దళితబహుజన యువతపైనే పడుతోంది.గ్రామీణ ప్రాంతాల్లోనూ,పట్టణ పేదలలోనూ మొదటి తరంలో విద్యావకాశాలు పొందుతున్న యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు జీవిత మార్పుకు కీలక ఆధారం.ఇప్పటికీ భూములు, వ్యాపారాలు, ప్రైవేట్ ఆర్థిక వనరులు అధికంగా కొన్ని అగ్రకుల వర్గాల చేతుల్లోనే కేంద్రీకృతమై ఉన్న నేపథ్యంలో, ఎస్సీ, ఎస్టీ, బీసీ యువత ప్రధానంగా విద్య, ప్రభుత్వ ఉద్యోగాల ద్వారానే ఎదుగుదలను ఆశ్రయిస్తున్నారు. అందువల్ల నియామకాలలో జరిగే ఆలస్యాలు, అవకతవకలు, అపారదర్శకత వీరిపైనే ఎక్కువ నష్టం మోపుతున్నాయి. నోటిఫికేషన్ల ఆలస్యాల వల్ల వయోపరిమితి దాటిపోతున్న అభ్యర్థుల్లో పెద్దసంఖ్య దళితబహుజన యువతదే. కుటుంబ ఆర్థిక బలహీనతల మధ్య సంవత్సరాల తరబడి సిద్ధమవుతున్న వారికి ఈ ఆలస్యాలు తిరిగి కోలుకోలేని నష్టంగా మారుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగం రాక, ప్రైవేట్ రంగంలో స్థిరపడలేకపోవడంవల్ల అనేక మంది తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. యువత పెద్ద సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగాల వైపు రావడాన్ని కొంత సామాజిక ఆధిపత్య వర్గాలు అసహనంతో చూడటం కూడా కనిపిస్తోంది. నియామక వ్యవస్థలో ఏర్పడుతున్న అనుమానాలు, వివాదాలు ఈ అసమాన సామాజిక నిర్మాణంతో సంబంధం లేకుండా చూడలేం. మన దేశ సామాజిక వ్యవస్థలో అణగారిన వర్గాలకు విద్య, అధికార, రాజ్యపాలన హక్కులను నిరాకరించిన మనుధర్మ ఆధారిత సామాజిక నిర్మాణం చారిత్రకంగా పనిచేసింది. 'విద్య', 'అధికార', 'రాజ్యపాలన' కొన్ని వర్గాలకే పరిమితమవ్వాలని భావించిన ఆ సామాజిక దృక్పథం ఆధునిక రాజ్యాంగ విలువలకు విరుద్ధం. రాజ్యాంగం సమాన అవకాశాల దిశగా మార్గం చూపించినప్పటికీ, నియామక వ్యవస్థలో కనిపిస్తున్న అసమానతలు ఇంకా సామాజిక న్యాయం పూర్తిగా సాధ్యపడలేదనే ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. వ్యవస్థపై విశ్వాసం కోల్పోతే అది కేవలం ఉద్యోగ సమస్యగా మిగలదు. ప్రజాస్వామ్యంపై నమ్మక సంక్షోభంగా మారుతుంది. ●

## తిరుమల సమాచారం



### హనుమంత వాహనంపై కల్యాణవేంకటేశ్వరుడు

**తిరుమల, జూన్ 2 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి జిల్లా నారాయణవనంలోని పద్మావతి సమేత కల్యాణవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం హనుమంత వాహనసేవ అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం 7.30 గంటలకు కల్యాణ వేంకటేశ్వరస్వామి హనుమంత వాహనంపై దివ్యమంగళ స్వరూపంతో భక్తులకు దర్శనమిచ్చి అభయప్రదానం చేశారు. భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలు, మంగళ వాయిద్యాల నడుమ వాహనసేవ భక్తిరసపూరితంగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పిస్తూ గోవింద నామస్మరణలతో స్వామివారిని దర్శించుకుని ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. సాయంత్రం వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి బంగారు తిరుచ్చిపై నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7గంటలకు గజవాహనంపై స్వామివారు భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ నాగరత్న, సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, చెంగల్ రాయులు, ఆలయ అర్చకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



### కల్యాణవెంకన్నకు శ్రీవారి కాసులహారాలు

**తిరుమల, జూన్ 2 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి జిల్లా నారాయణవనం కల్యాణవెంకన్న ఆలయంలో జరిగే స్వామివారి వాహనసేవల్లో అలంకరించేందుకు కాసుల హారాన్ని తిరుమల ఆలయం నుండి తీసుకెళ్ళారు. మంగళవారం ఉదయం తిరుమల ఆలయంలో శ్రీవారి పాదాలచెంత ఉంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయ మాఢవీధుల ద్వారా నారాయణవనంకు తీసుకెళ్ళారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



### వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలకు
## కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుమల, జూన్ 2 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి అనుబంధంగా ఉన్న చిత్తూరు జిల్లా కార్వేటినగరంలో వెలసిన రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు ముందుగా నిర్వహించే పవిత్ర కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం మంగళవారం ఉదయం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఆగమ సంప్రదాయాల ప్రకారం ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పులు, పూజా సామగ్రి తదితరాలను పవిత్ర జలాలతో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం, కుంకుమ, కిచిలీగడ్డ వంటి సుగంధ ద్రవ్యాలతో తయారు చేసిన పవిత్ర మిశ్రమాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేసి ఆధ్యాత్మిక పరిమళాలతో ఆలయాన్ని నింపివేశారు. ఈ మహోన్నత కార్యక్రమం అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. జూన్ 6 నుండి 14 వరకు వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ప్రతిరోజూ ఉదయం, రాత్రి వైభవోపేత వాహనసేవలు జరుగుతాయి.



### జ్ఞానమ్మకు వడ్డాణం బహూకరణ


**శ్రీకాళహస్తి, జూన్ 2 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారికి కరీంనగర్ ఆసిఫ్‌నగర్ వాసులు వెండి వడ్డాణంను బహూకరించారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన తుల భాస్కర్‌రావు కుటుంబ సభ్యులతో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. మొక్కులు తీర్చుకున్నారు. ఈ నేపథ్యంలో 480 గ్రాములు వెండి వడ్డాణంను తయారు చేసి అందించారు. ఈ వడ్డాణంను ఆలయ ఎఇఒ మోహన్ ద్వారా అకౌంటెంట్ యుగంధర్, అప్రైజర్ బాలాజిలకు అందించారు. వారికి ఆలయ మర్యాదలతో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనంతో పాటు స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు. వేదపండితులతో ఆశీర్వచనాలు అందించారు.

### భక్తి శ్రద్ధలతో గురు సంక్రమణ పూజలు



**శ్రీకాళహస్తి, జూన్ 2 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం గురు గ్రహం రాశి మారిన సందదర్భంగా గురుదక్షిణా మూర్తికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకారాలు నిర్వహించారు. మంగళవారం మూలా నక్షత్రం రోజు మిధునరాశి నుంచి కర్కాటక రాశి లోకి మారిన సందర్భంగా భక్తి శ్రద్ధలతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొనగా పూజలను సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, ఆలయ ఇఒ బికె వెంకటేశులు, ధర్మకర్తల మండలి సభ్యులు వాకచర్ల గురప్పశెట్టి, నాగరాజు, విజయమ్మ హాజరు కాగా ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్, సంబంధం గురుకుల్ పర్యవేక్షణలో గురు సంక్రమణ సంబరాలను ఘనంగా నిర్వహించారు.

# లేటరైట్ మైన్ వర్గీకరణలో మార్పులపై
# కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి సిఎం చంద్రబాబు లేఖ



- కేంద్రం తెచ్చిన మార్పులతో ఎపికి వచ్చిన ఇబ్బందులు లేఖలో ప్రస్తావన
- కేంద్ర నిర్ణయంతో గనుల లీజు ప్రక్రియ ఆగిందని ముఖ్యమంత్రి వెల్లడి

**విజయవాడ, జూన్ 2 ప్రభాతవార్త ప్రతినిధి:** లాటరైట్ మైన్ వర్గీకరణలో జరిగిన మార్పులపై కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖ రాశారు. లాటరైట్‌లో అల్యూమినియం శాతం 20 లేదా అంతకంటే ఎక్కువ ఉంటే, దాన్ని ఉప ఖనిజంగా కాకుండా బాక్సైట్‌గా పరిగణించాలంటూ ఇటీవల కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మార్పుల వల్ల ఏపీ ఎదుర్కొంటున్న ఇబ్బందులను సిఎం చంద్రబాబు లేఖలో ప్రధానంగా ప్రస్తావించారు. కేంద్రం నిర్ణయం వల్ల ఎపిలో గనుల లీజుల ప్రక్రియ స్తంభించిపోయిందని తెలిపారు. కొత్త నిబంధనలతో గతంలో మైనర్ మినరల్ కింద ప్రాసెస్ చేసిన 402 గనుల లీజు దరఖాస్తులను రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసిందని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. నిలిచిపోయిన వాటిలో 19 లెటర్ ఆఫ్ ఇంటెంట్ దరఖాస్తులు, 113 ప్రభుత్వ భూముల దరఖాస్తులు, 255 అటవీ భూముల దరఖాస్తులు, 15 పట్టా భూముల దరఖాస్తులు ఉన్నాయని చంద్రాబాబు లేఖలో వివరించారు.

అదే విధంగా పాత నిబంధనల మేరకు దరఖాస్తు రుసుం, భూముల కొనుగోళ్లు, అటవీ అనుమతుల కోసం వందలాది మంది దరఖాస్తుదారులు కోట్లాది రూపాయలు ఖర్చు చేశారని లేఖలో సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. గతంలో మైకా, క్వార్ట్జ్, ఫెల్డ్‌స్పార్, బారైట్స్ ఖనిజాలను మైనర్ నుంచి మేజర్ ఖనిజాలుగా మార్చినప్పుడు కేంద్రం సేవింగ్ క్లాజ్ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇప్పుడు అదే తరహాలో లాటరైట్ ఖనిజానికి కూడా సేవింగ్ క్లాజ్ ఇవ్వాలన్నారు. దీని ప్రకారం పెండింగ్‌లో ఉన్న 402 దరఖాస్తులను పాత రూల్స్ కిందనే ప్రాసెస్ పూర్తి 2 ఏళ్ల వెసులుబాటు ఇవ్వాలని కేంద్రాన్ని సీఎం కోరారు. సడలింపు ఇస్తే వందలాది మంది దరఖాస్తుదారులకు ఆర్థిక నష్టం తప్పుతుందని, కోర్టు వివాదాలు రావని లేఖ ద్వారా వెల్లడించారు. సేవింగ్ క్లాజ్ అమలు చేస్తే సిమెంట్, ఐరన్ ఓర్, రోడ్డు నిర్మాణ పరిశ్రమలకు ముడిసరుకు కొరత లేకుండా ఉపాధి నిలబడుతుందని లేఖలో సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## మద్యం దుకాణాలు, బార్ల వద్ద ప్రకటన బోర్డుల నిషేధం

### ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర



**విజయవాడ, జూన్ 2 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో మద్యం దుకాణాలు, బార్ల వద్ద ఏర్పాటు చేసిన వివిధ ప్రకటన బోర్డులు, హోర్డింగులు, ఫ్లెక్సీలు తదితర అన్ని రకాల ప్రచార సామగ్రిని తొలిగించాలని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ కమీషనర్ చామకూరి శ్రీధర్‌కు తొలిగింపు ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. ఇటీవల నిర్వహించిన ఎక్సైజ్ శాఖ సమీక్ష సమావేశంలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే జిల్లా స్థాయి అధికారులకు, అసిస్టెంట్, డిప్యూటీ కమిషనర్లకు ఈ విషయంపై కమీషనర్ మార్గదర్శకాలు జారీ చేసారు. దీనికి అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ, మద్యం విక్రయ కేంద్రాలు, బార్ల వద్ద ఉన్న ప్రకటన బోర్డులపై నిషేధం అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల అమలులో ప్రతి ఒక్కరూ సహకరించాలని మద్యం దుకాణాలు, బార్ యాజమాన్యాలకు అధికారులు సూచించారు. భవిష్యత్తులో కూడా ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని మంత్రి రవీంద్ర స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘిస్తూ ఎటువంటి ప్రకటనలు లేదా ప్రచార సామగ్రిని ఏర్పాటు చేసినా సంబంధిత నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# దేశ ప్రగతికి ఆరోగ్య సంరక్షణే కేంద్ర బిందువు

- డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 29, 30వ సంయుక్త స్నాతకోత్సవాల్లో గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్

**విజయవాడ, జూన్ 2 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆరోగ్య సంరక్షణ దేశ ప్రగతికి కేంద్ర బిందువుగా మారిందని రాష్ట్ర గవర్నర్, డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం కులపతి జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. నాణ్యమైన, అందుబాటులో ఉండే, అందరికీ సమానంగా చేరువయ్యే వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో దేశం ముందుకు సాగుతోందన్నారు. మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 29వ, 30వ సంయుక్త స్నాతకోత్సవాలకు ఆయన అధ్యక్షత వహించి స్నాతకోత్సవ ప్రసంగం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వైద్య విద్య, ఆరోగ్య మౌలిక వసతులు, ప్రజారోగ్య సేవల విస్తరణ ద్వారా ఈ లక్ష్య సాధనకు కృషి చేస్తోందని గవర్నర్ తెలిపారు. వైద్య రంగానికి విశిష్ట సేవలను యూనివర్సిటీ అందించిందన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వైద్య, ఆరోగ్య విజ్ఞాన విద్యలో విశిష్టమైన వారసత్వాన్ని నిర్మించుకుందని, వైద్యులు, దంతవైద్యులు, నర్సులు, ఫార్మసిస్టులు, ఫిజియోథెరపిస్టులు, అనుబంధ ఆరోగ్య నిపుణులను తీర్చిదిద్దుతూ దేశ విదేశాల్లో ఆరోగ్య సేవల బలోపేతానికి దోహదపడిందని గవర్నర్ కొనియాడారు. విద్యార్థులు ప్రజాసేవ, మానవ గౌరవ పరిరక్షణకు జీవితాన్ని అంకితం చేసిన డాక్టర్ ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగించాలని సూచించారు.

**డిఎండిసి కేంద్రం ఏర్పాటు అభినందనీయం:** విశ్వ విద్యాలయంలో సమీకృత వ్యాధి పర్యవేక్షణ కార్యక్రమం కింద ఏర్పాటు చేసిన 'డిసీజ్ మోడలింగ్ అండ్ డెసిషన్ ఇంటెలిజెన్స్ సెంటర్'ను గవర్నర్ అభినందించారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థల సహకారంతో వ్యాధుల అంచనా, విశ్లేషణ, నిర్ణయాల రూపకల్పనలో నిపుణులను తీర్చిదిద్దే ఈ కేంద్రం శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా పనిచేస్తుందని పేర్కొన్నారు.

విద్యార్థులు యోగా, ధ్యానం సాధన చేయాలని, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించాలని, తగిన విశ్రాంతి, నిద్రకు ప్రాధాన్యత ఇవ్వాలని గవర్నర్ సూచించారు. శారీరక, మానసిక ఒత్తిడిని అధిగమించి, జీవితాంతం నేర్చుకునే అలవాటు పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. 29వ స్నాతకోత్సవ ముఖ్య అతిథి, హైదరాబాద్ ఏఐజీ ఆసుపత్రుల అరిథ్మియా,



ఎలక్ట్రోఫిజియాలజీ సేవల డైరెక్టర్ డాక్టర్ సి.నరసింహన్‌కు డాక్టర్ ఆఫ్ సైన్స్ (డి.ఎస్‌సి.) పట్టా ప్రదానం చేశారు. 30వ స్నాతకోత్సవంలో హైదరాబాద్ అపోలో ఆసుపత్రుల కార్డియాక్ సైన్సెస్ విభాగం డైరెక్టర్, హెచ్‌వోడీ డాక్టర్ పి.సి.రాత్‌కు డాక్టర్ ఆఫ్ సైన్స్ (డి.ఎస్‌సి.) పట్టా ప్రదానం చేశారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ పి. చంద్రశేఖర్ యూనివర్సిటీ వార్షిక నివేదికను సమర్పించి విద్య, పరిశోధన, సాంకేతికత, విద్యార్థుల సంక్షేమ రంగాల్లో సాధించిన పురోగతిని వివరించారు. అనంతరం ఉపకులపతి డాక్టర్ పి. చంద్రశేఖర్ గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను జ్ఞాపికతో సత్కరించారు.

## విజయవంతంగా తుంగభద్ర డ్యాం 33 గేట్లు మార్పిడి

**విజయవాడ, జూన్ 2 ప్రభాతవార్త:** రాయలసీమ ప్రాంతానికి జీవనాధారమైన తుంగభద్ర డ్యాం గేట్లను ఒకేసీజన్‌లో విజయవంతంగా మార్పిడి చేసి కొత్తగేట్లను అమర్చామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మంగళవారం అమరావతిలోని సచివాలయంలో మంత్రి నిమ్మల రామానాయుడును తుంగభద్ర బోర్డు చైర్మన్ ఎస్.ఎన్.పాండే మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి డ్యాం గేట్ల మార్పిడి గురించి వివరించారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ రికార్డు సమయంలో గేట్లమార్పిడి విజయవంతంగా పూర్తిచేసిన ఇంజనీరింగ్ నిపుణులను అభినందించారు. తుంగభద్ర డ్యాం గేట్లు ప్రమాదకరంగా ఉన్నాయని, ఏక్షణమైనా గేట్లు దెబ్బతినే ప్రమాదం పొంచి ఉందని గత ప్రభుత్వ హయాంలో నిపుణులు సూచించినా ఐదేళ్ళపాటు అప్పటి ముఖ్యమంత్రి జగన్ పట్టించుకోలేదని



మంత్రి నిమ్మల రామానాయుడికి పుష్పగుచ్ఛం అందిస్తున్న తుంగభద్ర బోర్డు చైర్మన్ పాండే

ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తుంగభద్ర డ్యాంలో కొట్టుకుపోయిన 19వ నెంబర్ గేటును భారీ వరదలో స్టాప్‌లాగ్ గేట్ ఏర్పాటు చేసి 80టియంసిల నీటిని వృధా కానీయకుండా ఆపి రాయలసీమకు తాగు, సాగునీటిని అందించామని వివరించారు. తుంగభద్రడ్యాం గేట్ల మార్పిడి అవసరాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 6నెలల్లో కొత్తగేట్లు పూర్తిచేయించారని మంత్రి పేర్కొన్నారు. సాగునీటిరంగ నిపుణులు కన్నయ్యనాయుడి సూచనల మేరకు 70ఏళ్ళ క్రితం ఏర్పాటు చేసిన గేట్లను ఒక్క సీజన్‌లోనే రూ.51 కోట్ల వ్యయంతో 33 గేట్లను మార్చినట్లు వివరించారు. ఈనెలాఖరున కర్నాటక, ఆంధ్రా ముఖ్యమంత్రులు కొత్త ఏర్పాటు చేసిన డ్యాంగేట్లను ప్రారంభిస్తారని మంత్రి నిమ్మల వివరించారు. తుంగభద్ర డ్యాం కింద మన రాష్ట్రంలో 7.20లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

## 7 నుండి యోగా ప్రత్యేక కార్యక్రమాలు

**విజయవాడ, జూన్ 2 ప్రభాతవార్త:** ఈనెల 21 తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 7వ తేదీ నుండి 21 వరకు విజయవాడలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా తెలిపారు. యోగాంధ్ర-26 కార్యక్రమాలపై కలెక్టరేట్‌లో మంగళవారం లక్ష్మీశా అధికారులతో సమావేశం నిర్వహించారు.



ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గతేడాది యోగాంధ్రను విజయవంతంగా నిర్వహించి అందరికీ ఆదర్శంగా నిలిచామని, ప్రపంచ రికార్డులు సైతం సొంతం చేసుకున్నామని గుర్తుచేసారు. అదే స్ఫూర్తితో ఈఏడాది యోగాంధ్రను విజయవంతం చేసేందుకు అన్ని ప్రభుత్వశాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా థీమాటిక్ యోగాలో భాగంగా ఎన్‌టిఆర్ జిల్లాలో పోలీస్ థీమ్‌తో యోగా కార్యక్రమం జరుగుతుందన్నారు. టూరిజం యోగాలో భాగంగా ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద, హరిత బెరంపార్కులోనూ ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా పాఠశాలలు, వైద్యశాలలు, పార్కులు, మైదానాలు, తదితర ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. కామన్‌యోగా ప్రోటోకాల్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ వై.రత్నప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

**యువశక్తికి కొత్త నిర్వచనం యూత్‌బ్యాంక్**

యువశక్తికి కొత్తనిర్వచనం యూత్‌బ్యాంక్ అని ఎన్‌టిఆర్ కలెక్టర్ లక్ష్మీశా పేర్కొన్నారు. విజయవాడ ప్రభుత్వ వైద్యశాల (జిజిహెచ్)లో వినూత్నంగా అమలు చేస్తున్న యూత్ టైంబ్యాంక్ సేవలు గత 7 3 ం జు ల ౦ గా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల, ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ కళాశాల విద్యార్థులు, వాసవ్య మహిళామండలి వాలంటీర్లు, జిజిహెచ్‌లో రోగులకు స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్నారు. మంగళవారం కలెక్టర్ జిజిహెచ్‌లో యూత్‌టైంబ్యాంక్ సేవలను పరిశీలించారు.

ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత ఖాళీ సమయాల్లో ఇటువంటి సమాజసేవా కార్యక్రమాల్లో పాల్గొనటం అభినందనీయమన్నారు. ప్రతిసోమవారం విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదికలోనూ యూత్‌టైం బ్యాంక్ సేవలు అందించటం మైలురాయిగా నిలుస్తుందన్నారు. కనక దుర్గగుడిలోనూ ఈసేవలు అందించాలని కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా సూచించారు.

### నేటి నుంచి కేరళంలో మంత్రి దుర్గేష్ పర్యటన

**విజయవాడ, జూన్ 2 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. దక్షిణాదిలోనే అతిపెద్ద ట్రావెల్ అండ్ ట్రేడ్ ఎక్స్‌పో అయిన గ్లోబల్ ట్రావెల్ మార్కెట్ ఆంధ్రప్రదేశ్‌ను బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్‌గా ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో తిరువనంతపురంలో జరగనున్న జీటీఎం ఎక్స్‌పో 2026లో పాల్గొని ప్రతిష్టాత్మకమైన మెట్రో ఎక్స్‌పెడిషన్ జీటీఎం టూరిజం అవార్డు 2026ను స్వీకరించేందుకు మంత్రి కందుల దుర్గేష్ మూడు రోజుల కేరళం పర్యటనకు బయలుదేరారు. ఈ పర్యటనలో భాగంగా జూన్ 3న తిరువనంతపురంలోని కోవాలం ఉదయ్ సముద్ర లీజర్ బీచ్ హోటల్ అండ్ స్పాలో జరిగే జీటీఎం ఎక్స్ పో ప్రారంభోత్సవంలో మంత్రి దుర్గేష్ పాల్గొంటారు. 4న గోల్డెన్ ప్యాలెస్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే ఎక్స్ పో కార్యక్రమాలకు హాజరవుతారు. జీటీఎం అవార్డ్స్- 2026 వేడుకలో దేశవిదేశాల ప్రముఖుల సమక్షంలో ఎపికి దక్కిన బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్ అవార్డును మంత్రి దుర్గేష్ అందుకోనున్నారు.

### అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

**తిరుమల, జూన్ 2 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో కళ్యాణి సత్రాలు, సిఆర్ఒ నూతన భవనాల నిర్మాణానికి సంబంధించిన డిజైన్లను టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి పరిశీలించారు. ఎస్వీ మ్యూజియంకు సంబంధించిన అభివృద్ధి పనుల పురోగతిని ఆయన సమీక్షించి, ఈ పనులన్నింటినీ నిర్దేశిత సమయం లోపల పూర్తి చేయాలని సంబంధిత అధికారులను చౌదరి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో తిరుమలలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై అదనపు ఇఒ వెంకయ్యచౌదరి సమీక్షించారు. ఇందులో భాగంగా ఆయన సివిల్, ఎలక్ట్రికల్, వాటర్ వర్క్సుకు సంబంధించిన పనుల పురోగతిని సమీక్షించారు. టిటిడి సిఇ సత్యనారాయణ, ఎస్ఇ వేణుగోపాల్, ఇఇలు శ్రీనివాసరావు, సుధాకర్, డిఇ ఎలక్ట్రికల్ చంద్రశేఖర్, డిప్యూటీ ఇఒ ఆరోగ్యం, చీఫ్ మ్యూజియం అధికారి సోమన్ నారాయణ, విఎస్ఒ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### 21 మంది సిఐలకు డిఎస్పీలుగా పదోన్నతి

**విజయవాడ, జూన్ 2 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలీస్ శాఖలో భారీ స్థాయిలో పదోన్నతులు కల్పించినట్లు డిజిపి హరీష్ కుమార్ గుప్తా ప్రకటించారు. 2025- 26 ప్యానెల్‌లోని 21 మంది సిఐలకు డిఎస్పీ (సివిల్) హోదా కల్పించారు. పదోన్నతి పొందిన అధికారులు వెంటనే పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు రిపోర్ట్ చేయాలని డిజిపి ఆదేశాలు జారీ చేసారు. డిఎస్పీలుగా పదోన్నతి పొందిన అధికారులు ఎం. శేషు, ఎండి సనౌల్లా, ఎస్.వి. రాజశేఖర్ రెడ్డి, ఎం. చంద్రశేఖర్, ఎస్.శ్రీనివాసులు రెడ్డి, పి.వి.వి. నరసింహారావు, వి.బాబ్జీ రావు, ఆర్. నీలయ్య, జి. వెంకటరమణ, వి. చంద్రశేఖర్ (ఎస్‌సి), టి. సీతారాం, ఎం. బుచ్చిరాజు, ఎస్. రామకృష్ణ (ఎస్‌సి), సి. భాస్కర్ రెడ్డి, ధనుంజయ నాయుడు, హెచ్. మల్లేశ్వరరావు, బి.వి. జగన్నాథ రాజు, తిరుపతి రావు, ఎ.ఓబులేసు (ఎస్‌సి), ఎం. శివప్రసాద్, జి. బాల సుబ్రహ్మణ్యం రెడ్డి ఉన్నారు. పదోన్నతి పొందిన డిఎస్పీలు 15రోజుల్లోగా కొత్త పోస్టింగ్‌లో చేరాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. విశాఖపట్నం, గుంటూరు, కర్నూలు రేంజ్‌లకు చెందిన అధికారులకు పదోన్నతులు లభించాయి.

### తిరుమలలో హోటల్స్ ఆహార ప్రమాణాలు పాటించాలి



**తిరుమల, జూన్ 2 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో ఉన్న వివిధ హోటళ్ళ యాజమాన్యం రుచిగా శుచిగా ఆహారపదార్థాలు అందించేందుకు ఉన్నత ఆహార ప్రమాణాలను పాటించాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యాచౌదరి సూచించారు. భక్తుల ఆరోగ్యం, ఆహార భద్రతకు టిటిడి అత్యున్నత ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. తిరుమలలో ఎస్వీ మ్యూజియం ఆడిటోరియంలో మంగళవారం టిటిడి ఆరోగ్య శాఖ, ఎఫ్ఎస్ఎస్ఎఐ, నెస్లే ఇండియా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆహార భద్రత, పరిశుభ్రతలపై మూడు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం అదనపు ఇఒ వెంకయ్యచౌదరి మాట్లాడుతూ ఆహార తయారీ, నిల్వ, పంపిణీ ప్రక్రియల్లో పరిశుభ్రత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

**MUNICIPAL CORPORATION:: KAKINADA**
**REQUEST FOR PROPOSAL - OFFLINE TENDER**

R.o.c.No. 3014/2026/E2 Dated:02-06-2026

Kakinada Municipal Corporation is inviting Tenders from interested reputed firms/organizations/ agencies for 02 works.
1. Construction, Operation and Maintenance of Modern Bus Shelters and Stage Poles at various locations in Kakinada Municipal Corporation (KMC) on Public Private Partnership (PPP) basis for a period of 3 years and extendable up to 9 years.
2. Development, Operation and Maintenance of Green Cafe at designated location in the Boat Club Park through Public-Private Partnership (PPP) Mode in Kakinada Municipal Corporation are invited for tenders from the interested Agencies and herewith the file is put up for approval and permission to publish in any State Edition of English and Telugu Newspapers.

The interested agencies who is having financial capability and technical competency to perform this assignment may offer their bid and the details and the Request for Proposal Documents at the office of Kakinada Municipal Corporation by paying Rs. 10,000/- for each work respectively which is Non-refundable in the form of DD drawn in favour of the Commissioner, Municipal Corporation at any Nationalized Bank payable at Kakinada."

| S.No | Description | Date & Time |
|---|---|---|
| 1 | RFP issue Start Date & time | From 11.00 A.M. 03/06/2026 |
| 2 | RFP issue End Date & time | 4.00 P.M. 10/06/2026 |
| 3 | RFP document receiving Closing Date & time | 4.00 P.M. 11/06/2026 |
| 4 | Opening of Technical Bids Date & time | 5.00 P.M. 12/06/2026 |

Any other details contact SE,O/o Kakinada Municipal Corporation in working hours. Contact Mobile No: 9849906516: kmcengineeringsection@gmail.com

Sd/- Sri. N.V.V.Satyanarayana, Commissioner (F.A.C), Municipal Corporation,Kakinada
Executive Engineer, Municipal Corporation, Kakinada

## టిటిడి విద్యాసంస్థల్లో ప్రవేశాలకు పటిష్ట చర్యలు



**తిరుమల, జూన్ 2 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలనే సంకల్పంతో టిటిడి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 33 విద్యా సంస్థల్లో 2026-27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అలిపిరిలోని ఎస్వీబీసీ కార్యాలయం నుండి టిటిడి డిఇఒ వెంకటసునీల్‌తో కలిసి కళాశాలల ప్రిన్సిపల్స్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెఇఒ డాక్టర్ శరత్ మాట్లాడుతూ అడ్మిషన్ల నిర్వహణ కోసం ప్రతి విద్యాసంస్థలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని, విద్యార్థులు, తల్లిదండ్రులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించేందుకు హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రవేశాల ప్రక్రియ పూర్తిగా మెరిట్ ఆధారంగా, పారదర్శకంగా జరగాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టిటిడి డిఇఒ వెంకటసునీల్, వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.

## స్వికార్‌లో పెరిగిన క్యాన్సర్ బాధిత రోగుల రిజిస్ట్రేషన్లు

**తిరుపతి, జూన్ 2 ప్రభాతవార్త ప్రతినిధి:** పుణ్యక్షేత్రం తిరుపతిలో క్యాన్సర్ కేసులు గణనీయంగా పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. గత మూడేళ్లలో కొత్తగా నమోదవుతున్న క్యాన్సర్ రోగుల సంఖ్య 175 శాతం మేర పెరిగిందనేది వైద్యవర్గాల సమాచారం. టాటా క్యాన్సర్ కేర్ ఫౌండేషన్‌కు చెందిన వేంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ (స్వికార్) విడుదల చేసిన గణాంకాలు ఈ షాకింగ్ నిజాన్ని వెల్లడించాయి. స్విక్కార్ నివేదిక ప్రకారం 2022 చివరి నాటికి 2,556గా కేసులు ఉండగా కొత్త క్యాన్సర్ రిజిస్ట్రేషన్ల సంఖ్య గత ఏడాది చివరికి ఏడువేలు దాటింది. ఇదే కాలంలో క్యాన్సర్‌గా నిర్ధారణ అయిన కేసులు 1,437 నుండి 3,413కి రెట్టింపు అయ్యాయి. 2022 మధ్యకాలం నుంచి ఇప్పటివరకు దాదాపు 11 వేల కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. గుట్కా, పొగాకు ఉత్పత్తుల వాడకం విపరీతంగా ఉండటమే ఈ పెరుగుదలకు ప్రధాన కారణమని వైద్య నిపుణులు విశ్లేషిస్తున్నారు. పెరుగుతున్న కేసులకు అనుగుణంగా స్వికార్ తన సేవలను గణనీయంగా విస్తరించింది. పొగాకు మాన్పించేందుకు ప్రత్యేకంగా "టొబాకో సెసేషన్ క్లినిక్" ప్రారంభించడంతో పాటు, సమాజంలో అవగాహన కల్పించేందుకు 20కి పైగా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఆటో యూనియన్లు, పాఠశాల విద్యార్థులు లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రాథమిక దశలో లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని వైద్యులు చెబుతున్నారు.

## చంద్రబాబు వెన్నుపోటు పాలనపై పోరుబాట



**తిరుపతి, జూన్ 2 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల చంద్రబాబు వెన్నుపోటు పాలనపై 'పోరు బాట' కార్యక్రమం చేపడుతున్నట్లు వైసిపి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం వైఎస్సార్సీపీ తిరుపతి ఇన్‌చార్జ్ భూమన అభినయ్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కరుణాకర రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో 149 మోసపూరిత హామీలు ఇచ్చిన చంద్రబాబు ప్రభుత్వం రెండేళ్లు గడిచినా వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ఈ నెల 4వ తేదీ నుండి 12వ తేదీ వరకు చంద్రబాబు ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజలకు వివరిస్తూ వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మాజీ మేయర్ డాక్టర్ శిరీష, వైఎస్సార్సీపీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్ర రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జీవో 673 ఉపసంహరించాలి

**- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు**

**విజయవాడ, జూన్ 2 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకమైన జీవో 673 ఉపసంహరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు డిమాండ్ చేశారు. మంగళవారం విజయవాడలోని సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బాబురావు, రాష్ట్ర కమిటీ సభ్యులు డి.కాశీనాథ్‌తో కలిసి బాబురావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి, ఎన్డీఏ పాలనకు రెండేళ్లు పూర్తయిన సందర్భంగా మున్సిపాలిటీలను ప్రైవేటీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 673 విడుదల చేయటం శోచనీయమన్నారు. వికసిత్ భారత్, వికసిత్ ఎపి పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వినాశకర విధానాలు చేపట్టడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలోని 123 కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలు, 21 అర్బన్ డెవలప్మెంట్ అథారిటీల లోని ఆస్తులను బడా కంపెనీలకు ధారాదత్తం చేయడానికి పూనుకోవటం గర్హనీయమన్నారు. మున్సిపల్ స్థలాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, కార్యాలయాలు, పార్కులు, ఆడిటోరియంలు, స్టేడియాలు సర్వం కారు చౌకగా ప్రైవేటీకరణ ముసుగులో బడా సంస్థలకు దాఖలుపరిచే ప్రయత్నాలు ప్రమాదకరమని హెచ్చరించారు. మంచినీటి సరఫరా, డ్రైనేజీ, పారిశుద్ధ్య నిర్వహణ, వీధిలైట్లు మొత్తం పౌర సేవలను వ్యాపార పరం చేస్తూ ఆదేశాలు ఇవ్వడం హానికరమన్నారు. పట్టణాభివృద్ధికి రూ.45 వేల కోట్లు నిధులు అవసరమని, ప్రభుత్వం వాటిని సమకూర్చలేదనే సాకుతో పట్టణాలను బడా సంస్థల దయాదాక్షిణ్యాలకు వదిలిపెట్టడం తగదని మండిపడ్డారు.

# అమరావతి రైతులకు న్యాయం చేస్తాం

**• మావిగన్ ప్రతిపాదన రైతుల కోసమే • అవసరం అయితే భూములు వెనక్కి • రాజధాని రైతుల భేటీలో జగన్ స్పష్టీకరణ**



**విజయవాడ, జూన్ 2 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని ప్రాంత రైతులతో సమావేశమైన మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రైతుల అభిప్రాయాలకు అనుగుణంగానే ముందుకు సాగుతామని హామీ ఇచ్చారు. రైతులను బలవంతపెట్టి నిర్ణయాలు అమలు చేయడం మంచిది కాదని ఆయన పేర్కొన్నారు. రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందించడంతో పాటు వారిని సంతోషపెట్టే విధంగా ప్రభుత్వ చర్యలు ఉండాలని, ఇబ్బందులకు గురిచేస్తే నిర్ణయాలు తీసుకోకూడదని అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాజధాని ప్రాంతానికి చెందిన పలువురు రైతులు కలిశారు. ఉండవల్లి, పెనుమాక, నిడమర్రు నేలపాడు తదితర గ్రామాలకు చెందిన రైతులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అయితే రాజధాని నిర్మాణానికి ఇప్పటికే తీసుకున్న 50 వేల ఎకరాల భూముల పరిస్థితికే స్పష్టమైన దిశ లేదని జగన్ విమర్శించారు. అలాంటప్పుడు మరో 50 వేల ఎకరాలు అవసరమని ప్రభుత్వం చెప్పడం సమంజసం కాదన్నారు. అందుకే ప్రత్యామ్నాయంగా మావిగన్ ప్రతిపాదనను సూచించినట్లు వెల్లడించారు. విజయవాడలో ఇప్పటికే అంతర్జాతీయ విమానాశ్రయం ఉండగా మరో ఎయిర్‌పోర్టు అవసరం ఏమిటని జగన్ ప్రశ్నించారు. ప్రస్తుతం విజయవడా విమానాశ్రయంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, అవి వచ్చే నెల్లో పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అలాగే మచిలీపట్నం పోర్టు తమన ప్రభుత్వ హయాంలో ప్రారంభించామని, నిధుల కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని గుర్తుచేశారు. రాష్ట్రంలో జాతీయ రహదారులు, రైల్వే స్టేషన్లు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని సద్వినియోగం చేసుకోవడంపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని జగన్ ఆరోపించారు. ప్రస్తుత విధానాల వల్ల భవిష్యత్తులో కూడా రాజధాని స్పష్టమైన రూపం లేకుండా పోతుందని అన్నారు. రాజధాని ప్రాంతంలో కనీస మౌలిక సదుపాయాల కల్పనకే ఎకరాకు రూ.2 కోట్ల వరకు ఖర్చు అవుతుందని జగన్ పేర్కొన్నారు. రహదారులు డ్రైనేజీ వ్యవస్థ, తాగునీరు, విద్యుత్ వంటి సదుపాయాల కోసం జీవితాంతం భారీ వ్యయం చేయాల్సి వస్తుందని చెప్పారు. ఈ మొత్తం ఖర్చు దాదాపు రూ.2 లక్షల కోట్లకు చేరుకునే అవకాశం ఉందని అంచనా వేశారు. రాజధాని అభివృద్ధి పేరుతో భారీ అవినీతి జరుగుతోందని జగన్ ఆరోపించారు. ఎక్కడ చూసినా స్కాములే కనినిస్తున్నాయని, రాజధాని పేరుతో వరుసగా అక్రమాలు జరుగుతున్నాయని విమర్శించారు.

మావిగన్‌ను గ్రోత్ కారిడార్‌గా ప్రకటిస్తే వేగంగా అభివృద్ధి సాధ్యమవుతుందని జగన్ అభిప్రాయపడ్డారు. సుమారు 110 కిలోమీటర్ల పరిధిలో గ్రోత్ కారిడార్ అభివృద్ధికి నిధులు కేటాయిస్తే మొత్తం ప్రాంతం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. రైతులు ఏం కావాలంటే అది చేస్తాం. బలవంతం భూసేకరణ అనేది ఉండదు. అవసరం అయితే, భూములు వెనక్కి ఇస్తాం. ఇంకా ఇప్పుడు మీ పోరాటంలో మా పార్టీ న్యాయ విభాగం కూడా పాలు పంచుకుంటుంది. మా లీగల్‌టీమ్ మీకు అన్ని విధాలుగా సహాయ, సహకారిగా ఉంటుంది. పార్టీ తరపున లీగల్ ప్యానెల్ ఏర్పాటు చేస్తాం. మీ తరపున గట్టిగా పోరాడతాం. మనం ఇప్పుడు చేయగలిగింది న్యాయ పోరాటం మాత్రమే. మూడేళ్ల తర్వాత దేవుడి దయ వల్ల మన ప్రభుత్వం ఏర్పడితే, మీకు పూర్తి న్యాయం చేస్తాం. అవకాశం ఉంటే భూములు కూడా తిరిగి ఇస్తాం. దౌర్జన్యం చేసే వారికి శిక్ష తప్పదు అన్నారు. ముఖ్యమంత్రిగా చేయకూడని పని చంద్రబాబు చేస్తున్నారు. రైతులు భూమి ఇవ్వకపోతే, ప్లాట్లు కేటాయించి రిజిస్ట్రేషన్ చేయడం, కాలువ తవ్వడం, రోడ్లు వేయడం, తోడిన నీరు పంపింగ్ చేయడం, దగ్గరలో రిజర్వాయర్లు ఉంటే, గండి కొట్టి, నీరు పారేలా చేయడం దారుణం ఏ రకంగా మీకు దౌర్జన్యం చేస్తున్నారో.. వారందరికి శిక్ష పడేలా చేస్తాం. మీకు న్యాయం చేస్తాం. ఇప్పుడు తప్పు చేస్తున్న ప్రతి ఒక్కరూ మూల్యం చెల్లించేలా చేస్తాం. మీ తరపున పోరాడేందుకు లీగల్ కమిటీ వేస్తాం. దాని ద్వారా అమరావతి రైతులకు న్యాయం చేయడానికి అన్ని విధాలా ప్రయత్నిస్తామని జగన్ చెప్పారు.

## అమరావతిపై జగన్ వ్యాఖ్యలు పూర్తిగా బాధ్యతారహితం

**- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి**


**విజయవాడ, జూన్ 2 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిపై వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్ అనుసరిస్తున్న వైఖరిపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి గురించి వైఎస్ జగన్ చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా బాధ్యతారాహిత్యమైన వన్నారు. ప్రపంచ స్థాయి రాజధానిని ఐదేళ్ల పాలనలో అల్లకల్లోలం చేసింది గత వైసిపి ప్రభుత్వమేనని ఆయన గుర్తు చేశారు. రాజధాని నిర్మాణాన్ని అర్థవంతంగా నిలిపివేసి ఇప్పుడు అభివృద్ధిపై నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందంటూ జగన్ తీరును ఈ సందర్భంగా ఆయన విమర్శించారు.

## పారిశ్రామిక విద్యుత్ సమస్యలపై నేడు విడియో కాన్ఫరెన్స్



**తిరుపతి, జూన్ 2 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్పిడిసిఎల్ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని పారిశ్రామిక విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారానికి నేటి ఉదయం 11గంటల నుండి 12 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, వ్యవస్థలో లోటుపాట్లు, ఓల్టేజ్ మార్పులు, బిల్లింగ్, సోలార్ నెట్ మీటరింగ్, ఓపెన్ యాక్సెతోపాటు భద్రతా అంశాలకు సంబంధించిన సమస్యలను పారిశ్రామిక వినియోగదారులు చర్చించేందుకు వీలుగా ప్రతినెలా మొదటి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనదలచిన పారిశ్రామిక వినియోగదారులు ప్రతి నెలా మొదటి బుధవారానికి 7 రోజుల ముందు నుంచి మొదటి మంగళవారం మధ్యాహ్నం 2 గంటల వరకు 89777 79471 నంబర్‌కు కాల్ చేయడం ద్వారా వివరాలను నమోదు చేసుకోవాల్సి వుంటుందని తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యుత్ సమస్యపై చర్చించి, పరిష్కరించుకునేందుకు అవకాశం వుంటుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లింకును సంబంధిత వినియోగదారులకు పంపడం జరిగిందని తెలిపారు.

## సెల్ టవర్ పై నుంచి దూకి ఒకరి ఆత్మహత్య



**కొడవలూరు (నెల్లూరు), జూన్ 2 ప్రభాతవార్త:** కొడవలూరు గ్రామంలో మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో సెల్ టవర్‌పై నుంచి దూకి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కలకలం రేపింది. పోలీసుల కథనం మేరకు, మృతుడు విడవలూరు మండలం తుమ్మగుంట గ్రామంలోని అరుంధతి వాడకు చెందిన 40 ఏళ్ల వ్యక్తి. అతనికి వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. బేల్దారి మేస్త్రిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటన స్థలాన్ని సిఐ ఓ.దుర్గాప్రసాదరావు పర్యవేక్షించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతికి గల కారణాలపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

## విజయవాడలో జిఎస్‌టి అప్పిలేట్ ట్రైబ్యునల్ (జిస్టాట్) ప్రారంభం

**విజయవాడ, జూన్ 2 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలో జిఎస్‌టి అప్పిలేట్ ట్రైబ్యునల్ (జీస్టాట్) అధికారికంగా ప్రారంభమయ్యింది. జీస్టాట్ కార్యాలయాన్ని తాత్కాలికంగా విజయవాడ లబ్బిపేట బృందావన్ కాలనీలోని వినమ్గర్ అపార్ట్మెంట్స్ (ఫ్లాట్ నంబరు 401) ఏర్పాటు చేశారు. అలాగే విజయవాడ, విశాఖపట్నంలలో రెండు బెంచ్లు ఏర్పాటయ్యాయి. ఎపి జీస్టాట్ ఉపాధ్యక్షుడు భాస్కర్రెడ్డి వేమిరెడ్డి, సాంకేతిక సభ్యులు (సెంట్రల్) సతీష్ కుమార్ అగర్వాల్‌ను ఎపి జీస్టాట్ బెంచ్‌లో సభ్యులుగా నియమించారు. విజయవాడ బెంచ్ పరిధిలో కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాలు ఉన్నాయి. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలు విశాఖపట్నం బెంచ్ పరిధిలో ఉన్నాయి. ఆయా జిల్లాలకు చెందిన పన్ను చెల్లింపుదారులు, శాఖాధికారులు, అధికారిక ప్రతినిధులు, తదితరులు అప్పీళ్లు, అప్లికేషన్లు సంబంధిత బెంచ్‌ల వద్ద దాఖలు చేయాల్సి ఉంటుంది.



## మత్తుకు దూరంగా ఉండండి

**• 'డ్రగ్స్ ఫ్రీ తిరుపతి జిల్లా' లక్ష్యం: ఎస్పీ సుబ్బరాయుడు**

**తిరుపతి, జూన్ 2 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఆదేశాలతో తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీస్ శాఖ విస్తృత చర్యలు చేపడుతోంది. యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడటం, సమాజాన్ని మత్తు రహితంగా తీర్చిదిద్దడం లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తిరుపతి జిల్లా పరిధిలోని ప్రతి సబ్ డివిజన్‌లో సంబంధిత డిఎస్పీల ఆధ్వర్యంలో 'మెగా గంజాయి టెస్టింగ్' కార్యక్రమాలు నిర్వహించారు. అనుమానిత ప్రాంతాలు, పరిశ్రమలు, కార్మికుల సమూహాలు, ఇతర గుర్తించిన ప్రదేశాలలో గంజాయి పరీక్షలు నిర్వహిస్తూ, మత్తు పదార్థాల వినియోగాన్ని గుర్తించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రజలు, యువత, విద్యాసంస్థలు, పరిశ్రమల యాజమాన్యాలు, తల్లిదండ్రులు పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు విజ్ఞప్తి చేశారు. 'మత్తుకు దూరంగా ఉండండి – భవిష్యత్తును కాపాడుకోండి' అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

## చెరకుగడల అలంకరణతో గంగమ్మ అభయం



**తిరుపతి, జూన్ 2 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర అనంతరం ఐదు మంగళవారాల్లో మూడవ మంగళవారం ఆలయం ఆవరణం చెరకు గడల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. జాతరలో జరిగేలాగే గంగమ్మకు వేకువజామున ప్రత్యేక అభిషేకాదులు నిర్వహించారు. అనంతరం ఆలయం పూర్తిగా, గంగమ్మను చెరకుగడలతో అలంకరించారు. అర్చకులు అమ్మవారికి కర్పూర హారతులిచ్చి నివేదనలు సమర్పించారు. ఆలయ చైర్మన్ నైనార్ మహేశ్ యాదవ్, సభ్యులు, ఆలయ ఇఒ ఎ.జయకుమార్ స్వయంగా భక్తులకు దర్శనం చేయించారు. భక్తులు భారీగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

### ప్రధాన జాతరను తలపించిన 'మరు పొంగళ్ళు'

తిరుపతి నగర గ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో మూడవ మంగళవారం 'మరు పొంగళ్ళు' కార్యక్రమం భక్తిభావంతో ఆధ్యాత్మిక వైభవాలతో అత్యంత ఘనంగా జరిగింది. తిరుపతి నగర ప్రజల ఆరాధ్య దైవమైన గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, పొంగళ్ళ సమర్పణలు నిర్వహిస్తూ భక్తులు అపారమైన భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. మంగళవారం ఆలయ పరిసరాలు భక్తజన సందోహంతో కళకళలాడాయి. ఈ సందర్భంగా రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో కళాకారులు వివిధ పురాణ, ఆధ్యాత్మిక వేషధారణలతో భక్తి పరవశంగా ప్రత్యేక ఊరేగింపులో పాల్గొన్నారు. నేరేళ్లమ్మ ఆలయం నుండి ప్రారంభమైన ఈ ఆధ్యాత్మిక శోభాయాత్ర గంగమ్మ ఆలయం వరకు సాగింది.

## 10 కంటైనర్లలో ఆవుల అక్రమ రవాణా



**పెద్దమండెం,గ్రాలివీడు, జూన్ 2 ప్రభాతవార్త:** తంబళ్లపల్లి నుండి పెద్దమండెం వైపు 10 కంటైనర్లలో ఆవులు, దున్నపోతులు తరలిస్తున్నట్లు గుర్తించిన స్థానికులు వాహనాలను అడ్డుకున్నారు. తీరా చూస్తే అందులో ఆవులు, దున్నపోతులు సుమారు 450కి పైగా ఉన్నట్లు లెక్కలు వేశారు. ఈ పశువులు అనంతపురం మార్కెట్ నుంచి ఉంగనూరు సంతకు తరలిస్తున్నట్లు వాహన డ్రైవర్లు తెలిపారు. అయితే పశువులు ఇన్ని వాహనాల్లో రావడం పలు అనుమానాలకు తావివ్వడంతో స్థానికులు అడ్డుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతపురం నుండి నేరుగా మొలకలచెరువుపై వెళ్లాల్సి ఉండగా దారి తప్పించి కుక్కంటి మీదగ కొటాల బంద్రేవ్ పై పెద్దమండెంకు రావడం జరిగింది. బంద్రేవు పటాల గ్రామస్తులు వాహనాలను పెద్దమండెం వరకు వెంబడించారు. వాహనాలకు సిసి కెమెరాలు కూడా అమర్చి ఉండడం కంటైనర్లు చాలా పొడవుగా ఉండడంతో ప్రజలకు చాలా అనుమానాలు వెల్లువెత్తాయి. పెద్దమండెంకు రాగానే పలువురు స్థానికులు వాహనాలను అడ్డుకొని విచారణ చేపట్టారు. అనంతరం తంబళ్లపల్లి సిఐ దస్తగిరి, ఎస్ఐ అనిల్ కుమార్, పెద్దమండెం ఎస్ఐ హరిహర ప్రసాద్ వచ్చి విచారణ చేపట్టారు. 10 వాహనాలు వాటి రిజిస్ట్రేషన్ డ్రైవర్ల వివరాలు సేకరించారు. వాటిని చిన్నమండెం మండలం గొర్ల ముదివేడు గోశాలకు తరలించారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# గాదె సాయికృష్ణను కోర్టులో హాజరుపరచండి

**• బార్ మానవహక్కుల కమిటీ చైర్మన్ రాంప్రసాద్**



**విజయవాడ (కార్పొరేషన్), జూన్ 2 ప్రభాతవార్త:** కృష్ణలంక పోలీసులు అక్రమంగా మార్కాపురం నుండి నిర్బంధంలోకి తీసుకున్న గాదె సాయికృష్ణను కోర్టులో హాజరుపర్చాలని బార్ మానవ హక్కుల కమిటీ చైర్మన్, న్యాయవాది ఎఎస్ఎస్ రాంప్రసాద్ డిమాండ్ చేశారు. బెజవాడ సిటీ సివిల్ కోర్టుల వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 20రోజుల క్రితం కృష్ణలంక పోలీసులు మార్కాపురంలో నివసిస్తున్న గాదె సాయికృష్ణను 20 రోజుత క్రితం కృష్ణలంకకు చెందిన కానిస్టేబుళ్ళు విజయవాడకు తీసుకువచ్చారని, ఇతనిపై పలు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, కొన్ని కేసులలో అయితే వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. అయితే చట్ట ప్రకారం కోర్టులో హాజరుపర్చకుండా అతనిని అప్పటి నుండి కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లోనే ఉంచుకున్నారని తెలిపారు. తాము నిజనిర్ధారణకై మార్కాపురం వెళ్ళినపుడు గాదె సాయిక ృష్ణ ఇంటి చుట్టుపక్కల నివసించేవారు కృష్ణలంక పోలీసులు తీసుకెళ్ళినట్లు వెల్లడించారన్నారు. తాము కృష్ణలంక పోలీసులను స్టేషన్‌లోని సిసి పుటేజిని ఇవ్వమని అడిగితే ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. కృష్ణలంక సిఐ నాగరాజును కూడ అడిగితే తాము తీసుకురాలేదని చెప్పారన్నారు. సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి తన కుమారుడిని కృష్ణలంక పోలీసులే తీసుకువెళ్ళారని చెబుతోందని, కృష్ణలంక సిఐ నాగరాజును కలవగా 'నీ కుమారుడు ఇక చనిపోయాడనుకో' అని ఆయన విజయలక్ష్మితో పేర్కొన్నాడని వాపోయారు. కృష్ణలంక సిఐపై ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకొని సాయికృష్ణను కోర్టుకు హాజరుపర్చేలా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సాయికృష్ణను కోర్టులో హాజరుపర్చకపోతే తాము కోర్టులో న్యాయపోరాటం చేస్తామన్నారు.

గత నెలలో కృష్ణలంక పోలీసులు తమ ఇంటికి వచ్చి సిఐ స్టేషన్‌కు రమ్మంటున్నారంటూ తన కుమారుడిని తీసుకెళ్ళారని, ఆ సమయంలో తన సెల్‌ఫోన్‌ను కూడ లాక్కెళ్ళారని, తాను ఆ ఫోను కోసం,తన కుమారుని కోసం చాలా రోజుల పాటు స్టేషన్‌కు తిరగ్గా, తన సెల్‌ఫోన్‌ను తనకిచ్చారని, వాటిలో ఉండాల్సిన తన కుమారుడి ఫొటోలను తొలగించారని సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి వాపోయారు. తన కుమారుని గురించి అడిగితే 'ఇక నీ కుమారుడు చనిపోయాడనుకో అని' సిఐ తనతో పేర్కొన్నాడన్నారు. తన కుమారుడిని కృష్ణలంక పోలీసులు చంపేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తూ, బతికుంటే తన కుమారుడిని చట్ట ప్రకారం కోర్టులో హాజరుపర్చాలని పేర్కొంటూ ఆమె అక్కడి కక్కడే స్పృహ తప్పి పడిపోయారు. అనంతరం బార్ మానవ హక్కుల కమిటీ చైర్మన్ రాంప్రసాద్‌తో పాటు పలువురు న్యాయవాదులు గేటు వద్ద కృష్ణలంక పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పిడిఎస్ సత్యన్నారాయణ, మీడియా కమిటీ చైర్మన్ విష్ణుబొట్ల జయప్రకాష్, రవీంద్ర, బండ్ల సాంబశివరావు, తదితర సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## కనిగిరి రిజర్వాయర్ ప్రధాన కాలువలో మృతదేహం

**సంగం (నెల్లూరు), జూన్ 2 ప్రభాతవార్త:** సంగం పరిధిలోని కండ్రిక సమీపంలో కనిగిరి రిజర్వాయర్ ప్రధాన కాలువలో ఒ మృతదేహం స్థానికులు గుర్తించారు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.

## అలిపిరిలో భక్తుల భద్రత, ట్రాఫిక్ సౌలభ్యం దృష్ట్యా తాత్కాలిక దుకాణాల తొలగింపు



**తిరుమల, జూన్ 2 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశం నలుమూలల నుండి తిరుమలకు వచ్చే కాలినడక భక్తుల సౌకర్యార్థం తిరుపతి అలిపిరి ప్రాంతంలో దుకాణాలు వెలిశాయి. ఈ దుకాణాలను కొందరు పేదలు నడుపుకుంటున్నారు. ఇటీవల అరకు కాఫీ దుకాణం కోసం జిల్లా యంత్రాంగం, పోలీసులు సంయుక్తంగా దుకాణాలను తొలగించారు. దీంతో పేదలు చాలావరకు ఉపాధి కోల్పోయారని ఆవేదన వెలిబుచ్చారు. అలిపిరి ప్రాంతంలో తాత్కాలిక దుకాణాల తొలగింపుతో ఉపాధి కోల్పోయిన దుకాణదారులు మంగళవారం తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్‌ను కలిసి తమ సమస్యలను వివరించి, న్యాయం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. దుకాణాల తొలగింపుతో ఉపాధి కోల్పోయిన వారిలో అర్హులైన వారికి ప్రత్యామ్నాయ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకునేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ హామీ ఇచ్చారు. బాధితుల సమస్యలను సానుభూతితో పరిశీలించి సాధ్యమైనంత మేరకు న్యాయం చేయడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.



## మన్యం గ్రామాల్లోకి గజరాజులు

**ఉద్యాన వ్యవసాయ పంటలు ధ్వంసం**

**పార్వతిపురం మన్యం జిల్లా (మక్కువ), జూన్ 2 ప్రభాతవార్త:** పార్వతీపురం మన్యం జిల్లా మండలంలో మార్కొండ పుట్టి పంచాయతీ పెదగాసిల, పాత గాసిల, కే గాసిల గ్రామాలలో మంగళవారం ఉదయం నుండి గజరాజులు సంచరించాయి. ఒక్కసారి కూడా ఏనుగుల గుంపును చూసి గ్రామస్తులంతా భయాందోళనకు గురయ్యారు. ఎలిఫెంట్ ట్రాక్టర్స్ వాటి కూడా ఉన్నప్పటికీ ఏనుగులు చూసేందుకు వచ్చిన జనాలు తాకిడికి కొంచెం సిబ్బందికి ఇబ్బందిగానే మారింది. గత కొన్ని సంవత్సరాలుగా మన్యంలో గజరాజులు సంసరిస్తున్నప్పటికీ వాటిని పూర్తిగా అడవిలోకి తరలించేందుకు తగు చర్యలు తీసుకున్నప్పటికీ అవి గ్రామాల సమీపంలోనే సంతరిస్తున్నాయి అయితే ఫారెస్ట్ సిబ్బంది సంబంధిత పరిసర గ్రామాలలో గ్రామస్తులను ఎలక్ట్ చేసినప్పటికీ గ్రామస్తులు మాత్రం భయం గుప్పెట్లో బతుకుతున్నారు. పాత గాసిల సమీపంలో ఉదయం నుండి ఒక అరటి తోటలో టిస్టా వేసి అరటి తోటను ఆ వ్యవసాయ క్షేత్రంలో ఉన్న గోవులశాలను వ్యవసాయ ఉపకరణలను డ్రిప్పు ఫిల్టర్లను పూర్తిగా ధ్వంసం చేశాయి. లక్షలాది రూపాయలు నష్టం కలగడంతో ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని రైతులు కోరారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు వాటిని దారి మార్చి అడవుల్లోకి వెళ్లే విధంగా చూడాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.



ఎస్6, ఎస్7 భోగీల మధ్య ఉన్న జాయింట్ స్క్రూ కప్లింగ్ విడిపోయిన దృశ్యం

## యశ్వంత్‌పూర్ ప్రత్యేక రైలుకు
# తృటిలో తప్పిన ప్రమాదం

**అనంతపురం, జూన్ 2 ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం జిల్లా గుత్తి రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం నంబర్ 1లో నిలిపి ఉన్న యశ్వంత్‌పూర్ ప్రత్యేక రైలు ఎక్స్‌ప్రెస్‌కు రెండు కంపార్ట్మెంట్ నడుమ ఉన్న లాకులు విడిపోవడంతో రైలును స్టేషన్లోనే అత్యవసర పరిస్థితులలో నిలిపివేశారు.. వివరాలు ఇలా ఉన్నాయి.. యశ్వంతపూర్ నుండి కటీహార్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు ( నెంబర్ 06571 ) మంగళవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో ఒకటవ ప్లాట్ఫారంకు చేరుకుంది. ఈ నేపథ్యంలో ఎస్6, ఎస్7 భోగీల మధ్యలో ఉన్న జాయింట్ స్క్రూ కప్లింగ్ విడిపోయాయి. అప్రమత్తమైన లోకోపైలట్ గమనించి రైల్వే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.. దీంతో టెక్నీషియన్ రైల్వే సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. మరమత్తుల అనంతరం రైలు 35 నిమిషాలకు ఆలస్యంగా బయలుదేరింది..ఈ సంఘటనపై రైల్వే అధికారులు విచారణ చేపట్టారు. సాంకేతిక లోపం కారణంగా జరిగిందా... లేదా మరో కారణంగా జరిగిందా... అన్న విభిన్న కోణాలలో అధికారులు దర్యాప్తు చేపట్టారు.

# నేడో రేపో కేరళంకు నైరుతి

>> 3 డిగ్రీల వరకు తగ్గుతాయని అంచనా. ఇదిలా ఉండగా నైరుతు రుతుపవనాలు జూన్ 8 తర్వాత రాయలసీమలోకి ప్రవేశిస్తాయని, ఆ తర్వాత మూడు రోజులకు తెలంగాణలోనూ విస్తరిస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. నైరుతి రుతుపవనాల పురోగతితో నేటి నుంచి జూన్ 5 వరకు కేరళం వ్యాప్తంగా అతి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. వాతావరణంలో ఏర్పడిన ఎల్‌నినో పరిస్థితుల వల్ల ఈసారి సాధారణం కంటే తక్కువ వర్షాలే కురుస్తాయని ఐఎండి అంచనా వేసింది. పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడుతున్నాయని, జూన్‌లో అవి బలహీనంగా ఉన్నా సెప్టెంబర్‌లో బలపడే అవకాశం ఉందని తెలిపింది.

# సిసిఎస్ పోలీసులు

>> బ్రహ్మానాయుడు అజ్ఞాతంలో ఉన్నారనే వార్తలతో నరసరావుపేటకు పోలీసులరాక కలకలం కలిగించింది. మరోవైపు వైయస్సార్సీ నేతలు బ్రహ్మానాయుడుకు సంపూర్ణ మద్దతును తెలిపారు. ప్రభుత్వ భూమి కబ్జాకు సంబంధించి తమ పార్టీ మాజీ ఎమ్మెల్యే బాధితుడని పేర్కొన్నారు. ఆ భూమికి సంబంధించి కేవలం అగ్రిమెంట్‌కు మాత్రమే జరిగిందని. ఎటువంటి కొనుగోలు జరగలేదన్నారు.భూమి అమ్మకానికి పెట్టినటువంటి వారే బొల్లా కుటుంబం నుండి రూ. నాలుగు కోట్ల రూపాయలకు పైగా అడ్వాన్స్ తీసుకున్నారని తెలిపారు. ఈ వ్యవహారంలో వారి కుటుంబం పూర్తిగా మోసపోయిందని జిల్లా వైఎస్ఆర్సిపి వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. జిల్లా టిడిపి నేతలు మాత్రం బ్రహ్మానాయుడు అవినీతికి పాల్పడ్డారని గత కొన్ని రోజులుగా ఆరోపణలు చేస్తున్నారు.

# పెరిగిన పన్ను వసూళ్లు

>> ప్రాధాన్యత ఇచ్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి అత్యాధునిక సాంకేతికతను వాడటం, వివిధ శాఖల డేటాను అనుసంధానం చేయడం ద్వారా పన్నుల లీకేజీని అరికట్టగలిగారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఈ డిజిటల్ వ్యవస్థలను, ఆటోమేటెడ్ మానిటరింగ్ విధానాలను మరింత బలోపేతం చేయాలని వాణిజ్య పన్నుల శాఖ యోచిస్తోంది.

# నిరుద్యోగుల సంక్షేమమే లక్ష్యం

>> పార్టీకి ఘనమైన చరిత్ర ఉందన్నారు. చంద్రబాబు అంటేనే డిఎస్సీ .. డిఎస్సీ అంటేనే చంద్రబాబు అని కొండపల్లి తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో అన్ని యూనివర్సిటీలను రాజకీయాలకు కేంద్రంగా మార్చేశారని అన్ని పోస్టులు తమ అస్మదీయులకే కట్టబెట్టి అర్హులకు అన్యాయం చేశారని విమర్శించారు. వైసీపీ పాలనలో అన్ని కాంపిటేటివ్ పరీక్షలపై చాలా ఆరోపణలు వచ్చాయని గ్రూప్ 1 పరీక్ష నిర్వహణ అట్టర్‌ఫ్లాప్ కావడంతో నిరుద్యోగులు, యువత వైసీపీని భవిష్యత్తులోనూ ఎప్పుడూ నమ్మరన్నారు. గ్రూప్ 1ఇన్విజిలేటర్లు, పరీక్షలు దిద్దిన ప్రదేశంతో పాటు భర్తీ ప్రక్రియ మొత్తం అవినీతి మయంగా మారి ఇప్పుడు విషయం కోర్టుల వరకు చేరిందన్నారు. డీఎస్సీ మీద వైసీపీ ఉద్యమం అంటూ హడావిడి చేస్తున్నా రాష్ట్రంలో యువత, ఉద్యోగులు ఎవ్వరూ నమ్మక ఆ పార్టీ నేతలు అభాసుపాలవుతున్నారని కొండపల్లి ఎద్దేవా చేశారు.

# డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య
## అనంతపురంలో విషాదం



నందిని (ఫైల్)

**అనంతపురం క్రైమ్, జూన్ 2 ప్రభాతవార్త :** అనంతపురం నగరంలో డిగ్రీ చదువుతున్న ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. నార్పల మండలం గొల్లపల్లి గ్రామానికిచెందిన శ్రీనివా సులు కుమార్తె నందిని (19) అనంతపురం టౌన్, జీసస్ నగర్‌లోగల ఎస్వీ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ రెండవ సంవత్సరం చదువుతోంది. ఇక్కడే హాస్టల్‌లోఉంటూ చదువుకుంటోంది.అయితే సోమవారం తెల్లవారుజామున నందిని ఆత్మహత్యకు పాల్పడింది. నాలుగో అంతస్తు నుండి సుమారు 2 గంటల ప్రాంతంలో దూకినట్లు తెలుస్తోంది. ఆమె కాలేజీ హాస్టల్ గ్రౌండ్ ఫ్లోర్‌లో పడి వున్న ఆమె మృతదేహాన్ని కళాశాల యాజమాన్యం గుర్తించింది. నందిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తెలుసుకున్న తోటి విద్యార్థులు కళాశాల సిబ్బంది ఒక్కసారిగా షాక్‌అయ్యారు.అయితే విద్యార్థిని నందిని బలవన్మరణానికి గల కారణాలు తెలియరాలేదు. కళాశాల యజమాన్యం వేధింపులే కారణమా లేక ఇతర కారణాలు ఉన్నాయా అన్నది తేలాల్సి ఉంది. నందిని ఆత్మహత్యకు పాల్పడిన విషయాన్ని పోలీసులకు, నందిని తల్లిదండ్రులకు సమాచారం అందించింది. నందిని తండ్రి శ్రీనివాసులు పోలీసులకు ఇచ్చిన పిర్యాదు మేరకు 194 బీఎన్ఎస్ (మరణానికి కారణాలు తెలియరాలేదు)గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. సదరు అమ్మాయి పైనుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకొని వుండచ్చు లేదా ఇతర కారణాలు కూడా వుండచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. మరణ కారణాలు దర్యాప్తులో తేలాల్సి ఉందన్నారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

# పోలవరం పూర్తి

>> నిర్దేశించారు. ప్రత్యేక రైళ్ల గురించి అశ్వినీ వైష్ణవ్‌కు లేఖ రాయడంతో పాటు, గోదావరి పుష్కరాలకు కేంద్ర సాయాన్ని కోరాలన్నారు. పర్యాటకుల సౌకర్యం కోసం కుంభమేళా తరహాలో టెంట్ సిటీలను, హోం స్టేలు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. గోదావరి పుష్కరాలను అభివృద్ధికి అద్భుతమైన అవకాశంగా చూడాలన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల పుష్కర పనుల పరిశీలనకు క్షేత్రస్థాయిలో పర్యటించిన సమయంలో చేసిన సూచనల్ని పరిగణనలోకి తీసుకోవాలని సిఎం స్పష్టం చేశారు.

**గోదావరి గట్టు బ్యూటిఫికేషన్..**

పోలవరం ప్రాజెక్టుకు ఇరువైపులా రహదారులు నిర్మించడంతో పాటు, గోదావరి గట్టు బ్యూటిఫికేషన్ చేయాలని సిఎం సూచించారు. రాజమహేంద్రవరంలోని వీరేశలింగం పంతులు ఇంటిని కూడా తీర్చిదిద్దాలని చెప్పారు. ప్రముఖ ఆధ్యాత్మిక గురువులు, పీఠాధిపతులు, రాజకీయవేత్తలు, సినిమా సెలబ్రిటీలను కూడా గోదావరి పుష్కరాలకు ఆహ్వానించాలన్నారు. జూన్ 24న యాక్షన్ ప్లాన్‌తో రావాలని, అప్పటి నుంచి పుష్కరాలకు కౌంట్ డౌన్ మొదలవుతుందని సిఎం చెప్పారు. ఏపి స్పేస్ అప్లికేషన్ సెంటర్, ఆర్టీజీ, టిటిడి సంయుక్తంగా రద్దీ నిర్వహణ ప్రక్రియను చేపట్టాలన్నారు. అఖండ గోదావరి పుష్కరాలు 2027 వెబ్‌సైట్‌ను ప్రారంభించాలని చెప్పారు. అలాగే గోదావరికి అఖండ హారతి, కృష్ణా నదికి పవిత్ర హారతి రెండూ నిరాటంకంగా జరగాలని సిఎం చంద్రబాబు అన్నారు.

**రూ.211 కోట్ల విలువైన 132 పనులకు అనుమతి**

పోలవరం, ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ మొత్తం 6 జిల్లాల్లో 525 ఘాట్లను పుష్కరాల కోసం సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న 288 ఘాట్లతో సహా కొత్తగా 237 ఘాట్లను నిర్మించాలని ప్రతిపాదనలు అధికారులు సిద్ధం చేశారు. ప్రస్తుతం 4.5 కిలోమీటర్ల మేర పొడవైన పుష్కర ఘాట్లను 9.9 కిలోమీటర్ల మేర పెంచాలని నిర్ణయించారు. పోలవరం జిల్లా గుండాలలో మొదటి ఘాట్... కోనసీమ జిల్లా అంతర్వేది, బలుసుతిప్ప, కాకినాడలోని గోవాలంక, పశ్చిమగోదావరిలోని నర్సాపురంలో చివరి ఘాట్ నిర్మించ తలపెట్టారు. ఈసారి పుష్కరాల్లో పుణ్య స్నానాల కోసం 9.95 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1991లో 1.2 కోట్ల మంది భక్తుల పుష్కర స్నానాలు చేయగా, 2003లో 5 కోట్ల మంది, 2015లో నవ్యాంధ్ర ప్రదేశ్‌లో 4.86 కోట్ల మంది భక్తుల పుష్కర స్నానాలు చేశారు. గత పుష్కరాల్లో ఒక్క రోజులో అత్యధికంగా 58.26 లక్షల మంది భక్తుల పుష్కర స్నానం చేయగా, ఈసారి ఒక్కరోజులో 1 కోటి మంది పుణ్య స్నానాలు ఆచరిస్తారని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే రూ.211.97 కోట్లకు సంబంధించి 132 పనులకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. సమీక్షకు మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పయ్యావుల కేశవ్, పి.నారాయణ, అనిత, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్ధన్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్, నిమ్మల రామానాయుడు, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, వాసంశెట్టి సుభాష్, సిఎస్ జి.సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, దేవదాయ, వైద్యారోగ్యం, రవాణా, పర్యాటక, పురపాలక, పంచాయితీరాజ్, ఆర్థిక, జలవనరులు, పోలీసు శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# తెలంగాణలోనూ పోటీ

>> న్నారు. తెలంగాణాలోనే తనపై తొలి కేసు నమోదైందని గుర్తుచేశారు. తెలంగాణ యువతకు అద్భుతమైన అవకాశాలు రావాలని కోరుకునే వ్యక్తిని తానని అన్నారు. ఆంధ్రాలో తనను తిరగనివ్వమంటే తెలంగాణాలో తన వారాహి వాహనానికి తెలంగాణ ప్రజలే అనుమతించారన్నారు. తనకు ఎన్నో ఏళ్లుగా ప్రజలు అండగా నిలిచారని, జనసేనను తెలంగాణ నడిబొడ్డున ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణలో పార్టీ బలోపేతం చేయాలని జనసేన నేతలు చాలా సార్లు అడిగారని, ఆంధ్రాలోనే అధికారం కోరుకోలేదని, తెలంగాణాలో అధికారం ఎందుకు కోరుతానని స్పష్టం చేశారు. తనకు అధికారంపై ప్రేమ కాదని, మార్పుపైన మాత్రమే అని అన్నారు. తెలంగాణ ప్రజలకు ఆంధ్రాపై విద్వేషం లేదని, తెలంగాణ ప్రజలు ద్వేషం పెంచుకుంటే ఎపికి సంబంధించిన వారు ఇక్కడ ఉంటారా అంటూ ప్రశ్నించారు. తెలంగాణ నలుమూలల తిరిగిన వ్యక్తినని, ఇప్పుడు నన్ను విమర్శించే వాళ్లు అదిలాబాద్ అడవుల్లో తిరగలేదని, తాను తిరిగానని స్పష్టం చేశారు. తాను బెదిరింపులకు లొంగే వాడిని కాదని, రాష్ట్ర విభజనను తాను ఎప్పుడు వ్యతిరేకించలేదని, విభజన జరిగిన తీరునే వ్యతిరేకించానని అన్నారు. సామాజిక తెలంగాణ రావాలని చెప్పి మరీ వచ్చానన్నారు. పార్లమెంటు తలుపులు మూసి విభజించిన తీరు తప్పని చెప్పానన్నారు. తెలంగాణ వ్యతిరేకం కాదని వైఎస్ చెప్పినా, ఆయనకు ఊడిగం చేశారంటూ పవన్‌కల్యాణ్ ఆరోపించారు. తెలంగాణాను ఎంఐఎం, సిపిఎం వ్యతిరేకించాయని, ఆ రెండు పార్టీలను ఎందుకు ప్రశ్నించరన్నారు. తాను ఈ 12 ఏళ్ల కాలంలో తెలంగాణ గురించి, తెలంగాణ నేతల గురించి ఒక్క మాట మాట్లాడలేదన్నారు. తనకు రెచ్చగొట్టడం ఇష్టంలేదన్నారు. గద్దర్ బతికున్న రోజుల్లో మీరంతా ఎక్కడ ఉన్నారని, గద్దర్ వచ్చి తనకు బండి కొనివ్వాలంటే రెండు రోజుల్లో కొనిచ్చానన్నారు. గద్దర్ బతికున్న రోజుల్లో ఆయనకు మీరేం చేశారన్నారు. ఒక విశ్లేషకుడి వ్యాఖ్యల వల్ల గొడవ మొదలైందని, ఆ విశ్లేషకుడిపై కేసులు పెట్టిన విషయం తనకు తెలియదని, తెలిసిన తరువాత కేసులు వద్దని తానే వారించనని స్పష్టంచేశారు. విశ్లేషకుడైఉండి అమిత్‌షా గురించి తప్పుగా ఎలా మాట్లాడుతారంటూ ప్రశ్నించారు. తనపై ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌మీట్‌లు పెట్టి తనను తిట్టారని, తెలంగాణాలో ప్రతి సమస్యకు ఆంధ్రావారే కారణమా అని అన్నారు.

**కబ్జా నిరూపిస్తే ప్రభుత్వానికి రాసిస్తాను**

ప్రత్యేక తెలంగాణ కోరుకొనే మర్రి చెన్నారెడ్డి వల్లే సినీ పరిశ్రమ చెన్నై నుంచి నగరానికి వచ్చిందన్నారు. తెలుగు ప్రజలు 50 యేళ్లు కలిసి ఉన్న రాజధాని హైదరాబాద్ అని, తెలంగాణకు అన్యాయం చేసిన పాలకులను ఉరితీసినా పర్వాలేదన్నారు. పాలకులు వేరు, ప్రజలు వేరని, పాలకులను తిట్టండి.. ప్రజలను కాదని అన్నారు. దేశంలో ఎన్నో ప్రాంతాల్లో తెలుగువారు ఉన్నారని, అక్కడి ప్రజలు మన తెలుగు ప్రజల్ని పంపిస్తే మన పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. తాను చెరువును ఆక్రమించానని, స్థలాన్ని కబ్జా చేశానని కొందరు ఆరోపణలు చేస్తున్నారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి స్పష్టం చేస్తున్నా! ఒకవేళ తాను కబ్జాకు పాల్పడినట్లు నిరూపణైతే ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవచ్చని, తానే ప్రభుత్వానికి రాసిస్తానన్నారు. కెసిఆర్ బిఆర్ఎస్ పెట్టి ఎపికి వచ్చినప్పుడు తాను స్వాగతించానని, జనసేన మాజీ నేతలను బిఆర్ఎస్‌లోకి తీసుకున్నా స్వాగతించానన్నారు. కేవలం 2వేల మందితో సభ పెట్టుకుంటామంటే అనుమతి ఇవ్వరా? విశ్లేషకులు ఇష్టానుసారం మాట్లాడినా మా అభిప్రాయం చెప్పకూడదా? ఇలాంటి విశ్లేషకుల వల్ల కమ్యూనిజం చనిపోయిందన్నారు.

**ఆరోపణల వెనుక రేవంత్‌రెడ్డి, కెసిఆర్ లేరు**

ప్రాంతీయత పేరుతో జాతీయ వాదాన్ని బలహీన పరిస్తే జనసేన అంగీకరించదన్నారు. ప్రాంతీయవాదం తీసుకొస్తే దేశ సుస్థిరత దెబ్బతింటుందన్నారు. ఉగ్రవాదం కంటే ప్రాంతీయవాదం హానికరం అన్నారు. రాహుల్, ప్రియాంక దక్షిణాదిలో ఎక్కడైనా పోటీ చేయవచ్చని, ఇందిరాగాంధీ మెదక్‌లో, పివి నర్సింహారావు నంద్యాలలో పోటీ చేయలేదా అంటూ ప్రశ్నించారు. ప్రంతీయ వాదమే .. కాంగ్రెస్ వాదమా..? అంటూ ప్రశ్నించారు. జాతీయ పార్టీ ప్రాంతీయ వాదం మాట్లాడొచ్చా అన్నారు. తాను ప్రెస్‌మీట్ పెడితే శాంతిభద్రతల సమస్య అవుతుందా..? తనపై విమర్శల వెనుక రేవంత్‌రెడ్డి, కెసిఆర్ ఉన్నారని తాను అనుకోవడం లేదన్నారు. ఎపి-తెలంగాణ హైవేకు బూర్గుల పేరు పెట్టాలని, ఆయన విగ్రహాన్ని హైవేపై పెట్టాలన్నారు. తాను రాష్ట్ర విభజన తీరుకు వ్యతిరేకంగానే 11 రోజులు అన్నం తినలేదని, విభజించినందుకు కాదని పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. సమావేశంలో జనసేన నేతలు శంకర్‌గౌడ్, రాధారపు రాజలింగం, సాగర్, తనీష్ తదితరులు పాల్గొన్నారు.

# 'సైకిల్' సత్తా చూపండి

>> పూర్తి చేశామన్నారు. పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. గట్టిగా కౌంటర్లు ఇస్తే ఇప్పుడు తోకముడిచారని అన్నారు. రాష్ట్రంలో 2002 తర్వాత ఓటర్ల జాబితా సవరణ జరుగుతోంది. మన ఓట్లు తీసేసి వాళ్ల ఓట్లు పెట్టేలా కుట్రలకు గొడ్డలి పార్టీ వెనుకాడదు. సర్ సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. మాకేం సంబంధం లేదన్నట్లుగా ఎంపీలు ఉంటే సరికాదు. జులై 14 లోపు ఓట్లు ఉండేలా చూసుకోకపోతే ఇబ్బందులు ఎదురవుతాయి. పార్టీ ఉంటేనే ప్రభుత్వం వస్తుందనే బాధ్యతతో ప్రతి ఒక్కరూ పని చేయాలి. పవర్ ఆఫ్ సైకిల్ చాటేందుకు నెలలో కొన్ని రోజులు సైకిల్‌పై వెళ్తా. సైకిల్ పవర్ చూపించేందుకు ప్రతి ఒక్కరూ ఎలక్ట్రిక్ సైకిల్ వాడండి. దీని వల్ల ఖర్చు సున్నా, ఆరోగ్యానికి ఆరోగ్యం. ఎలక్ట్రిక్ సైకిల్‌పై వీలైనన్ని ఎక్కువ ఇళ్లకు తిరుగుదాం. ఈ నెల 4న ఎన్డీయే సమావేశం తర్వాత భవిష్యత్ కార్యాచరణ చేపడతాం. 2024లో కూటమికి వచ్చిన ఓట్ల కంటే వచ్చే ఎన్నికల్లో పెరగాలి. ప్రతి బుధవారం పార్టీ క్యాలెండర్ తప్పనిసరిగా అమలు కావాలి అని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

## ప్రభుత్వ విప్ పదవికి అరవ శ్రీధర్ రాజీనామాను ఆమోదించిన ప్రభుత్వం

**విజయవాడ,జూన్2, ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ విప్ పదవికి జనసేన ఎంఎల్ఏ అరవ శ్రీధర్ రాజీనామాను ప్రభుత్వం ఆమోదించింది. వ్యక్తిగత కారణాలతో ఎమ్మెల్యే అరవ శ్రీధర్ రాజీనామా చేశారు. ఈ మేరకు అరవ శ్రీధర్ రాజీనామా లేఖ పవన్ కల్యాణ్ ద్వారా అధికారులకు చేరింది. అరవ శ్రీధర్‌పై ఒక ప్రభుత్వ ఉద్యోగిని లైంగిక వేధింపులకు గురిచేసారనే ఆరోపణలు ఉన్నాయి.వీటిపై నమోదైన కేసులు విచారణ పరిధిలో ఉన్నాయి. ఆయనను పార్టీపరమైన కార్యక్రమాలకు జనసేన దూరంగా పెట్టింది,ఈ క్రమంలో ఇటీవల అరవ శ్రీధర్ తమ అధినేత పవన్ కల్యాణ్‌ను కలిసి ప్రభుత్వ విప్ పదవికి రాజీనామా లేఖ అందజేసారు.

## సర్ విధుల్లో ఉన్న అధికారుల బదలీలపై ప్రభుత్వం నిషేధం

**విజయవాడ,మే2,ప్రభాతవార్తప్రతినిధి:** సర్ విధుల్లో ఉన్న అధికారుల బదిలీలపై ఏపీ ప్రభుత్వం నిషేధం విధించింది.కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి లేకుండా.. జూన్ 5 నుంచి సెప్టెంబర్ 22 వరకు అధికారులను బదిలీ చేయొద్దని ఏపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసారు..జిల్లా కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీల ఉద్యోగులు, బూత్ స్థాయి ఉద్యోగుల బదిలీలపై నిషేధం ఉంటుంది.

## వారం - వర్జ్యం

03-06-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, రోహిణి కార్తె
తదియ రా.9.20, పూర్వాషాఢ రా.12.59
వర్జ్యం : ఉ.8.51-ఉ.10.38
దు.ఉ.11.39-12.31
శుభసమయం : ఉ.6.30-7.00
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** కొన్ని ప్రయోజనములను అందరితో కలిసి వంచుకొనుటకు సిద్ధ పడతారు. కోర్టుకేసులు పరిష్కారం అవుతాయి.

**వృషభం:** కుటుంబము నందు ఇతరుల అతి జోక్యము ఇబ్బందిని కలిగిస్తుంది. వ్యాపార విస్తరణ ఆలోచనలు ముమ్మరం చేస్తారు.

**మిథునం:** స్థిరాస్థుల కొనుగోలు విషయములో పెద్దలను సంప్రదించుట మంచిది. వివాదాలకు దూరంగా వుండటం మంచిది.

**కర్కాటకం :** కార్యాలయము నందు మీకు తెలియకుండా కొన్ని కార్యాకలాపములు జరుగుతాయి. కావున జాగ్రత్త అవసరము.

**సింహం:** పెండింగ్ పనులు పూర్తి కాగలవు. పట్టుదలతో ఎంతటి కార్యాన్నైనా సాధిస్తారు.వాహన సౌకర్యం కలదు.

**కన్య :** నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. కాంట్రాక్టులు దక్కించు కుంటారు. వృత్తిలో ప్రోత్సాహకరంగా ఉంటుంది.

**తుల :** దూరపు బంధువులను కలిసి సంతోషంగా గడుపుతారు. తండ్రి తరపు నుండి ఆస్తి లాభం పొందుతారు.

**వృశ్చికం:** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. దీర్ఘ కాలిక ఋణాలు కొంతవరకు తీరుస్తారు.

**ధనుస్సు:** సంగీత సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడుతాయి.నూతన విద్యావకాశాలు కలవు.

**మకరం:** భూములకు సంబంధించి వివాదాలు తొలగుతాయి. నూతన ఒప్పందాలు కుదురుతాయి. వస్త్రలాభం కలదు.

**కుంభం:** ఓర్పు, నేర్పులతో ముఖ్య వ్యవహారాలు సానుకూల పరచుకునే యత్నాలు చేస్తారు. స్పెక్యులేషన్‌కు దూరంగా ఉండండి.

**మీనం :** ఎంతటి వారినైనా మాటల చాతుర్యంతో ఆకట్టుకుని పనులు పూర్తి చేస్తారు.శుభవార్తలు అందుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోటి, హైదరాబాద్



మంగళవారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ముర్ముతో భేటీ అయిన దక్షిణాఫ్రికా రిపబ్లిక్ డిప్యూటీ ప్రెసిడెంట్ పాల్ మషితిలే

# ఘోర అగ్నిప్రమాదం

>> ప్రయత్నించారు.అప్పటికే ఇద్దరు కాలి భూడిదైనట్లు గ్రామస్తులు గమనించారు.

**బాధిత కుటుంబానికి అండగా ఉంటాం:ఎమ్మెల్యే చిర్రి**

ప్రమాదం జరిగిన ఘటన స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి గల కారణాలు, జరిగిన నష్టం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే వారికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రమాదంపై అనుమానాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు చెప్పడంతో ఘటనపై సమగ్ర విచారణ నిర్వహించి వాస్తవాలను వెలికితీస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బాధ్యులెవరైనా ఉంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా చూస్తామని తెలిపారు.అధికారులు పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టి నివేదిక సమర్పించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

**ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎఎస్పి**

ఘటనపై అదనపు పోలీసు సూపరింటెండెంట్ (ఏఎస్పీ) సుశ్మిత మంగళవారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన ఆమె ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు సంఘటన జరిగిన తీరు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఘటనపై పోలీసులు చేపట్టిన దర్యాప్తు పురోగతి, సేకరించిన ఆధారాలు, తీసుకుంటున్న చర్యలపై సంబంధిత అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

**మృతదేహాలు అప్పగింత**

మృతదేహాలకు పోస్ట్‌మార్టం ప్రక్రియను వైద్యులు పూర్తి చేశారు.ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో పరీక్షలు నిర్వహించి,అవసరమైన నమూనాలను సేకరించారు. పోస్ట్‌మార్టం నివేదిక ఆధారంగా మృతికి గల కారణాలను నిర్ధారించనున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# రూ.62.20 కోట్ల సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ జూన్ 2 ప్రభాతవార్త ప్రతినిధి:** రైతు సంక్షేమం,భూసార పరిరక్షణ, సుస్థిర వ్యవసాయాభివృద్ధికి కట్టుబడి ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్-2026 సీజన్‌లో పచ్చిరొట్ట పంటల సాగును విస్తృతంగా ప్రోత్సహిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా తీర్చిదిద్దే లక్ష్యంతో రైతులకు అవసరమైన మద్దతు అందిస్తోందని పేర్కొన్నారు. పచ్చిరొట్ట పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రూ. 62.20 కోట్ల సబ్సిడీని కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. ఈ పతకం కింద రాష్ట్రవ్యాప్తంగా 91,918 క్వింటాళ్ల విత్తనాలను జిల్లాలకు కేటాయించగా, అందులో జీలుగ 50,311 క్వింటాళ్లు, జనుము 21,291 క్వింటాళ్లు, పిల్లి పెసర 20,316 క్వింటాళ్ల ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే 40,459 క్వింటాళ్ల విత్తనాలకు జిల్లాలకు సరఫరా చేయగా 19,667 మంది రైతులకు 5687 క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేసి రూ.4.76 కోట్ల సబ్సిడీ ప్రయోజనాన్ని అందించినట్లు చెప్పారు. పచ్చిరొట్ట పంటుల నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని మంత్రి వివరించారు. ఈ పంటలను భూమిలో కలపడం ద్వారా సేంద్రీయ కార్బన్ శాతం పెరగడంతో పాటు నత్రజి నిల్వలు అధికమవుతయాని తెలిపారు.

దీనివల్ల రసాయన ఎరువులపై ఆధారపడటం తగ్గి, రైతుల సాగు వ్యయం నియంత్రణలో ఉండటమే కాకుండా భూముల ఉత్పాదకత కూడా గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు. సహజ,సేంద్రీయ వ్యవసాయ విధానాల పట్ల రైతుల్లో ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో పచ్చిరొట్ట సాగుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోందన్నారు. గ్రామ స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఈ పంటల ప్రాముఖ్యతను వివరిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ ప్రోత్సాహానికి రైతుల నుంచి మంచి స్పందన లభిస్తోందని తెలిపారు.

# దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి రిమాండ్ పొడిగింపు

**విజయవాడ, జూన్ 2 ప్రభాతవార్త ప్రతినిధి:** సస్పెండెడ్ దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతికి మరోసారి ఏసీబీ కోర్టులో చుక్కెదురైంది.నేటితో ఆమె రిమాండ్ గడువు పూర్తి కానుండగా పోలీసులు కోర్టులో హాజరు పరిచి మరికొద్దిరోజులు రిమాండ్‌కు ఇవ్వాలని కోరారు. విచారణకు సహకరించకపోవడంతో మరింత గడువు కోరడంతో విజయవాడ ఏసీబీ కోర్టు ఆమెకు 14 రోజుల రిమాండ్ విధించింది. ఇప్పటికే పలుమార్లు శాంతికి రిమాండ్ పెంచుతూ వచ్చిన కోర్టు మళ్లీ రిమాండ్ విధించడంతో ఆమెకు ఊహించని షాక్ తగిలినట్లయింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో శాంతిపై ఎసిబి కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ యేడాది మార్చిలో శాంతి ఇంటితోపాటు సన్నిహితుల ఇళ్లలో సోదాలు చేసిన ఎసిబి విశాఖపట్నంలో ఎండాడలో ఖరీదైన ఫ్లాట్, తాడేపల్లి కుంచనవపల్లిలో జీ+2 బిల్డింగ్, 770 గ్రాముల బంగారం, 3 కిలలో వెండి అక్రమంగా ఉన్నట్లు తేల్చింది. ఆ తర్వాత ఆమెను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా ఏప్రిల్ 21 వ తేదీ వరకూ రిమాండ్ విధించింది. ఆ తర్వాత మరోసారి మే 5వ తేదీ వరకూ మరో రెండు సార్లు కోర్టు రిమాండ్లు పొడిగించింది. తన వద్దనున్న బంగారం, వెంటి తన తల్లి, బంధువులుగా కానుకలుగా ఇచ్చినవని, ఫ్లాట్లు, ఇళ్లలోన్లు తీసుకుని కొన్నానని ఇప్పటికే విచారణలో చెప్పినట్లు తెలుస్తోంది.

# సిబిఎస్ఇ కొత్త ఛైర్మన్

>> తిలో గణకులు అన్సర్ షీట్ స్కాన్ కాపీలు పరిశీలనచేస్తారు. ఓఎస్ఎం వ్యవస్థలో ఎదురయిన తుపాను కారణంగా వైదొలిగిన ఛైర్మన్, కార్యదర్శుల స్థానంలో కొత్త అధికారులను నియమించి కేంద్రం ప్రక్షాళనకు శ్రీకారంచుట్టింది.

**విచారణకు ఆదేశం**

ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) వివాదంలో అవకతవకలు, లోపాలు ఉన్నాయనే ఆరోపణలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులలో పెరుగుతున్న ఆగ్రహం, నిరసనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. సిబిఎస్ఇ ఛైర్మన్, కార్యదర్శిని బదిలీ చేసింది. ఆన్‌స్క్రీన్ మార్కింగ్ వివాదంపై సమగ్ర విచారణ జరిపేందుకు కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ ఛైర్మన్ ఎస్. రాధా చౌహాన్ నేతృత్వంలో ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేసి విచారణకు ఆదేశించింది.

## జనసేన హౌస్‌మోషన్ పిటిషన్ విచారణకు
# తెలంగాణ హైకోర్టు నిరాకరణ

**విజయవాడ,జూన్ 2,ప్రభాతవార్తప్రతినిధి:** జనసేన హౌస్‌మోషన్ పిటిషన్ విచారణకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. వెకేషన్ బెంచ్‌లో పిటిషన్ దాఖలు చేసుకోవాలని సూచిస్తూ ఈ వ్యాజ్యాన్ని తిరస్కరించింది. ఇప్పటికిప్పుడు పిటిషన్‌ను విచారణ చేయలేమని న్యాయస్థానం స్పష్టం చేసింది. వెకేషన్ బెంచ్‌లో మీ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చు అని చీఫ్ జస్టిస్ బెంచ్ పేర్కొంది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం గచ్చిబౌలిలో 'తెలంగాణ నవ నిర్మాణ సభ' పేరుతో జనసేనాని పవన్ కల్యాణ్ ఓ సభ పెట్టాలని నిర్ణయించారు. జనసేన సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో ఈ విషయంపై జనసేన పార్టీ.. హైకోర్టులో హౌస్‌మోషన్ పిటిషన్‌ను దాఖలు చేసింది. అయితే జనసేన పిటిషన్‌ను విచారించేందుకు హైకోర్టు నిరాకరించింది. జనసేన సభకు తెలంగాణ పోలీసులు అనుమతి నిరాకరించడంతో ఈరోజు సాయంత్రం హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ నిర్వహించాలని పవన్ కల్యాణ్ నిర్ణయించారు. జూబ్లీహిల్స్ మాదాపూర్‌లోని తన నివాసంలో పవన్ ప్రెస్‌మీట్ నిర్వహించారు.

# బ్రాండ్ సెట్ చేసిన బేబీ బాస్




**ముంబై:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ అంటే వైభవ్ సూర్యవంశీ అన్నంతగా సీన్ క్రియేట్ చేసిన యూనివర్సల్ బేబీ బాస్...తన విధ్వంసకర బ్యాటింగ్‌తో హాట్ సన్సేషనల్‌గా మారాడు. క్రీజ్‌లో అలవోకగా సిక్స్‌లు బాదినట్లే ఇపుడు ప్రపంచ బ్యాండ్ వాల్యూను సెట్ చేశాడు. ఒక్క ఐపీఎల్ పూర్తి సీజన్‌తో 15 ఏళ్ల బుడ్డోడి బ్రాండ్ వాల్యూ అమాంతం పెరిగింది. భారీ డిమాండ్ ఏర్పడింది. టోర్నీకి ముందు ఒక్కో ఎండార్స్‌మెంట్ ఒప్పందానికి సుమారు కోటీ రూపాయలు వసూలు చేసిన ఈ 15 ఏళ్ల స్టార్.. ఇప్పుడు తన బ్రాండ్ ఫీజులు రెండింతలు పెంచినట్లు పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. తాజాగా రెడ్ బుల్, కంప్లాన్ బ్రాండ్లతో ఇప్పటికే ఒప్పందం చేసుకొని, కొత్త ఛార్జ్ వసూలు చేసినట్లు తెలుస్తోంది. అటు ఏడాదికి 12 కోట్లు ఇస్తామని ఓ ప్రముఖ బ్యాట్ కంపెనీ కూడా వైభవ్ కు ఆఫర్ ఇచ్చింది.

రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన వైభవ్... ఐపీఎల్ 2026లో 776 పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్‌ను సొంతం చేసుకున్నాడు. 237.30 స్ట్రైక్‌రేట్‌తో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడిన అతడు సీజన్‌లో అత్యంత విలువైన ఆటగాడి అవార్డును కూడా గెలుచుకున్నాడు. ఇప్పటికే కాంప్లాన్, రెడ్‌బుల్ వంటి ప్రముఖ బ్రాండ్‌లకు ప్రచారకర్తగా ఉన్న వైభవ్‌తో కొత్త ఒప్పందాల కోసం పలు కంపెనీలు పోటీ పడుతున్నాయి. అతని తల్లిదండ్రులు, రాజస్థాన్ రాయల్స్ మేనేజ్‌మెంట్ సహకారంతో బ్రాండ్ ఒప్పందాలను జాగ్రత్తగా పరిశీలిస్తున్నట్లు సమాచారం.

గత ఏడాది రాజస్థాన్ రాయల్స్ అతన్ని కోటి పది లక్షలకు వేలంలో దక్కించుకుంది. ఈ ఐపీఎల్ ప్రదర్శనతో అతన్ని తమ జట్టులో చేర్చుకోవడానికి ఫ్రాంచేజీలు పోటీపడే స్థాయికి చేరాయి. ముంబై ఇండియన్స్ ఫ్రాంచేజీ ఈ రేసులో ముందున్నట్లు సమాచారం. ఇప్పటికే వైభవ్‌ను తమ జట్టులో చేరాలని ముంబై ఇండియన్స్ ఓనర్ నీతా అంబానీ అఫర్ ఇచ్చినట్లు వార్తలు షికారు చేస్తున్నాయి. ఇందుకోసం భారీ మొత్తం 30 కోట్లతో పాటు లగ్జరీ పాట్, ఓ ఐలాండ్, బ్లాంక్ చెక్ ఇవ్వడానికి రెడీ అయినట్లు సోషల్ మీడియాలో వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి.




ఇండోనేసియా ఓపెన్‌లో...

# సింధూ సూపర్ షో

## శ్రీకాంత్, మాల్వికాకు తొలి రౌండ్‌లోనే షాక్

**జకార్తా:** ఇండోనేషియా ఓపెన్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీలో తొలి రోజు భారత షట్లర్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. భారత స్టార్ షట్లర్ పీవీ సింధూ శుభారంభం చేయగా.. కిడాంబి శ్రీకాంత్, మాల్వికా బన్సోద్‌లకు తొలి రౌండ్‌లోనే షాక్ తగిలింది. 51 నిమిషాల పాటు ఉత్కంఠ భరితంగా జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో పీవీ సింధూ 25-23, 21-16తో బుసానన్ (థాయిలాండ్)పై వరుస గేమ్‌ల్లో విజయం సాధించింది. తొలి గేమ్‌లో సింధూకు ప్రత్యర్థి నుంచి గట్టి ప్రతిఘటన ఎదురైంది. పోటాపోటీగా పాయింట్లు రాబట్టడంతో తొలి గేమ్ నువ్వానేనా అన్నట్లుగా సాగింది. ఏకంగా 25 పాయింట్ల వరకు కొనసాగింది. తొలి గేమ్‌ను నెగ్గిన సింధూ.. రెండో గేమ్‌లో మరింతగా విజృంభించి గేమ్‌ను మ్యాచ్‌ను సొంతం చేసుకుని రెండో రౌండ్‌లో ప్రవేశించింది. రెండో రౌండ్‌లో ప్రపంచ నంబర్ వన్, ఒలింపిక్ ఛాంపియన్ ఆన్ సేయంగ్‌తో సింధు తలపడే అవకాశం ఉంది. గత వారం సింగపూర్‌లో జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో సింధును ఆన్ సెయంగ్ ఓడించింది. ఈ సారి గెలుపుతో ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తోంది.

ఇక మాజీ ప్రపంచ నంబర్ వన్ కిడాంబి శ్రీకాంత్ తొలి రౌండ్‌లోనే జపాన్ క్రీడాకారుడు యుషి తనకా చేతిలో 19-21, 15-21 తేడాతో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు. ఎన్నో ఆశలతో బరిలోకి దిగిన శ్రీకాంత్‌కు ఇది షాకింగ్ ఎగ్జిట్. ఇక మహిళల సింగిల్స్‌లో మాల్వికా బన్సోద్ కూడా తొలి అడ్డంకిని దాటలేకపోయింది. ఏడో సీడ్ పోర్న్‌పావీ చోచువాంగ్ చేతిలో 21-12, 21-10 తేడాతో ఓడింది. పురుషుల డబుల్స్‌లో హరిహరన్ - అర్జున్ జోడీ అద్భుత ప్రదర్శనతో 21-18, 21-10 తేడాతో మలేషియా జోడీపై విజయం సాధించి రెండో రౌండ్‌లోకి ప్రవేశించింది.



19 యేళ్లకే రెండోసారి గ్రాండ్‌స్లామ్ సెమీస్

# ఫ్రెంచ్ ఓపెన్‌లో మీర్రాకిల్

## రష్యా యువ సంచలనం * స్విటోలియాకు కోస్టియుక్ షాక్ * సెమీస్‌లో ఆండ్రీవాతో ఢీ *నాల్గో రౌండ్‌లో సబలెంకా జోరు

**పారిస్:** రష్యా యువ సంచలనం మీర్రా ఆండ్రీవా... రోలాండ్ గారోస్‌లో దుమ్మురేపుతోంది. కేవలం 19 ఏళ్ల వయసులోనే ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ సెమీస్ చేరి చరిత్ర సృష్టించింది. క్వార్టర్ ఫైనల్లో 36 ఏళ్ల రొమేనియా క్రీడాకారిణి సొరానా సిర్స్టేయాపై 6-0, 6-3 తేడాతో కేవలం 56 నిమిషాల్లోనే విజయం సాధించింది. మ్యాచ్ ఆరంభం నుంచే ఆధిపత్యం చెలాయించిన ఆండ్రీవా తొలి సెట్‌ను ఒక్క గేమ్ కూడా కోల్పోకుండా కైవసం చేసుకుంది. రెండో సెట్‌లో సిర్స్టేయా కొంత పోటీ ఇచ్చినా, కీలక సమయాల్లో దూకుడు ప్రదర్శించిన రష్యా స్టార్ విజయం ఖాయం చేసుకుంది. ఆండ్రీవాకు ఇది రెండో గ్రాండ్‌స్లామ్ సెమీఫైనల్.


లభించిన ఆరు బ్రేక్ పాయింట్లను ఆరు సార్లూ విజయవంతంగా మార్చి తన క్లాస్‌ను చూపించింది. ఈ విజయంతో 2026 సీజన్‌లో ఆండ్రీవా సాధించిన మ్యాచ్ విజయాల సంఖ్య 34కు చేరుకుంది. మహిళల టూర్‌లో ఈ ఏడాది అత్యధిక విజయాలు నమోదు చేసిన క్రీడాకారిణిగా నిలిచింది. సెమీఫైనల్లో ఆండ్రీవా 15వ సీడ్ మార్టా కోస్టియుక్‌ను ఎదుర్కోనుంది.



కాగా మహిళల సింగిల్స్ మరో క్వార్టర్ ఫైనల్లోనూ సంచలనం నమోదైంది. ఏడో సీడ్ స్విటోలియాకు పరాజయం ఎదురైంది. మూడు సెట్ల పోరులో ఆమెపై 15వ సీడ్ కోస్టియుక్ 6-3, 2-6, 6-2తో గెలుపొంది సెమీఫైనల్లో ప్రవేశించింది. తొలి సెట్‌ను 6-3తో నెగ్గిన కోస్టియుక్ దూకుడుకు రెండో సెట్‌లో స్విటోలియా అడ్డుకుంది. ఈ సెట్‌ను అలవోకగా నెగ్గి సమవుజ్జీగా నిలిచింది. ఫలితం తేల్చే మూడో సెట్‌లో కోస్టియుక్ ఆట మరోసారి ట్రాక్‌లో పడింది. ప్రత్యర్థి సర్వీసులను రెండు సార్లు కొల్లగొట్టి గెలుపును అందుకుంది.

### సబలెంకా క్యాట్‌వాక్

ఫ్రెంచ్ ఓపెన్‌లో ప్రపంచ నంబర్ వన్, బెలారస్ టెన్నిస్ స్టార్ అరీనా సబలెంకా జోరు కొనసాగుతోంది. నాలుగో రౌండ్‌లో నవోమి ఒసాకా (జపాన్)ను 7-5, 6-3 తేడాతో ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. సబలెంకాకు వరుసగా ఇది 14వ గ్రాండ్‌స్లామ్ క్వార్టర్ ఫైనల్. ఈ మ్యాచ్‌లో సబలెంక అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. ఏకంగా 39 విన్నర్లు, 12ఏస్‌లతో ముప్పు తిప్పలు పెట్టింది. యూఎస్ ఓపెన్‌లో నవోమి ఒసాకా చేతిలో ఎదురైన ఓటమికి సబలెంక ప్రతీకారం తీర్చుకుంది. ఈ ఏడాదిలో ఒసాకాపై సబలెంకాకు ఇది వరుసగా మూడో విజయం.





# నార్వే చెస్ టోర్నీలో భారత్ ఆటగాళ్ల జోరు

**ఓస్లో:** నార్వే చెస్ టోర్నీ ఏడో రౌండ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు సంచలన విజయాలు సాధించారు. ఆరో రౌండ్ లో ఓటమి పాలైన చెస్ త్రయం ప్రజ్ఞానంద, గుకేష్, దివ్య దేశ్‌ముఖ్... ఏడో రౌండ్‌లో సూపర్ కంబ్యాక్‌తో గెలుపొందారు. టైటిల్ రేసులో మరో అడుగు వేశారు.

ఏడో రౌండ్‌లో తెల్లపావులతో ఆడిన ప్రజ్ఞానంద... ఫ్రాన్స్ క్రీడాకారుడు ఆలిరెజా ఫిరౌజ్జాను చిత్తు చేశాడు. భారత గ్రాండ్ మాస్టర్ చక్కని ఎత్తులతో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేశాడు. చివరి వరకు ఆత్మవిశ్వాసంతో ఆడి అద్భుత విజయాన్ని కైవసం చేసుకున్నాడు. ఈవిజయంతో పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి చేరుకున్న ప్రజ్ఞానంద (9 పాయింట్లు) టైటిల్ రేసులో మరింత ముందుకు దూసుకెళ్లాడు.

### గుకేష్ సడన్‌డెత్ గెలుపు

కాగా వరల్డ్ ఛాంపియన్ గుకేష్... స్థానిక ఆటగాడు వెస్లీ సోపై విజయం సాధించారు. ఇద్దరి మధ్య నువ్వా నేనా అన్నట్లు సాగిన ఉత్కంఠ భరితమైన క్లాసికల్ పోరు డ్రాగా ముగిసింది. దీంతో సడన్ డెత్ గేమ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ సత్తా చాటి చివరికి విజయం సాధించారు.

### హంపిని ఓడించిన దివ్య

భారత యువ గ్రాండ్ మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్.. చెస్ దిగ్గజం కోనేరు హంపిపై అద్భుత విజయం సాధించింది. భారతీయ క్రీడాకారిణుల మధ్య జరిగిన ఉత్కంఠభరితమైన క్లాసికల్ గేమ్ డ్రాగా ముగిసింది. దీంతో మ్యాచ్ ఆర్మాగెడాన్ డిసైడర్‌కు దారితీసింది. నల్ల పావులతో ఆడిన దివ్య దేశ్‌ముఖ్... టైబ్రేకర్‌లో విజయం సాధించింది. ఈ విజయంతో పాయింట్ల పట్టికలో దివ్య దేశ్‌ముఖ్ (10 పాయింట్లు) రెండవ స్థానానికి చేరుకుంది. కోనేరు హంపి కేవలం ఒకే పాయింట్ తో చివరి స్థానంలో కొనసాగుతోంది.

# నష్టాలనుంచి స్టాక్ మార్కెట్లు రికవరీ




**ముంబయి, జూన్ 2:** నాలుగురోజుల నష్టాలనుంచి స్టాక్ మార్కెట్లు కోలుకున్నాయి. ఐటి స్టాక్స్ బంపర్ ఊతం ఇవ్వడంతో సెన్సెక్స్, నిఫ్టీలు లాభాల్లో ముగిసాయి. కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఎఫ్‌ఎంసిజి స్టాక్స్ కడా ర్యాలీ తీసాయి. ఫార్మా, హెల్త్‌కేర్ రంగాల షేర్లు మాత్రం ఒత్తిళ్లకు లోనయ్యాయి. రుతుపవనాల ఔట్‌లుక్, భౌగోళిక ఉద్రిక్తతలు, మధ్యప్రాచ్యంలో పరిస్థితులు, ఆర్బీఐ మానిటరీ పాలసీ సమీక్ష వంటివి మార్కెట్లపై ప్రభావం చూపించాయి. ఎస్అండ్‌పి బిఎస్ఇ సెన్సెక్స్ 382.50 పాయింట్లు పెరిగి 74,649.84 పాయింట్లవద్ద ముగిస్తే నిఫ్టీ 50సూచీ కూడా 100.95 పాయింట్లుపెరిగి 23,483.55 పాయింటు ట్రేడింగ్ చేసి నిలిపివేసింది.

నాలుగు వరుస సెషన్లలో సెన్సెక్స్ 2.9శాతం, నిఫ్టీ 2.70శాతంచొప్పున నష్టపోయాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్ సూచీ 0.33శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.50శాతం పెరిగాయి. బిఎస్ఇలో 1573 షేర్లుపెరిగితే 2732 షేర్లు క్షీణించాయి. 217 షేర్లుమాత్రం స్థిరంగా కొనసాగాయి. విదేశీ కరెన్సీ మార్పిడి మార్కెట్లలో డాలరుతోరూపాయి మారకం విలువలు 95.37వద్ద కొనసాగింది. అంతకుముందురోజు 95.19వద్ద ముగిసిన సంగతి తెలిసిందే.

ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు జూన్ ఐదునాటి సెటిల్‌మెంట్‌దరలు 0.96శాతం పెరిగి రూ.1,55,729వద్ద ముగిసాయి. అమెరికా డాలర్ సూచీ ఇతర కరెన్సీలతో పోలిస్తే డాలర్‌సూచీ 99.13 వద్ద నిలిచింది. మంగళవారం యూరోపియన్ మార్కెట్లషేర్లు గణనీయంగాపెరిగాయి. ఆసియా షేర్లుకూడా ఎగువస్థాయిలోనే ముగిసాయి. ఇక వాల్‌స్ట్రీట్ మేజర్ సూచీలు రికార్డు గరిష్టాల్లోముగిసాయి. టెక్నాలజీ ఎక్కువ లాభపడింది.

ఎస్అండ్‌పి 500 0.26శాతం, నాస్‌డాక్ కాంపోజిట్ 0.42శాతం, డౌజోన్స్ పారిశ్రామిక సగటు 46.42 పాయింట్లు పెరిగింది. నిఫ్టీలో ఐటిసూచీ 4.23శాతం పెరిగింది. మూడు సెషన్లలో 7.64 శాతంపెరిగినట్లు రికార్డయింది. టిసిఎస్ 6.69, ఇన్ఫోసిస్ 5.61, హెచ్‌సిఎల్ 4.17, ఎల్అండ్‌టి మైండ్‌ట్రీ 3.86, ఎంఫసిస్ 3.66, కాఫోర్జ్ 3.07, విప్రో 1.79శాతం, టెక్ మహీంద్ర 1.74, ఒరాకిల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సాఫ్ట్‌వేర్ 1.71శాతం, పెర్సిస్టెంట్ 1.35శాతం చొప్పున పెరిగాయి. ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ 0.76శాతం, సూర్యోదయ స్మాల్‌ఫైనాన్స్ బ్యాంకు 3.60శాతం, హీరోమోటోకార్ప్ 1.14శాతం, పరస్ డిఫెన్స్ అండ్ స్పేస్ టెక్నాలజీస్ 4.81శాతం చొప్పున పెరిగాయి.

# ఎంసిఎక్స్‌లో సిల్వర్100 కొత్త కాంట్రాక్టు షురూ!

**ముంబయి, జూన్ 2:** మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీ లో వెండిలో పెట్టుబడులు అంటే పెద్ద సంస్థాగత పెట్టుబడిదారులకే అన్నట్లుగా ఉంది. అయితే, ఈ సమస్యకు పరిష్కారంగా చిన్న మదుపరులకు అందుబాటులోకి ఓ కొత్త కాంట్రాక్ట్ వచ్చింది. అదే సిల్వర్ 100 ఫ్యూచర్స్. రిటైల్ ఇన్వెస్టర్లు, చిన్న ఆభరణాల వ్యాపారుల కోసం సిల్వర్ 100 ఫ్యూచర్స్ కాంట్రాక్టులను మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీ ప్రారంభించింది. ఎంసీఎక్స్‌లో ప్రస్తుతం అందుబాటులో ఉన్నటువంటి వెండి ఫ్యూచర్స్, ఆప్షన్స్‌కు ఈ కొత్త 100 గ్రాముల కాంట్రాక్టు జత కలిసింది. ప్రస్తుతం వెండి ఫ్యూచర్స్‌లో 30 కిలోలు, 5 కిలోలు, 1కిలో కాంట్రాక్టులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. నెలవారీ ఆప్షన్స్‌లో 30 కిలో గ్రాములు, 5 కిలో గ్రాముల పరిమాణాల కాంట్రాక్టులు ఉంటాయి. వీటికి 100 గ్రాముల కాంట్రాక్టు జత చేరింది. దీంతో కేవలం 100 గ్రాముల పరిమాణంలోనూ సిల్వర్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టేందుకు మదుపరులకు అవకాశం లభిస్తుంది. ఇప్పటి వరకు కాంట్రాక్టుల అధిక విలువ కారణంగా పెద్ద, సంస్థాగత పెట్టుబడిదారుల ఆధిపత్యం ఈ ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్‌లో ఎక్కువగా ఉండేది.



ఇకపై చిన్న మదుపరులూ ముందుకు వచ్చి సిల్వర్ 100 ఫ్యూచర్స్, ఆప్షన్స్‌లో పెట్టుబడులు పెట్టేందుకు వీలు కలుగుతుంది. ఈ ట్రాన్సాక్షన్ల క్లియరింగ్, సెటిల్మెంట్ ప్రక్రియను మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీ క్లియరింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ నిర్వహిస్తుందని ఎంసీఎక్స్ తెలిపింది. 1, 5,30 కిలో గ్రాముల కాంట్రాక్టులకు మార్జిన్ 17.25 శాతంగా ఉండగా 10 గ్రాములకు 10 శాతంగా నిర్ణయించారు. సిల్వర్ 100 ఫ్యూచర్స్ కాంట్రాక్ట్, భారత దేశంలోని వెండి పరిశ్రమలోని వ్యాపారాలకు ధరల అస్థిరత నుంచి తమను తాము రక్షించుకోవడానికి వీలుకలుగుతుంది.

స్థానిక ఆభరణాల వ్యాపారాలు ఇప్పుడు తమ సరుకుల అవసరాలకు మరింత అనుగుణంగా ఉండే పరిమాణంలో హెడ్జ్ చేసుకోవచ్చు లేదా డెలివరీ తీసుకోవచ్చని ఎంసిఎక్స్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ ప్రవీణ రాయ్ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించారు.

# ఎన్‌హెచ్‌పిసిలో ఆరుశాతం ఆఫర్ ఫర్ సేల్

**న్యూఢిల్లీ, జూన్ 2:** కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల్లో వాటాల ఉపసంహారణ చేస్తున్న దీపమ్ విభాగం మరో పెద్దకంపెనీలో వాటాను అమ్మేందుకు సిద్ధమైంది. ప్రభుత్వ రంగానికి చెందిన హైడ్రోపవర్ కంపెనీ ఎన్‌హెచ్‌పిసిలో వాటా విక్రయిస్తోంది. మంగళవారం రోజే ఆఫర్ ఫర్ సేల్ కూడా లాంఛ్ చేసింది. ఇక్కడ ఓఎఫ్ఎస్ విధానంలో మొత్తం 6 శాతం వాటాను విక్రయించాలని చూస్తోంది. ప్రభుత్వానికి ఈ సంస్థలో సుమారు 67.4 శాతం వాటా ఉంటే 6శాతం తగ్గించుకుంటున్నది. ఇక్కడ 6 శాతం వాటాను ఒకేసారి కాకుండా రెండు దఫాలుగా విక్రయించాలని ప్లాన్ చేసింది. ముందుగా బేస్ ఆఫర్ కింద 3శాతం దీనికి రెస్పాన్స్ బాగుంటే 3 శాతం గ్రీన్ షూ ఆప్షన్ కింద ఉంచుతోంది. దీనినే ఓవర్ సబ్‌స్క్రిప్షన్ ఆప్షన్ అని కూడా చెబుతారు. ఇక్కడ కేంద్రం చాలా తక్కువ ధరకే ప్రభుత్వ సంస్థలో వాటాను విక్రయిస్తుండటం గమనార్హం. సోమవారం సెషన్‌లో ఎన్‌హెచ్‌పిసి షేరు రూ. 77.20 వద్ద క్లోజ్ అవగా దానితో పోలిస్తే దాదాపు 8 శాతం తక్కువ ధరకు ఒక్కో షేరుకు రూ. 71 చొప్పున అమ్మేస్తుండటం గమనార్హం. తొలుత 3 శాతం వాటాలో మొత్తం 30.13 కోట్ల షేర్లను విక్రయానికి అందుబాటులో ఉంచింది. జూన్ 2న అంటే ఇవాళే నాన్ రిటైల్ ఇన్వెస్టర్లకు ఆఫర్ ఫర్ సేల్ లాంఛ్ అయింది. ఇక రిటైల్ ఇన్వెస్టర్లు, అర్హులైన ఉద్యోగులు, మళ్లీ నాన్ రిటైల్ ఇన్వెస్టర్లు జూన్ 3 న పార్టిసిపేట్ చేయొచ్చు.




రెస్పాన్స్ బాగుంటే మరో 30 కోట్ల షేర్లు రెస్పాన్స్ బాగుంటే మరో 30 కోట్ల షేర్లు విక్రయిస్తుంది. మొత్తంగా 60.27 కోట్ల షేర్లను విక్రయిస్తుంది. ఇక్కడ ఆఫర్ ఫర్ సేల్ ద్వారా ఒక్కో షేరుకు రూ. 71 చొప్పున నిర్ణయించగా మొత్తం 60.27 కోట్ల షేర్లను విక్రయిస్తే ప్రభుత్వ ఖజానాకు రూ. 4,279 కోట్ల మేర సమకూరతాయి. సగం అంటే రూ. 2,139 కోట్ల వరకు సమకూర్చుతుంది. అయితే ఇక్కడ ఆఫర్ ఫర్ సేల్ నేపథ్యంలో ఎన్‌హెచ్‌పిసి షేర్ ధర భారీగా పతనమైంది. ముందు రోజు రూ. 77.20 వద్ద ఉండగా మంగళవారం సెషన్‌లో నేరుగా 3 శాతానికిపైగా తగ్గి రూ. 74.73 వద్ద ఓపెన్ అయింది. అక్కడితో ఆగకుండా ఇంట్రాడేలో 6 శాతానికిపైగా తగ్గి రూ. 72.63 వద్ద సెషన్ కనిష్ఠాన్ని తాకింది. ప్రస్తుతం మధ్యాహ్నం 1.10 గంటలకు 5 శాతానికిపైగా పతనంతో రూ. 72.84 వద్ద ఉంది.




# రూ.6650 కోట్లకు ఓయో ఐపిఓ

**ముంబయి, జూన్ 2:** ఇన్వెస్టర్లలో ఆసక్తిరేపుతున్న ఓయో ఎట్టకేలకు ఐపీఓ రాబోతుంది. ఓయో పేరెంట్ కంపెనీ ప్రిజమ్ ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్‌కు తాజాగా మార్కెట్ నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా ఆమోదం లభించింది. సెబీ ఆమోదం నేపథ్యంలో మరికొద్ది నెలల్లో ఈ ప్రిజమ్ ఐపీఓ రానుందని చెప్పొచ్చు. మంచి ఆదరణ ఉన్న సంస్థ కాబట్టి ఇన్వెస్టర్ల నుంచి మంచి డిమాండ్ ఉంటుందని అంచనా. వాస్తవానికి జనం ప్రముఖ కంపెనీ ఐపీఓ కోసం చాలా కాలంగా ఎదురుచూస్తున్నారు. మార్కెట్ పరిస్థితులు బాగోలేనందున పెద్ద పెద్ద కంపెనీలు ప్రస్తుతం ఐపీఓ ప్రాసెస్‌ను వాయిదా వేస్తున్నాయి. ఈ ఐపీఓ పూర్తిగా ఫ్రెష్ ఇష్యూ అంటే కొత్త షేర్ల జారీ ద్వారానే ఉంటుంది.




# ఒక్కరోజులో 24శాతం దూసుకెళ్లిన మార్వెల్

**వాషింగ్టన్, జూన్ 2:** అమెరికా స్టాక్ మార్కెట్లో మార్వెల్ టెక్నాలజీస్ కంపెనీ స్టాక్ ఒక్క సెషన్‌లో 24 శాతానికిపైగా దూసుకెళ్లింది. దీంతో ఇందులో ఇన్వెస్ట్ చేసిన వారికి కాసుల పంట పండిందని చెప్పొచ్చు. కిందటి రోజు ఈ స్టాక్ ధర 219.43 డాలర్లుగా ఉండగా మంగళవారం ఒక్కరోజులోనే ఏకంగా 25 శాతానికిపైగా పెరిగి 275 యూఎస్ డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఇంట్రాడేలో ఇంకా ఎక్కువే పెరిగి 277.54 డాలర్ల వద్ద సెషన్ గరిష్ఠాన్ని.. 52 వారాల గరిష్ఠాన్ని కూడా నమోదు చేసింది. స్టాక్ 52 వారాల కనిష్ఠ ధర 61.15 డాలర్లుగా ఉంది. మార్కెట్ విలువ 23.81 వేల కోట్ల డాలర్లుగా ఉండగా భారత కరెన్సీలో ఇది రూ. 22 లక్షల కోట్లకుపైనే ఉంటుంది. మనదగ్గర రిలయన్స్ ఇండస్ట్రీస్ కంటే ఎక్కువ విలువైనది. ఇప్పుడు ఈ చిప్ మేకర్ కంపెనీ స్టాక్ ఒక్కసారిగా పెరిగేందుకు కారణం మార్కెట్ వాల్యుయేషన్ పరంగా ప్రపంచంలోనే అతిపెద్ద కంపెనీ ఎన్విడియా బాస్ జెన్సెన్ హువాంగ్ చేసిన ప్రకటన షేర్లను పరుగులు తీసేలాచేసింది. డేటా సెంటర్లకు చిప్స్ తయారు చేసే ఈ మార్వెల్ టెక్ కంపెనీనే నెక్స్ట్ ట్రిలియన్ డాలర్ కంపెనీ అని ప్రకటన చేశారు హువాంగ్. ట్రిలియన్ డాలర్ అంటే భారత కరెన్సీలో రూ.96 లక్షల కోట్ల వరకు ఉంటుంది. ఎన్విడియా, అల్ఫాబెట్, అమెజాన్, మైక్రోసాఫ్ట్, యాపిల్ వంటి కొన్ని కంపెనీలే ఈ క్లబ్‌లో ఉన్నాయి. మరికొన్ని వాటికి చేరువలో ఉన్నాయి. ఏఐ మౌలిక సదుపాయాలకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఈ కంపెనీ అదే రీతిలో వృద్ధి చెందుతుందని హువాంగ్ అభిప్రాయపడ్డారు.

# ఒక్క ఏడాదిలోనే అదానీ పెట్టుబడులు రూ.1.53 లక్షల కోట్లు

**ముంబయి, జూన్ 2:** అదానీ పోర్ట్‌ఫోలియో ఒక ఆర్థిక సంవత్సరంలో భారతీయ కార్పొరేట్‌లలోనే అత్యధిక వార్షిక మూలధన వ్యయంచేసింది. మౌలిక సదుపాయాల భారీగా అంటే రూ.1,52,967 కోట్లను పెట్టుబడిగా పెట్టింది. ఈ కారణంగా కంపెనీ ఎబిడిటా 94,834 కోట్లకు చేరుకుంది. గత ఏడాదితో పోలిస్తే 5.6 వృద్ధిని సూచిస్తుంది. అదానీ గ్రూప్ మంగళవారం విడుదల చేసిన ఆర్థిక ఫలితాలు, క్రెడిట్ మరియు ఫలితాల నివేదిక ప్రకారం ఈ వివరాలు వెల్లడయ్యాయి. కంపెనీ తన ఆస్తుల వృద్ధిని, కొనసాగుతున్న ప్రాజెక్టుల పూర్తిని, భవిష్యత్ విస్తరణకు తోడ్పడే బలమైన బ్యాలెన్స్ షీట్‌ను ప్రస్తావించింది. గ్రూప్ తన ఈ ఏడాది మొత్తం పెట్టుబడులలో దాదాపు 80ఇంధనం, యుటిలిటీలు, రవాణా, లాజిస్టిక్స్‌తో సహా ప్రధాన మౌలిక సదుపాయల రంగాల్లోనే కేటాయించింది.

కంపెనీ మొత్తం ఆస్తుల విలువ గణనీయంగా పెరిగి రూ.7,85,098 కోట్లకు చేరుకుంది. 2026 ఆర్థిక సంవత్సరం అదానీ పోర్ట్‌ఫోలియోలోని కంపెనీలు తమ మూలధన వ్యయం చక్రంలో తదుపరి దశలోకి ప్రవేశించాయని అదానీ తెలిపింది. ప్రధాన మౌలిక సదుపాయల వ్యాపారాలు పోర్ట్‌ఫోలియో మొత్తం ఎబిడిటాలో 87 శాతానికి సమానం. ఇది గ్రూప్ ఆదాయ ప్రొఫైల్‌లో దీర్ఘకాలిక మౌలిక సదుపాయల ఆస్తుల ప్రాముఖ్యతను నొక్కి చెప్పింది. 2026 ఆర్థిక సంవత్సరంలో మౌలిక సదుపాయల విభాగం ఎబిడిటా 82,083 కోట్లుగా నమోదైంది, ఇది గత సంవత్సరం కంటే 11శాతం ఎక్కువ. అదానీ పోర్ట్స్ అండ్‌సెజ్ నేతృత్వంలోని రవాణా విభాగం ప్రధాన విభాగాలలో అత్యధికంగా 23.2 వృద్ధిని సాధించి, ఎబిడిటాను 25,228 కోట్లకు పెంచింది. యుటిలిటీల వ్యాపారం 4.6 వృద్ధితో 45,377 కోట్ల ఎబిడిటాను నమోదు చేసింది. కంపెనీ త్రైమాసిక పనితీరు కూడా బలంగా ఉంది.



2026 ఆర్థిక సంవత్సరం నాల్గవ త్రైమాసికంలో పోర్ట్‌ఫోలియో ఎబిడిటా సంవత్సరానికి 12.1 పెరిగి 25,478కోట్లకు చేరుకుంది. రికార్డు మూలధన వ్యయం నిర్వహించినప్పటికీ, అదానీ పోర్ట్‌ఫోలియో ఆర్థిక క్రమశిక్షణను కొనసాగించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

## ఎల్ ఎన్ పురం లో క్రికెట్ విజేతలకు బహుమతులు



**అత్తిలి, జూన్ 2( ప్రభాత వార్త )**అత్తిలి మండలం లక్ష్మీ నారాయణపురం గ్రామంలో గౌరీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంటులో గెలిచిన విజేతలకు మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు బహుమతులను అందజే సారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ గెలుపు ఓటములను సమానంగా గుర్తించాలని అన్నారు. ఆటల్లో ఓటమిని ఆందోళన చెందకుండా గెలుపు కోసం ప్రయత్నించాలన్నారు. ఏ విధమైన పోటీలు నిర్వహించిన తన వంతు సహకారం ఉంటుందని అన్నారు. పది రోజులపాటు నిర్వహించిన పోటీలలో గెలుపొందిన భీమవరం దుర్గాపురం జట్టుకు ప్రథమ బహుమతిని, ఏఎన్ఆర్ జట్టుకు ద్వితీయ బహుమతిని మాజీ మంత్రి అందజేశారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీటీసీ ఆదారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనంపై శిక్షణ తరగతి



**జీలుగుమిల్లి, జూన్-02, (ప్రభాతవార్త)** మండల కేంద్రం జీలుగుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 44 పాఠశాలల నుండి వచ్చిన కుక్ కమ్ హెల్పర్లకు పోషక విలువలు ఉన్న ఆహారం తయారీపై ఒక్కరోజు శిక్షణ తరగతి నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారి కే శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన కొండపాక సుజాత ఆధ్వర్యంలో విద్యార్థులకు అందించే మెనూ పాటించవలసిన నియమాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి-02 ఎస్ బుచ్చయ్య, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

### జంగారెడ్డిగూడెం పట్టణ సమస్యల

## పరిష్కారమే ధ్యేయం

### కమిషనర్ కె.వి.రమణ



**జంగారెడ్డిగూడెం జూన్ 2 ప్రభాతవార్త** ?జంగారెడ్డిగూడెం పట్టణంలోని 23వ వార్డులో మున్సిపల్ కమిషనర్ కె.వి.రమణ మంగళవారం ఉదయం విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మాజీ వాక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ ముస్తఫా పాల్గొని వార్డులోని పలు ప్రజా సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. పాడైపోయిన డ్రైనేజీల స్థానంలో నూతన డ్రైన్ల నిర్మాణం చేపట్టాలని, ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగించాలని కోరారు. అలాగే పగిలిపోయిన రోడ్లకు మరమ్మతులు చేయడంతో పాటు, డ్రైనేజీలను నిరంతరం శుభ్రం చేయాలని విజ్ఞప్తి చేశారు.

?సమస్యలపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ రమణ.. తక్షణమే చర్యలు చేపట్టాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. వార్డులో కొన్ని పనులకు ఇప్పటికే టెండర్లు పిలిచామని, సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులను త్వరితగతిన ప్రారంభించేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వార్డులోని మేకల కబేలాను సందర్శించిన కమిషనర్.. కబేలా ప్రాంగణాన్ని నిరంతరం శుభ్రంగా ఉంచాలని సానిటరీ ఇన్స్పెక్టర్‌కు స్పష్టం చేశారు. వ్యాపారస్తులు కూడా పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ పర్యటనలో 23వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బొంగు నాగేశ్వరరావు, పొదిలి ఫణి శర్మ, పాకనాటి కాశి, కొరుపూరి పట్టాభి, ఏఈ సిహెచ్ రాజేష్, హెల్త్ ఇన్స్పెక్టర్ దుర్గాప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడే ఎంపీపీ సర్వసభ్య సమావేశం..

### 24 శాఖల ప్రగతిపై సమీక్ష !


**కామవరపుకోట,జూన్ 2(ప్రభాతవార్త):** స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నేడు మధ్యాహ్నం 2:00 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించినున్నట్లు ఎంపీడీఓ కె.ఆర్.యస్ కృష్ణ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు మేడవరపు వెంకట సత్య ఛాయా విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశంలో మండల పరిధిలోని వ్యవసాయం, పశుసంవర్ధక శాఖ, రెవెన్యూ, శాంతిభద్రతలు, ఐకేపీ వెలుగు, ఆరోగ్యం, విద్య, పంచాయతీ రాజ్, తాగునీటి సరఫరా, గృహనిర్మాణం, విద్యుత్, సంక్షేమ శాఖలు మరియు ఉపాధి హామీ పథకంతో సహా మొత్తం 24 రకాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సుదీర్ఘంగా సమీక్షించనున్నారు. ఈ సమావేశానికి సంబంధిత శాఖల హెచ్‌ఓడీలు మాత్రమే నివేదికలతో తప్పనిసరిగా హాజరుకావాలని ఎంపీడీఓ కె.ఆర్.యస్ కృష్ణ ప్రసాద్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

## అంగన్వాడి కేంద్రంలో కిషోర్ వికాసము పై అవగాహన సదస్సు



**మొగల్తూరు జూన్ 2(ప్రభాతవార్త)** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం మొగల్తూరు సీడీపీఓ బి. ఊర్మిళ ఆదేశాలు మేరకు మంగళవారం కిషోర వికాసం ట్రైనింగ్ ప్రోగ్రామ్ మొగల్తూరు మండలం లక్కువారితోట అంగన్వాడీ సెంటర్ నందు నిర్వహించారు. కిషోర బాల బాలికలకు సైబర్ నేరాలు, మొబైల్ వాడకం, చైల్డ్ మ్యారేజ్,పోక్స్ యాక్ట్, గురించి, మొదలగు అంశాలు పై సీ.డీ.పీ.ఓ. బి.ఊర్మిళ ప్రసంగించారు. మరియు డి సి పి ఓ.. రాజేష్ బాల బాలికలకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమం నందు అంగన వాడి కార్యకర్తలు, అంగన్వాడి సహాయకులు కిషోర్ బాల బాలికలు, తల్లులు గ్రామ మహిళలు పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శేరేపాలెంలో కిషోర్ వికాసము పై అవగాహన



**మొగల్తూరు జూన్ 2 (ప్రభాతవార్త)** సిడిపిఓ బి. ఊర్మిళ ఆదేశాల మేరకు మంగళవారం కిషోరి వికాసం శిక్షణ కార్యక్రమం అంగన్వాడి సూపర్వైజర్ పి విజయ కుమారి ఆధ్వర్యంలో మొగల్తూరు మండలం శేరేపాలెం సచివాలయం నందు నిర్వహించారు. కిషోరి బాల బాలికలకు మొబైల్ ఫోన్ వాడకం గురించి, సైబర్ నేరాలు గురించి కేరీర్ గైడెన్స్, యాక్ట్స్,గురించి తదితర అంశాలపై సూపర్వైజర్ పి. విజయకుమారి అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమం నందు అంగన్వాడి కార్యకర్తలు సిహెచ్ జనని, బి అరుణ్ కుమారి, పి ఆదిలక్ష్మి, మరియు అంగనవాడి కేంద్రా సహాయకులు, బాలబాలికలు, తల్లులు మహిళలు గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# తీరని రొయ్యల రైతుల వ్యథ

- వనామి రొయ్య ధరాగాతం
- పెరిగిన లీజులు మేత, కూలి ధరలు
- ఆందోళన చేస్తున్నా ఫలితం శూన్యం
- క్రాప్ హాలిడే సాధ్యమా...?





**నరసాపురం... ప్రభాతవార్త** ఏటా వేసవిలో వనామి రొయ్య ధర పడవేస్తారు. దీని వెనుక ఉన్న హస్తాలు అందరికీ తెలిసిందే. రొయ్యల రంగంలో చిత్రంగా రైతులు ఒక్క సెంటు భూమి కొనలేకపోవచ్చు. కొనలేక పోతున్నారు కూడా. బ్యాంకులకు ఫైనాన్స్ కంపెనీలకు మేత షాపులకు వడ్డీలు కూడా చెల్లించలేకపోతున్నారు. కానీ మధ్యలో ఉండే కమిషన్ దారులు ప్రాసెసింగ్ యజమానులు ఎగుమతి దారులు మాత్రం ఆస్తులు డబ్బు కూడా బెడుతున్నారు. ఓడ లాంటి కారులో దర్జాగా తిరుగు తున్నారు. రైతుల మాత్రం దరిద్రాన్ని నెత్తిన వేసుకుని పచ్చిగా చెప్పాలంటే అత్యంత హీనంగా బ్రతుకుతున్నారు. రాష్ట్రంలో దాదాపు 5 లక్షల ఎకరాల్లో రొయ్యలు పండిస్తారు. పశ్చిమ లో అయితే కాస్త అటు ఇటుగా క్రాప్ రెండు లక్షలకు చేరింది. దీంతో బడా బాబులు ఆడుకుంటున్నారు. రైతులు సీడ్ వేయకపోతే ఫోన్ మీద ఫోన్ కొడతారు. లక్షకు లక్ష బోనస్ అంటారు. రైతులు ఆ గాడిలో పడి నష్టపోతారు. విచిత్రంగా ఈ ఏడాది రైతును అధిక ధరల పద్మవ్యూహంలో చావబాదారు. చెరువు లీజులు పెరిగాయి. కరెంటు బిల్లులు ప్రభువుల ఇష్టం. ఎందుకు అంత బిల్ అంటే ఆ మీరు కాల్చేశారు అంటారు. వీరవాసరంలో మేత బస్తాలు తగలబెట్టినా క్రాప్ హాలిడే ప్రకటిస్తామని బెదిరించిన మేత యజమానులు మాత్రం అనుకున్న మేర పెంచేశారు. ఎందుకు పెంచారు అని అడిగితే ట్రంప్ ని అడగండి లేకపోతే నె తన్యాహు ను అడగండి అంటారు. లేకపోతే ముడి సరుకు పెరిగిందని చెబుతారు. డి డీజిల్ ధర దారుణంగా పెరిగింది. అన్ని పెరిగేనావి కాబట్టి కూలీలు కూడా ధరలు పెంచుకున్నారు. అక్కడితో ఆగిందా... వల ఖర్చుల పేరుతో దోచేస్తున్నారు. రెండు ఎకరాల చెరువును పట్టుబడి పడితే పది నుండి 15 వేల రూపాయలు ఖర్చుఅవు తోంది. వరికి గిట్టుబాటు ధర ఉంది పత్తి అపరాలు మిర్చి కి గిట్టుబాటు ధర ఉంది. ఏటా 60 వేల కోట్ల రూపాయలు విదేశీ మారక ద్రవ్యాన్ని తెచ్చే రొయ్యలు చేపలకు మాత్రం గిట్టుబాటు ధర లేదు. అంత ఎందుకు కనీసం ఇన్సూరెన్స్ లేదు. ఏ ఈదురుగాలో వచ్చి ఐదారు గంటలు కరెంటు పోతే వనామీకి ఆక్సిజన్ అందక ఒడ్డుకు వచ్చి కాళ్లు వెళ్లబడుతుంది. దాంతో రైతు కూడా కళ్ళు వెళ్లబడతాడు. మరి ఇన్సూరెన్స్ ఎందుకు ఇవ్వరు. రొయ్య సాగు కోసం ప్రభుత్వం మంత్రులు అధికారులు మీటింగ్ మీద మీటింగ్ వేస్తారు. ప్రయోజనం శూన్యం. దగా ఎక్కడ జరుగుతుందో మోసం ఎవరు చేస్తున్నారు పెద్దలందరికీ తెలుసు. అంతా గప్చిప్ గోల్మాల్. లక్షలు పెట్టుబడి పెట్టే రైతే బలి పశువు.

### ఎనిమిది గ్రామాలకు శుద్ధమైన మంచినీటి సరఫరాకు

## శ్రీకారం పనులు ప్రారంభం



**మొగల్తూరు జూన్ 2:(ప్రభాతవార్త)** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామ పంచాయతీ పరిధి గెదర్ల వంపు గ్రామంలోధవలేశ్వరం ప్రాజెక్టు నుంచి శుద్ధమైన తాగునీటిని ఎనిమిది గ్రామాలకు సరఫరా చేసే లక్ష్యంతో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు (ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్) మరియు సంపు నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు మెగా ఇంజనీరింగ్ సంస్థ ప్రతినిధులు సోమవారం స్థలాన్ని పరిశీలించి కొలతలు చేపట్టగా, మంగళవారం నుంచి నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి గత ఏప్రిల్ నెలలో ప్రభుత్వ విప్, నరసాపురం శాసనసభ్యులు శ్రీ బొమ్మిడి నాయకర్ చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది. ముత్యాలపల్లిలో నిర్మించనున్న స్టోరేజ్ ట్యాంకు ద్వారా ధవలేశ్వరం నుంచి వచ్చే నీటిని నిల్వ చేసి, పైపులైన్ వ్యవస్థ ద్వారా మొగల్తూరు, పేరుపాలెం నార్త్, పేరుపాలెం సౌత్, కేపీ పాలెం నార్త్, కేపీ పాలెం సౌత్, మోడి, వార తిప్ప, ముత్యాలపల్లి గ్రామాలకు సరఫరా చేయనున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రత్యేక అధికారి శ్రీ మేడిది నవీన్ కిరణ్ మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు పూర్తయితే మండల పరిధిలోని ఎనిమిది గ్రామాలకు ఏడాది పొడవునా శుద్ధమైన తాగునీరు అందుబాటులో ఉంటుందని, నీటి కొరత సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణకు ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. పనుల ప్రారంభంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కొల్లాటి బాలకృష్ణ, కొల్లాటి నాగేశ్వరరావు, కొల్లాటి మూలస్వామి కొల్లాటి పెంటయ్య, బీజేపీ మండల అధ్యక్షులు కొల్లాటి చెన్నకేశవరావు ఎంపీటీసీ సభ్యులు తిరుమని స్వామి, తిరుమణి భాస్కరరావు, పంచాయతీ అభివృద్ధి అధికారి ఎం. సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది, ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పంట కాలువలో చెత్త తొలగింపు పనుల ప్రారంభం



**మొగల్తూరు జూన్ 2 (ప్రభాతవార్త):** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం మొగల్తూరు గ్రామపంచాయతీ పరిధి పెదపల్లవపాలెం సమీపంలోని లాకుల వద్ద పంట కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించే పనులను మంగళవారం ప్రారంభించారు. ప్రభుత్వ విప్, నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పశ్చిమగోదావరి జిల్లా డెల్టా ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ గుబ్బల మారాజు ఆధ్వర్యంలో చెత్త తొలగింపు చర్యలను ప్రారంభించారు. కాలువలో పేరుకుపోయిన చెత్త, కలుపు మొక్కలు, వ్యర్థ పదార్థాల కారణంగా నీటి ప్రవాహానికి అంతరాయం కలుగుతుండటంతో రైతుల అభ్యర్థన మేరకు ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గుబ్బల మారాజు మాట్లాడుతూ, పంట కాలువలు పరిశుభ్రంగా ఉంటే సాగునీరు ఎటువంటి ఆటంకాలు లేకుండా చివరి ఆయకట్టుకు చేరుతుందని పేర్కొన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కాలువల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. చెత్త తొలగింపు పనులను వేగవంతంగా పూర్తి చేసి సాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పాఠశాలలు తెరిసిన వెంటనే పుస్తకాలు పంపిణీ ఎంఈఓ2 ఏసుదాసు



**కాళ్ళ జూన్2 (ప్రభాత వార్త)** పాఠశాలలో తెరిసిన వెంటనే విద్యార్థులు పుస్తకాలు అందజేయాలని ఎంఈఓ 2 ఏసుదాస్ అన్నారు. మండల కేంద్రమైన కాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయా పాఠశాలకు పుస్తకాలను అందజేశారు. ఏలూరుపాడు క్లస్టర్ పరిధిలోని అన్ని పాఠశాలలకు పుస్తకాలు అందజేశారు. కాళ్ల క్లస్టర్, కోపల్లె క్లస్టర్లకు ప్రాథమిక పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, జిల్లా పరిషత్ ఉన్న విద్యార్థులకు పార్టీ పుస్తకాలతో పాటు నోటు పుస్తకాలు అందజేస్తున్న మన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా క్లస్టర్ల పాఠశాలల సి ఆర్ ఎం టి లు, పి టి ఏ లు ఆఫీస్ సిబ్బంది మోహన్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జంగారెడ్డిగూడెంలో మానవతా సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ వితరణ




**జంగారెడ్డిగూడెం జూన్ 2 ప్రభాతవార్త** ఎండల తీవ్రత నేపథ్యంలో స్థానిక బస్సు నిలయ ప్రాంగణంలో మానవతా సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ వితరణ కార్యక్రమం జరిగింది. సంస్థ అధ్యక్షులు అల్లూరి రామకృష్ణ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గారేజ్ మేనేజర్ గంగాధర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. తీవ్ర ఎండల్లో ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి మానవతా సంస్థ ఇలాంటి సేవా కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు త్రిపుర రమేష్, దల్లి కేదారేశ్వర రెడ్డి, తన్నీరు రామకృష్ణ, కర్పూరం వెంకన్న బాబు, చిటికెల రాంబాబు, కొల్లేపర ఆనందం, చిలుకూరి సాయిబాబు, గద్దె సత్యనారాయణ, చిలుకూరి నారాయణ, పోల్నాటి నరేష్, చిన్నారి సభ్యుడు దిలీప్ సూర్య పాల్గొన్నారు.

## జంగారెడ్డిగూడెంలో ముమ్మరంగా 'విజిబుల్ పోలీసింగ్' -- వాహనాల తనిఖీ



**జంగారెడ్డిగూడెం జూన్ 2 ప్రభాత వార్త** ?జంగారెడ్డిగూడెం ఏలూరు జిల్లా ఎస్పీ శివ ప్రతాప్ కిషోర్, ఏఎస్పీ సుస్మిత ఆర్, సిఐ వెంకట్ సుభాష్ ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెంలో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. జంగారెడ్డిగూడెం ఎస్ఐ వీరప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక జేపీ సెంటర్ వద్ద 'విజిబుల్ పోలీసింగ్' నిర్వహించారు. ?ఈ సందర్భంగా జేపీ సెంటర్ వద్ద పలు వాహనాలను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనదారులకు హెల్మెట్ నిబంధనలు, రోడ్డు భద్రతపై ఎస్ఐ వీరప్రసాద్ అవగాహన కల్పించారు. తనిఖీల సమయంలో ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ జంగారెడ్డిగూడెం పోలీసులు 'ఫ్రెండ్లీ పోలీస్'గా వ్యవహరించారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి, ప్రమాదాల నివారణకు పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా అధికారులు వాహనదారులకు విజ్ఞప్తి చేశారు.

## జిల్లాలో జూన్,3వ తేదీ కూడా సామజిక పెన్షన్ల పంపిణీ - డిఆర్డిఏ పీడీ విజయలక్ష్మి


**ఏలూరు, జూన్, 2 : ప్రభాత వార్త** ఏలూరు జిల్లాలో సామజిక పెన్షన్ల పంపిణీ 3వ తేదీ కూడా కొనసాగుతుందని డిఆర్డిఏ పీడీ విజయలక్ష్మి ఒక ప్రకటనలు తెలిపారు. జూన్, 1వ తేదీన పెన్షన్ తీసుకొని వారికి 2వ తేదీన పంపిణీ చేయడం జరిగిందని, కొంతమంది అనివార్య కారణాలతో అందుబాటులో లేని కారణంగా ఇంకా పెన్షన్ తీసుకోలేదని, వారి కోసం 3వ తేదీ బుధవారం కూడా పెన్షన్ అందించనున్నట్లు విజయలక్ష్మి తెలియజేసారు.

## గోగులంపాడు లో పిడుగు పడి గొర్రెల కాపరి దుర్మరణం



**ముసునూరు, జూన్ 03ప్రభాతవార్త :** ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి పిడుగుపడి గోగులంపాడు గ్రామానికి చెందిన ఒక గొర్రెల కాపరి మంగళవారం దుర్మరణం చెందిన విషాద సంఘటన జరిగింది. ఏలూరు జిల్లా ముసునూరు మండలం చింతలవల్లి శివారు గోగులంపాడు కొత్తూరు గ్రామానికి చెందిన గంగుల రాజా కుమారుడు ఎలీషా (25) గొర్రెలను మేపేందుకు పొలంలోనికి తోలుకొని వెళ్ళాడు. పొలంలో అతనిపై పిడుగు పడి అక్కడికక్కడే మృత్యువాత చెందాడు. మృతుని తల్లిదండ్రులు కన్నీరు, మున్నీరుగా విలపించారు. వారు తల్లిదండ్రులకు ఒక కుమారుడు కుమార్తె కాగా కుమార్తెకి వివాహం జరిపించారు. ఎలీషా కు కూడా ఈ ఏడాది వివాహం చేద్దామని తల్లిదండ్రులు భావించారు. ఇంతలోనే మృత్యువు పిడుగు రూపంలో కబలించటంతో వారి కుటుంబానికి తీరని అన్యాయం జరిగింది. జరిగిన సంఘటనపై ముసునూరు ఎస్సై చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## దాతల సహకారంతో అభివృద్ధి: అడ్డాల శివరామరాజు



**కాళ్ళ జూన్2( ప్రభాతవార్త)** దేవాలయ అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని దేవాలయ పాలకమండలి అధ్యక్షులు అడ్డాల శివరామరాజు అన్నారు. మండలంలోని కాళ్ళకూరు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం చుట్టూ మాడవీధులు విస్తరణలో భాగంగా స్థలం కొనుగోలు నిమిత్తం కాళ్ళకూరుకు చెందిన వేగేశ్న వెంకట రామ మూర్తి రాజు- రామ సీతమ్మ దంపతులు రూ. 1,01,116/- దేవస్థానం కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్ పాలకమండలి అధ్యక్షులు అడ్డాల శివరామరాజులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతలను సన్మానించారు.

## ఉండి, భీమవరం నియోజకవర్గాలకు మాత్రమే

**భీమవరం జూన్ 2 ప్రభాతవార్త** భీమవరం, ఉండి నియోజకవర్గాలకు చెందిన విభిన్న ప్రతిభావంతులు మాత్రమే భీమవరం కలెక్టరేట్ కు మోటారు వాహనాల దరఖాస్తుల ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని,జిల్లా విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్తెలిపారు. నవంబర్-- 2025 నెలలో మోటారు వాహనాల మంజూరుకు సంబంధించి సంబంధిత వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకున్న పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన శారీరక వైకల్యం కలిగిన విభిన్న ప్రతిభావంతుల కోసం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా సంయుక్త కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ ద్వారా ఈ కార్యక్రమం జూన్ 3, 2026 బుధవారం ఉదయం 10.30 గంటలకు భీమవరం కలెక్టరేట్ ప్రాంగణంలోని పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.అయితే ప్రస్తుతం కొనసాగుతున్న తీవ్ర ఎండల కారణంగా దూర ప్రాంతాల నుండి భీమవరం రావడంలో విభిన్న ప్రతిభావంతులు ఇబ్బందులు పడే అవకాశమున్నందున, సంయుక్త కలెక్టర్ ఆదేశాల మేరకు మొదటి విడతలో భీమవరం, ఉండి నియోజకవర్గాలకు చెందిన దరఖాస్తుదారులు మాత్రమే ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావలసిందిగా కోరారు. తణుకు, తాడేపల్లిగూడెం, ఆచంట, నరసాపురం మరియు పాలకొల్లు నియోజకవర్గాలకు చెందిన దరఖాస్తుదారుల ధ్రువపత్రాల పరిశీలన తేదీలు మరియు నిర్వహణ ప్రదేశాలను త్వరలో ప్రకటించనున్నట్లు తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యే అభ్యర్థులు ఆన్‌లైన్‌లో సమర్పించిన ధ్రువపత్రాల రెండు సెట్ల జిరాక్స్ ప్రతులు, వైకల్యం స్పష్టంగా కనిపించే ఫోటో, రీ-వెరిఫికేషన్ సదరం ధ్రువీకరణ పత్రం డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా వెంట తీసుకురావలసిందిగా సూచించారు. సంబంధిత అభ్యర్థులు నిర్ణీత సమయానికి హాజరై ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను సక్రమంగా పూర్తి చేసుకోవాలని జిల్లా విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్ కోరారు.

### పదోన్నతి పొందిన డిఎస్పి విజయ్ శేఖర్‌కు

## కూరం ప్రసాద్ శుభాకాంక్షలు



**జీలుగుమిల్లి, జూన్-02, (ప్రభాతవార్త)** పోలవరం మండలం గార్లగొయ్యి గ్రామానికి చెందిన కుర్సశీ విజయ్ శేఖర్ డీఎస్పీ పదోన్నతి పొందిన సందర్భంగా ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జీలుగుమిల్లి మండల సభ్యుడు హెల్త్ అసిస్టెంట్ కూరం ప్రసాద్ విజయవాడలో వారి స్వగృహమునందు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కష్టపడి చదివితేనే చదువు విలువ తెలుస్తుందన్నారు. ఇందుకు డి.ఎస్.పి విజయ్ శేఖర్ ఉదాహరణగా చెప్పుకోవచ్చు అన్నారు. ఆదివాసి బిడ్డలు విజయ్ శేఖర్ ను ఆదర్శంగా తీసుకొని, ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ప్రతి యొక్క యువత కష్టపడి చదివి ఉద్యోగ ఉపాధి అవకాశాలు సాధించుకోవాలని ప్రసాద్ పిలుపునిచ్చారు. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం అన్నట్లు "కలలు కనండి-వాటిని సాకారం చేసుకోండి" అన్నట్టు డిఎస్పి విజయ శేఖర్ కష్టపడి చదివి తనకలను సాకారం చేసుకున్నారని గుర్తు చేశారు.

## పరిశుభ్రత ప్రతి పౌరుని బాధ్యత

### బీవీ రాజు పార్క్ ఆవరణలో ఆపరేషన్ క్లీన్ స్వీప్



**భీమవరం జూన్2 ప్రభాతవార్త** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి పౌరుని బాధ్యత అని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రాంబాబు, వీరమ్మ పార్క్ వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి కె ఆనంద రావు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, వీరమ్మ పార్క్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వీరమ్మ బీవీ రాజు పార్క్ ఆవరణలో ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం కృషితోపాటు ప్రజల సంపూర్ణ సహకారం అందిస్తే సంపూర్ణ పారిశుధ్యం సాధించగలుగుతామన్నారు. వాకర్స్ అసోసియేషన్ కోశాధికారి జూలూరి లక్ష్మి నరసింహ మూర్తి, సభ్యులు రామాయణం చిన్నారి, రావూరి అనంత్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి ప్రతిరోజు మన ఊరు, మనవాడ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ వాణిజ్య సంస్థలు, హోటల్స్, చిరు వ్యాపారులు ఒక కమిటీగా ఏర్పడి ఒక్కో ఏరియాకు ఒకరు బాధ్యత వహించి మన భీమవరం పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. దుకాణాలు ఎదురుగా ఉన్న వ్యర్థాలకు వారే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో వాకర్స్ డిస్ట్రిక్ గవర్నర్ వడుపు గోపి, నల్లం రఘుబాబు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పథంలో నవ్యాంధ్ర సువర్ణాంధ్రకు సన్నద్ధం



**భీమవరం జూన్ 2 ప్రభాతవార్త** అభివృద్ధి పథంలో నవ్యాంధ్ర సువర్ణాంధ్రకు సన్నద్ధమవుతుందని పలువురు వక్తలు అన్నారు. భీమవరం వెంకట్రామ థియేటర్ ప్రాంగణంలో మంగళవారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నవ్యాంధ్ర ప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని నిర్వహించారు. టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు మద్దుల రాము, చెల్లబోయిన గోవింద్, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 2014 జూన్ 2న నవ్యాంధ్ర ప్రదేశ్ ఏర్పడిందని, మన రాష్ట్రం లోంచి తెలంగాణ విడిపోయి నవ్యాంధ్ర ప్రదేశ్ ఏర్పడి దినదిన అభివృద్ధి సాధిస్తుందన్నారు. పొట్టి శ్రీరాముల త్యాగ ఫలితంగా ఆంధ్రరాష్ట్ర అవతరణ జరిగిందని, మన రాష్ట్రం నుంచి 12 ఏళ్ల క్రితం తెలంగాణ విడిపోయిన మన రాష్ట్రం స్వర్ణాంధ్ర ప్రదేశ్ గా ఏర్పడి ఎంతో అభివృద్ధి సాధించుకున్నామన్నారు. కార్యక్రమంలో అరసవల్లి సుబ్రమణ్యం, డా ఎస్ సత్యనారాయణ రాజు, విజ్జురోతి రాఘవులు, ఎద్దు ఏసుపాదం, ఎ వీరయ్య, ఎస్ కే చాన్ భాషా తదితరులు పాల్గొన్నారు.

## వాతావరణ మార్పు పైపాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు

**అత్తిలి, జూన్ 2(ప్రభాతవార్త )** జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా వాతావరణ మార్పు అనే థీమ్ తో జూన్ 5నుండి 30 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ పాఠశాలలను ఆదేశించారు. ఆరోగ్యకరమైన జీవన విధానాలు, స్థిరమైన ఆహారం, వ్యర్థాలను తగ్గించడం, పనికిరానివి తొలగించడం, విద్యుత్తును ఆదా చేయడం, నీటిని పొదుపుగా వాడడం, సింగిల్ యూస్ ప్లాస్టిక్ ను నిషేధించడం వంటి అంశాలపై అవగాహన కల్పించాలని కోరారు. జూన్ 5 నుండి సెప్టెంబర్ 30 వరకు తల్లికి ఒక మొక్క అనే కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు.

పశ్చిమగోదావరి,ఏలూరు
వార్త

# ఈనెల 9న సిద్ధాంతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన

## ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**పెనుగొండ, జూన్-02, (ప్రభాతవార్త)** వాసవి పెనుగొండ మండలం సిద్ధాంతంలో ఈనెల 09వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన దృష్ట్యా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మంగళవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 9వ తేదీన సిద్ధాంతంలో నిర్వహించనున్న పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపడుతోంది. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఏర్పాట్లను మంగళవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పరిశీలించారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మరియు సంబంధిత అధికారులతో కలిసి ముఖ్యమంత్రి హెలిపాడ్, బహిరంగ సభా స్థలి, వాహనాల పార్కింగ్ ప్రదేశాలను సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణంలో ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు మరియు ఇతర మౌలిక సదుపాయాలపై అధికారులకు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా చర్యలు, ప్రజల రాకపోకలు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ మళ్లింపు తదితర అంశాలపై అధికారులతో చర్చించి తగు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో దాసిరాజు, తహసీల్దార్ అనిత కుమారి, నరసాపురం డీఎస్పీతో పాటు వివిధ శాఖల అధికారులు వున్నారు.

# డెత్ సర్టిఫికెట్ ఇవ్వడానికి .. రెండేళ్లా?..

- సచివాలయాల చుట్టూ పేదరాలి 'కన్నీటి' ప్రదక్షిణలు!
- నిరుపేద కన్నీటికి కరగని 'సారథులు'!
- నిలువనీడ లేక.. పెన్షన్ రాక.. రోడ్డున పడ్డ అభాగ్యురాలు!
- మామూలు' ఇస్తేనే కదిలే ఫైళ్లు.. ఎందుకీ నిర్లక్ష్యం?





**కొయ్యలగూడెం రూరల్ జూన్ 2 ప్రభాతవార్త** ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటి ముంగిటకే తెస్తామంటూ ఏర్పాటైన క్షేత్రస్థాయి వ్యవస్థలు కొన్నిచోట్ల కేవలం 'కాగితాల'కే పరిమితమవుతున్నాయా? సామాన్యుడి కష్టాన్ని తీర్చాల్సిన విభాగాలే వారికి చుక్కలు చూపిస్తున్నాయా? అంటే.. అవుననే అంటోంది కొయ్యలగూడెం మండలం దిప్పకాయలపాడు గ్రామంలో వెలుగుచూసిన ఈ హృదయ విదారక ఘటన. భర్తను కోల్పోయి, పుట్టెడు దుఃఖంలో ఉన్న ఒక అభాగ్యురాలి కన్నీరు.. అక్కడి సిబ్బంది కఠిన హృదయాలను కరిగించలేకపోయింది. రెండేళ్లుగా ఒక మరణ ధ్రువీకరణ పత్రం (డెత్ సర్టిఫికెట్) కోసం ఒక మహిళను కార్యాలయాల చుట్టూ తిప్పడం చూస్తుంటే, వ్యవస్థ ఎంత నిర్లిప్తంగా మారిందో అర్థమవుతోంది.

### విధి వంచించింది.. వ్యవస్థ వేధిస్తోంది!

చర్చిపేటకు చెందిన సైదుల మునిషా అనే మహిళ చిన్న కుటుంబం 2024లో భర్త లాలు సాహెబ్ హఠాన్మరణంతో ఒక్కసారిగా అంధకారంలోకి నెట్టబడింది. సంపాదించే వ్యక్తి లేక, ఇద్దరు చిన్న పిల్లలను సాకలేక ఆమె పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఇది చాలదన్నట్టు, ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఉన్న చిన్న తాటాకు ఇల్లు కూడా కాలి బూడిదైంది. నిలువనీడ లేక, నెలకు రూ. 2,500 అద్దె కడుతూ.. అత్తగారికి వచ్చే అరకొర పెన్షన్ డబ్బులతో ఆ కుటుంబం కాలం వెళ్లదీస్తోంది. ఆర్థిక సాయం లేక ఒక బాబు చదువు కూడా అర్ధాంతరంగా ఆగిపోయింది.

### ' మామూళ్లు' ఇస్తేనే ఫైలు కదులుతుందా?

?భర్త చనిపోయిన నాటి నుండి వితంతు పెన్షన్ కోసం మునిషా సచివాలయం చుట్టూ తిరగని రోజు లేదు. భర్త మరణ ధ్రువీకరణ పత్రం ఇప్పించాలని ఆమె అభ్యర్థించని అధికారి లేడు. అయితే, కార్యాలయాల్లో పనులు ఎలా జరుగుతాయో చెప్పడానికి ఈ ఘటనే నిదర్శనం. ఆఖరికి ఉన్నతాధికారుల కార్యాలయం నుండి కాగితం తేవడానికి 'పెట్రోల్ ఖర్చులు' అంటూ బాధితురాలి నుండి ఐదువందల




రూపాయలు వసూలు చేసినా, నేటికీ ఆ ఫైలు ముందుకు కదలలేదు. ఈ విషయమై క్షేత్రస్థాయి సిబ్బందిని ప్రశ్నిస్తే మాట మార్చడం, పొంతన లేని సమాధానాలు చెప్పడం వారి బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోంది. పేదవారి కష్టాలు చూసి గ్రామస్తులంతా జాలిపడుతుంటే.. ప్రజల పన్నులతో జీతాలు తీసుకునే కొందరు సిబ్బందికి మాత్రం కనీస కనికరం లేకపోవడం విడ్డూరం!

### హామీలకే పరిమితం కాకూడదు:

ప్రస్తుతం బాధ్యతలు చేపట్టిన ఇన్‌ఛార్జ్ ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై సానుకూలంగా స్పందించి, త్వరలోనే సర్టిఫికెట్ ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. అయితే, ఈ హామీలు కేవలం మాటలకే పరిమితం కాకూడదని స్థానికులు కోరుతున్నారు.

### ఉన్నతాధికారులారా.. అంధకారంలో ఉన్న ఆ కుటుంబానికి వెలుగునివ్వండి!

ఈ వ్యవస్థలు పనిచేస్తోంది సామాన్యుల కోసమా? లేక కేవలం అండదండలు ఉన్న బడా బాబుల కోసమా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ తీవ్రమైన నిర్లక్ష్యంపై దృష్టి సారించాలి. క్షేత్రస్థాయిలో బాధ్యతారహితంగా వ్యవహరించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. బాధిత మహిళకు వెంటనే డెత్ సర్టిఫికెట్ అందించి, పెన్షన్ మంజూరయ్యేలా చేసి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని సర్వత్రా డిమాండ్ వ్యక్తమవుతోంది.

### 20 విడతల రెవిన్యూ క్లినిక్ లలో

# 433 దరఖాస్తులు పరిష్కారం

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం జూన్-02, (ప్రభాతవార్త)** రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్స్ ఉత్తమ ఫలితాలను అందిస్తున్నాయని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికతో పాటు భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్స్ నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. 2025 డిసెంబర్ 29న ప్రారంభమైన రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 2026 జూన్ 1 వరకు మొత్తం 20 విడతలుగా కార్యక్రమం నిర్వహించామని కలెక్టర్ తెలిపారు. ఈ కాలంలో జిల్లావ్యాప్తంగా మొత్తం 755 దరఖాస్తులు అందగా, వాటిలో 286 దరఖాస్తులను పరిష్కరించడం జరిగిందన్నారు. అర్హతలు, నిబంధనల ప్రకారం 147 దరఖాస్తులను తిరస్కరించగా, ప్రస్తుతం 322 దరఖాస్తులు వివిధ దశల్లో పరిష్కార ప్రక్రియలో ఉన్నాయని వివరించారు. డివిజన్ వారీగా పరిశీలిస్తే భీమవరం డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లో 327 దరఖాస్తులు అందగా, వాటిలో 121 దరఖాస్తులు పరిష్కరించబడినట్లు తెలిపారు. 60 దరఖాస్తులు తిరస్కరించగా, మరో 146 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. నరసాపురం డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాల్లో 273 దరఖాస్తులు అందగా, 111 దరఖాస్తులను పరిష్కరించామని, 52 దరఖాస్తులను తిరస్కరించామని, మరో 110 దరఖాస్తులు పరిష్కార దశలో ఉన్నాయని వెల్లడించారు. తాడేపల్లిగూడెం డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో 155 దరఖాస్తులు అందగా, 54 దరఖాస్తులను పరిష్కరించామని, 35 దరఖాస్తులను తిరస్కరించామని, మిగిలిన 66 దరఖాస్తులపై విచారణ కొనసాగుతోందన్నారు. భూ సమస్యలపై అందిన ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి, భవిష్యత్తులో ఎటువంటి వివాదాలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా ప్రజలకు త్వరితగతిన పరిష్కారాలు లభిస్తున్నాయని, ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

# కొత్తశేరేపాలెంలో అక్రమ మట్టి తవ్వకాలు

## యథేచ్ఛగా రవాణా



**మొగల్తూరు జూన్ 02 (ప్రభాతవార్త)** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలంలోని కొత్తశేరేపాలెం గ్రామ పరిసర ప్రాంతాల్లో అక్రమ మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా వ్యవసాయ భూములు, ఖాళీ స్థలాల నుంచి మట్టిని భారీ యంత్రాలతో తవ్వి ట్రాక్టర్లు, లారీల ద్వారా తరలిస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా మట్టి రవాణా కొనసాగుతుండటంతో గ్రామీణ రహదారులు దెబ్బతింటున్నాయని, దుమ్ము కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ తవ్వకాల వల్ల భూగర్భ జలాలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత రెవెన్యూ, గనుల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలు, రవాణాను నిలిపివేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. "అధికారుల పర్యవేక్షణ లోపంతో అక్రమ మట్టి మాఫియా రెచ్చిపోతోందా?" అనే ప్రశ్న స్థానికుల్లో చర్చనీయాంశంగా మారింది.


# మాతా,శిశు మరణాలు లేకుండా కృషిచేయాలి

**హైరిస్క్ గర్భిణీ స్త్రీలకు ప్రత్యేక పర్యవేక్షణకు వైద్యాధికారులు ప్రత్యేక దృష్టి.**

**ప్రాజెక్టు మాతృ అమలుపై జిల్లా కలెక్టరు కె.ఎట్రిసెల్వి అధ్యక్షతన సమీక్ష ...**



**ఏలూరు, జూన్ 02: ప్రభాత వార్త** జిల్లాలో తల్లి,శిశు మరణాలను పూర్తిగా నివారించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న "ప్రాజెక్టు మాతృ- జీరో ఐఎంఆర్, ఎంఎంఆర్ పైలట్ ప్రాజెక్టు" అమలుపై జిల్లా కలెక్టరేటు గౌతమీ సమావేశ మందిరంలో మంగళవారం వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు,వైద్యాధికారులుతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన వైద్యసేవలు అందించడంతో పాటు శిశువులు ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తల్లి,శిశు మరణాలను పూర్తిగా నివారించేందుకు వైద్య,ఆరోగ్యశాఖ అధికారులు, వైద్యాధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అధికప్రమాద (హైరిస్క్) గర్భిణులను గుర్తించి నిరంతర పర్యవేక్షణ చెయ్యడం, ప్రసవాలకు ముందు మరియు తరువాత అవసరమైన వైద్యసేవలు అందించడం, సంస్థాగత ప్రసవాలను ప్రోత్సహించడం, గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి అంశాలుపై జిల్లా కలెక్టరు అధికారులకు దిశానిర్దేశం చేశారు. హైరిస్క్ గర్భిణులను ప్రసవానికి ముందు ఒక నెలపాటు రోజువారీగా ఆరోగ్యపరంగా పర్యవేక్షించాలని, ప్రతి హైరిస్క్ గర్భిణీస్త్రీలను పర్యవేక్షణ కోసం ఒక అడాప్షన్ అధికారిని నియమించాలని జిల్లా కలెక్టరు ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలు మేరకు జిల్లాలో వినూత్న కార్యక్రమంగా నూజివీడు క్లస్టర్ పరిధిలో ఈ ప్రాజెక్టును పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నామని అన్నారు. నూజివీడు క్లస్టర్ పరిధిలోని 11 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో మొత్తం 1,635 మంది గర్భిణులను గుర్తించగా, వారిలో 790 మందిని హైరిస్క్ గర్భిణులుగా గుర్తించినట్లు వెల్లడించారు. జూన్, జూలై, ఆగస్టు మూడు నెలల్లో ప్రసవాలకు సిద్ధంగా ఉన్న 624 మంది గర్భిణుల్లో 315 మంది హైరిస్క్ గర్భిణులుగా గుర్తించ బడ్డారని, వీరందరికీ సురక్షిత ప్రసవాలు జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు అమలులో సాధించవలసిన పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, వాటిపరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలుపై అధికారులతో చర్చించారు. జిల్లాలో తల్లి,శిశు ఆరోగ్య సూచికలను మెరుగు పరచడంలో ప్రతిశాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. గర్భిణీస్త్రీలు ఆరోగ్యపరిరక్షణలో భాగంగా యోగాను, ఎక్సర్సైజులు తో పాటు కొద్ది సమయం నడకను తప్పక పాటించేలా చూడాలని అన్నారు. డెలివరీ అయిన తర్వాత 40 రోజులుపాటు మాతాశిశు గృహాలకు తప్పనిసరిగా వెళ్ళి వైద్య సేవలు, సూచనలు సలహాలు అందిస్తూ, పౌష్టికాహారం తీసుకోవలసిన జాగ్రత్తలుపై తెలియ చెప్పాలని జిల్లా కలెక్టరు ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా.యు. శోభ, జిల్లా ఐసిడిఎస్ పిడి పి.శారద, డిసిహెచ్ ఎస్ డా.సి.హెచ్. బేబికమల, డిప్యూటి డియంహెచ్వో డా.యస్. పద్మావతి, నోడల్ ఆఫీసరు శ్రీనివాసరావు, నూజివీడు నియోజకవర్గం వైద్య నిపుణులు, వైద్యాధికారులు, జిల్లా వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# వేలేరుపాడులో ఘోర అగ్ని ప్రమాదం

- ఇద్దరు మహిళలు సజీవ దహనం
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే చిర్రి ఏఎస్పి సుస్మిత



**వేలేరుపాడు,జూన్2(ప్రభాత వార్త ):** వేలేరుపాడు మండలంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద సోమవారం రాత్రి ఒంటిగంట సమయంలో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికంగా జరిగిన విషాదకర అగ్ని ప్రమాదంలో వలగాని సావిత్రి (60), సిగ పూలమ్మ (64) సజీవ దహనమై మృతి చెందారు. ప్రమాదం జరిగిన సమయంలో మంటలు వేగంగా వ్యాపించడంతో నివాస గృహంతో పాటు అక్కాచెల్లెళ్లు అగ్నికి ఆహుతయ్యారు. గృహానికి ఆడుకొని ఉన్న లక్ష్మి నివాస గృహం పూర్తిగా అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న గ్రామస్తులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. అప్పటికే ఇద్దరు కాలి భూడిదైనట్లు గ్రామస్తులు గమనించారు.

**బాధిత కుటుంబానికి అండగా ఉంటాం-ఎమ్మెల్యే చిర్రి :**

ప్రమాదం జరిగిన ఘటన స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి గల కారణాలు, జరిగిన నష్టం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే వారికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రమాదంపై అనుమానాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు చెప్పడంతో ఘటనపై సమగ్ర విచారణ నిర్వహించి వాస్తవాలను వెలికితీస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బాధ్యులెవరైనా ఉంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా చూస్తామని తెలిపారు. అధికారులు పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టి నివేదిక సమర్పించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

**ఘటన స్థలాన్ని పరిశీలించిన ఏఎస్పి :**

ఘటనపై అదనపు పోలీసు సూపరింటెండెంట్ (ఏఎస్పి) సుశ్మిత మంగళవారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన ఆమె ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు సంఘటన జరిగిన తీరు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఘటనపై పోలీసులు చేపట్టిన దర్యాప్తు పురోగతి, సేకరించిన ఆధారాలు, తీసుకుంటున్న చర్యలపై సంబంధిత అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

**మృతదేహాలు అప్పగింత:**

మృతదేహాలకు పోస్ట్‌మార్టం ప్రక్రియను వైద్యులు పూర్తి



చేశారు. ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో పరీక్షలు నిర్వహించి,అవసరమైన నమూనాలను సేకరించారు. పోస్ట్‌మార్టం నివేదిక ఆధారంగా మృతికి గల కారణాలను నిర్ధారించనున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.





## ద్వారకాతిరుమల ఈవో వేంద్ర త్రినాధరావుకు బీజేపీ నేతల జన్మదిన శుభాకాంక్షలు



**ద్వారకాతిరుమల,జూన్ 2 ప్రభాతవార్త :** ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి (ఈవో) వేంద్ర త్రినాధరావు జన్మదిన సందర్భంగా ద్వారకాతిరుమల మండల భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ఈవో త్రినాధరావును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనలో ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు.దేవస్థానం మరింత అభివృద్ధి చెందాలని, ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షు పొందాలని ఆకాంక్షిస్తూ ఈవోకు శుభాభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ద్వారకాతిరుమల మండల భారతీయ జనతా పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళల భద్రతపై అవగాహన సదస్సు



**చాట్రాయి, జూన్ 2, ప్రభాతవార్త** చాట్రాయి మండలం, తుమ్మగూడెం గ్రామంలో ఎస్ఐ డి. రామ కృష్ణ మహిళల భద్రత మరియు రక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు చట్ట పరమైన హక్కులు, మహిళల రక్షణ కోసం ప్రభుత్వం మరియు పోలీసు శాఖ అందిస్తున్న సేవలు, అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాల్సిన హెల్ప్‌లైన్ నెంబర్ లు సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, బాలికలు మరియు మహిళలపై జరుగుతున్న వేధింపు లను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.అలాగే మహిళలు ఎలాంటి సమస్యలు ఎదురైనా నిర్భయంగా పోలీసులను సంప్రదిం చాలని, వారి భద్రతకు పోలీసు శాఖ ఎల్ల ప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. మహిళల భద్రత కుటుంబం, సమాజం మరియు ప్రభుత్వ ఉమ్మడి బాధ్యత అని పేర్కొంటూ, సురక్షిత మైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగ స్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు, యువతులు, గ్రామ పెద్దలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. మహిళల భద్రతపై అవగాహన పెంపొందించడంలో ఇటువంటి కార్య క్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అయన అన్నారు.



## డ్రైన్స్ పూడిక తీతలు.

**లింగపాలెం మే 2(ప్రభాత వార్త )** లింగపాలెం మండలం లింగపాలెం గొల్లగూడెం రామాలయం సమీపంలోని డ్రైనేజీ పూడుకుపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్న సమస్యను సంబంధిత అధికారులకు ప్రజాప్రతినిధులకు తెలియజేసిన వెంటనే స్పందించి ఈరోజు డ్రైనేజీ పూడిక తీయించి సమస్యను పరిష్కరించడం జరిగింది. ఈసందర్భంగా స్థానికులు అధికారులకు ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.

## విద్యార్థి మిత్ర కిట్స్ సకాలంలో పంపిణీ చేయండి



**చాట్రాయి, జూన్ 2 ప్రభాతవార్త** ఈ ఏడాది విద్యా సంవత్సరానికి గాను విద్యార్థులకు అందజేయాల్సిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్స్ ను సకాలంలో పంపిణీ చేయాలని ఏలూరు జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు కోఆర్డినేటర్ కె పంకజ్ కుమార్ కోరారు. వార్షిక తనిఖీలలో భాగంగా ఆయన మంగళవారం చాట్రాయి మండలంలోని విద్యార్థులకు సకాలంలో కిట్స్ అందే విధంగా చర్యలు చేపట్టాలని మండల విద్యాశాఖ అధికారి -2 వి ఎస్ వి బ్రహ్మాచారిని కోరారు. ఈ విద్యా సంవత్సరానికి గాను 2262 మంది విద్యార్థులకు కిట్స్ ను సరఫరా చేయడం జరుగుతుందని దానిలో భాగంగా మండలానికి రావలసిన 11766 నోట్ బుక్స్ పూర్తి స్థాయిలో వచ్చాయని అదే విధంగా టెక్ట్స్ బుక్స్ 10952 వచ్చాయని ఇంకనూ 1325 రావాల్సి ఉందని అవి రాగానే అన్ని పాఠశాలలకు సరఫరా చేస్తామని మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మ చారి తెలియజేశారు. ఈ కార్యక్రమం లో మండల విద్యా శాఖాధి కారి -1 మాసగిరి శ్రీనివాస్ సమగ్ర శిక్ష సీఎంఓ యెహోషువ ఏ ఎల్ ఎస్ కోఆర్డినేటర్ నాగేశ్వరావు ఐ ఈ కోఆర్డినేటర్ భాస్కర్ చాట్రాయి మండల ఎమ్ ఐ ఎస్ కోఆర్డినేటర్ దిలీప్ కుమార్ లు పాల్గొన్నారు.

## మోడీ పాలన పై బిజెపి సమీక్ష సమావేశం



**అత్తిలి, జూన్ 2( ప్రభాత వార్త )** అత్తిలి మండల బీజేపీ కార్యవర్గ సమావేశం మామిడి శెట్టి నాగబాబు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథి లు గా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాలగ్రామ లక్ష్మీప్రసన్న, భోగి రెడ్డిఆదిలక్ష్మి, జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి మండల ఇన్చార్జి కంచుమర్తినాగేశ్వరరావు పాల్గొన్నారు. 12 సంవత్సరాలు గా ప్రధానమంత్రి మోడీ సుపరిపాలనలో చేసినటువంటి కార్యక్రమాలను, జనతా వారధి, శక్తి కేంద్రాలు, పోలింగ్ బూత్ ల పటిష్టత,మండలంలో భారతీయ జనతా పార్టీ కార్యకర్తల పనితీరు విధి విధానాలను వివరించారు పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా తగిన సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు రామిశెట్టి అయ్యప్ప స్వామి, బండి సోమేంద్ర, సీనియర్ నాయకులు కొత్తపల్లి రామరాజు, తోట త్రిమూర్తులు, పూర్వ అధ్యక్షులు బాలంమహేష్ పాల్గొన్నారు.

## ఉచిత హోమియో వైద్య శిబిరం



**అత్తిలి,జూన్ 2( ప్రభాతవార్త )** విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠంకు అనుబంధంగా ఉన్న ఉమర్ అలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్టు ఆధ్వ ర్యంలో అత్తిలి శాఖ వారు మెగా ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. తాడే పల్లి గూడెం ఏ ఎస్ ఆర్ హోమియో మెడికల్ కాలేజీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహేష్ ఆధ్వర్యంలో డాక్టర్స్ బృందం రోగులను పరీక్షించారు.ప్రతీ నెల మొదటి మంగళవారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించ నున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ 15 న తాడేపల్లిగూడెంలో ఉచిత రక్త పరీక్షలు, ఈసిజి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

## కొనసాగుతున్న చలివేంద్రం



**అత్తిలి, జూన్ 2( ప్రభాత వార్త )**అత్తిలి మానవత, చాంబర్ ఆఫ్ కామర్స్ సంయుక్తం గా నిర్వహిస్తున్న "మజ్జిగ చలివేంద్రం 14వ రోజుకు చేరింది. మంచిలి మాజీ ఎంపిటిసి పసుపులేటి రామ కొండలరావు, రాజారత్నం దంపతుల జ్ఞాపకార్థం కుమారుడు వెంకటసుబ్బారావు, చలివేంద్రం కు సహకరించారు.

## అతి సార వ్యాధి రాకుండా జాగ్రత్తలు



**అత్తిలి/ గణపవరం జూన్ 2 ( ప్రభాత వార్త )** గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రము లో ఆశా డే సందర్భముగా ఆశా కార్యకర్తలు నెల వారి సమీక్షా సమావేశం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జె విల్సన్ బాబు,ఆశా నోడల్ అధికారి సత్యవతి అధ్యక్షతన నిర్వహించారు ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ అతిసారా వ్యాధి పై తీసికోవలసిన జాగ్రత్తలు, వ్యాధి పట్ల ప్రజలలో అవగాహన కల్పించాలని ఆశ కార్యకర్తలను కోరారు.కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జె విల్సన్ బాబు మాట్లాడుతూ జూన్ 1 నుండి 30వ వరకు జరుగు మలేరియా మాసోత్సవాలు సందర్భంగా మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా వ్యాధులపై గ్రామాలలోఅవగాహన కల్పించాలని కోరారు. పీహెచ్ సి నుండి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మజ, ఎం .నల్లయ్య యోహాను ఆశ కార్యకర్తలు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## యూరియా అమ్మకాలుపై శిక్షణ

**ఆగిరిపల్లి జూన్ 2 ప్రభాతవార్త** ఖరీఫ్ సీజను నుండి రైతులకు ఏ పి ఏ ఐ ఎం ఎస్ 2.ఉ ఏ పి పి సిఫారసు మేరకే యూరియా అమ్మకాలుజరుగుతాయని మండల వ్యవసాయాధికారి జె.భవాని తెలిపారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది కి శిక్షణా కార్యక్రమము నిర్వహించారు. ఖరీఫ్ - 2025 పంట కాలములో నమోదు చేసిన పంట వివరాల ఆధారంగా రైతులకు యూరియా మరియు డిఏపి ఎరువులు పంపిణీ చేయబడతాయని తెలియచేసారు. ఈ యాప్ కు వెబ్లాంలోనిలోని ఆర్ ఓ ఆర్, ఆర్ ఓ ఎఫ్ ఆర్, సి సి ఆర్ సిలో ఉన్న రైతుల వివరములను జతపరచి రైతు కు ఉన్న భూమి ప్రకారము ఆ పొలము లో ఏ రకము పంట నమోదు జరిగినది అన్న వివరములను అనుసంధానము చేసి ఆ పంటకు కావలసిన మేరకే యూరియా అమ్మకాలు ఆధార్ బయోమెట్రిక్ విధానము లో జరుగుతాయనిఅన్నారు. రైతుకి తనకి అవసరమైన యూరియా మరియు డి ఏ పిఎరువులు మూడు విడతల్లో ఇవ్వడం జరుగుతుంది. ఒక విడత తీసుకొన్న తరువాత రెండో విడతకు 20 రోజుల తరువాత ఇవ్వటం జరుగుతుందన్నారు. కావున రైతులందరూ తమ తమ రైతు సేవా కేంద్రము భాద్యుల ద్వారా పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని తెలియచేసారు. ఈ విధముగా రైతులందరూ యూరియా మరియు డి ఎ పి ఎరువులనుఏ పి ఏ ఐ ఎం ఎస్ 2.ఉ యాప్ ద్వారా పిఎసిఎస్ , రిటైల్శ్రీ డీలర్ల వద్ద నుండి కొనుగోలు చేసుకోవాలని తెలియచేసారు. ఈ విధముగా రైతులు యూరియా ను మోతాదు కు మించి వాడకుండా అవసరము మేరకే వాడుకోవాలని సూచించారు.

## భీమవరానికి మరో 50 ఆర్ టి సి బస్సులు

**భీమవరం టౌన్, జూన్ 2 : ప్రభాతవార్త** భీమవరం ఆర్టీసీ డిపోకు ప్రభుత్వం 50 బస్సులు కేటాయించిందని, త్వరలో అవి డిపోకు చేరనున్నాయని



ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు వెల్లడించారు. మంగళవారం నాడాయన ఆర్టీసీ డిపోలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. పరిశుభ్రత, త్రాగునీరు , టాయిలెట్లు, ప్రయాణికులకు ఏర్పాటు చేసిన కుర్చీలు ఆర్టీసీ కల్పించే అన్ని సౌకర్యాలు అందు తున్నదీ లేనిదీ ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. వారికి ఆయన చేతులు మీదుగా చల్లటి మజ్జిగను అందించారు. స్త్రీ శక్తి పథకం అమలు గూర్చి అడిగి తెలుసు కున్నారు. నాణ్యమైన సేవలు ప్రయాణికు లకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు . సామాన్యులకు అందుబాటులో ఏసీ బస్సులు రానున్నాయని, ప్రజలు ఆర్టీసీని ఆదరించాలని సూచించారు ఈ కార్యక్ర మంలో పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా రవాణాధికారి సప్పా గిరిధర్ కుమార్, ఎఎంసి మాజీ ఛైర్మన్ టి.డి.పి రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు , వబిలిశెట్టి రామకృష్ణ , పట్టణ ప్రముఖులు మరియు కార్యకర్తలు,భీమవరం డిపో ఆఫీస్ సిబ్బంది, ట్రాఫిక్ సూపర్ వైజర్లు,యూని యన్ ప్రతినిధులు,ప్రయాణికులు పాల్గొన్నారు

## విద్యతోనే ఉన్నత శిఖరాలు

**టి.నరసాపురం జూన్ 2 ప్రభాతవార్త** విద్యతోనే వ్యక్తి వికాసం సాధ్య మవుతుందని, ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని పోలవరం శాసనసభ్యులు చిర్రిబాలరాజు అన్నారు. మంగళవారం గ్రింకలపాడులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో టి.నర్సాపురం జెడ్పీ హైస్కూల్ ప్లస్‌లో పదో తరగతి, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థినులను ఆయన సత్కరించారు. విద్యార్థినులకు శాలువా, జ్ఞాపికతో పాటు ఒక్కొక్కరికీ రూ.5 వేల చొప్పున



మొత్తం రూ.25 వేల ప్రోత్సాహకాన్ని స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "కలలు కనండి, వాటిని సాకారం చేసుకోండి అనే దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. పభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యను ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని విజయ పరంపర కొనసాగించాలని పిలుపునిచ్చారు. పదో తరగతి తాడి లిఖిత సాయి, ఇంటర్ ప్రథమ సంవత్సరం - సయ్యద్ ఆరిశా, దూబా రమ్య, ఇంటర్ ద్వితీయ సంవత్సరం - కొక్కొండ రోషిత, పసుపులేటి హైమావతి తదితర విద్యార్థులను, అనంతరం జెడ్పీ హైస్కూల్ ప్లస్ అధ్యాపకులను ఉపాధ్యాయులను, సిబ్బందిని ఎమ్మెల్యే అభినందించారు. మా కలల చదువుకు ఎమ్మెల్యే బాసటగా నిలవడం సంతోషంగా ఉందని విద్యార్థులు ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు వినమ్రంగ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు జట్లసత్యనారాయణ,ఉపాధ్యాయులు నాని పల్లి ఏసుబాబు, సామాజిక కార్యకర్తలు ఎస్.డి. నాసర్ పాషా, కొరివి శేషారావు, పింగుల మధు, జనసేన నాయకులు జె. డి గంగాదర్ రావు, తోట సత్యనారాయణ తోట రామకృష్ణ, దాసరి పుల్లారావు,విద్యార్థినుల తల్లిదండ్రులు సయ్యద్ అబ్దుల్లా, సూరిబాబు, సరోజినీ, దుర్గారావు, నాగలక్ష్మి, కుటుంబరావు, రాజారావు, బొట్టు ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో ఆంగ్ల వ్యాకరణ పై అవగాహన



**పెనుమంట్ర, జూన్-02, (ప్రభాతవార్త)** మండలంలోని మార్టేరు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో విశ్రాంత ఆంగ్ల అధ్యాపకురాలు, రిసోర్స్ పర్సన్ పడాల సువర్ణ గౌరి పిల్లలకు ఆంగ్ల వ్యాకరణం, ఆంగ్లంలో నీతి కథలు చెప్పడం జరిగినది. రామకృష్ణ సేవా సమితి సభ్యులు, రిసోర్స్ పర్సన్ యల్.వి. సూర్యనారాయణ మూర్తి గ్రంథాలయంలో పిల్లలకు భక్త పహ్లాదుడు గురించి చెప్పడం జరిగింది. ఈ వేసవి శిక్షణా శిబిరంలో గ్రంథ పాలకుడు పి టి ఎస్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## వెలుగు ఏపీఎంగా నరసింహారావు నియామకం,

### ఏపీఎం ల డిప్యూటేషన్ పై పలు ఆరోపణలు



**జీలుగుమిల్లి, జూన్-02, (ప్రభాతవార్త)** మండల వెలుగు ఏపీఎంగా (మండల సమైక్య) పి నరసింహారావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన వేలేరుపాడు నుండి ఇక్కడకు రాగా, ఇప్పటివరకు ఏపీఎంగా పనిచేసిన బి శ్రీనివాసరావు వేలేరుపాడు ఏపీఎంగా బదిలీ అయ్యారు. వీరిద్దరూ ఒకచోట నుండి మరోచోటకి డిప్యూటేషన్ పై బదిలీ అయినట్లు సమాచారం.

**డిప్యూటేషన్ పై పలు ఆరోపణలు:-**

ప్రస్తుతం బదిలీలుపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధం అమలులో ఉండటంతో ఉన్నట్టుండి ఇద్దరు ఏపీఎంలపై ఆకస్మాత్తుగా డిప్యూటేషన్ విధానం అమలు చేయడంపై ఎవరి ఆగ్రహానికైనా గురయ్యారా? అందుకే వీరిద్దరిపై "డిప్యూటేషన్" విధానాన్ని వేటుగా ప్రయోగించారా! అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటి వరకు జీలుగుమిల్లి ఏపిఎం గా పనిచేసిన పనిచేసిన శ్రీనివాసరావు రుణాల మంజూరులో, వసుళ్ళలో మంచి ప్రతిభ కనబరిచినట్లు మంగళవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయనే వెల్లడించడం విశేషం. ఇప్పుడు ఇరువురి ఏపిఎం లు బదిలీల కావడంపై ఆంతర్యం ఏమిటనే "చర్చ" ప్రజల్లో కొనసాగుతుంది

## విద్యార్థుల సృజనాత్మకతకు వేదికగా పేపర్ క్రాఫ్ట్ కార్యక్రమం

**ద్వారకాతిరుమల,జూన్ 2 ప్రభాతవార్త :** ద్వారకాతిరుమల శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం (సమ్మర్ క్యాంప్)లో భాగంగా మంగళవారం ఉదయం విద్యార్థుల సృజనాత్మకతను ప్రోత్సహించే ఉద్దేశంతో పేపర్ క్రాఫ్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ



కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వివిధ రంగుల కాగితాలను ఉపయోగించి ఆకర్షణీయమైన వస్తువులు, అలంకరణ సామగ్రి మరియు కళాత్మక నమూనాలను రూపొందించారు. తమలోని సృజనాత్మక నైపుణ్యాలను ప్రదర్శిస్తూ రంగురంగుల కళాఖండాలను తయారు చేసి అందరినీ ఆకట్టుకున్నారు. పేపర్ క్రాఫ్ట్ ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచన, ఏకాగ్రత, చేతిపని నైపుణ్యాలు పెంపొందుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి ఎన్.సి.హెచ్. రామకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు సమ్మర్ క్యాంప్‌లో ప్రతిరోజూ వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## గ్రంథాలయంలో పుస్తక పఠనం

**పెనుమంట్ర, జూన్-02, (ప్రభాతవార్త)** పెనుమంట్ర శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగముగా విద్యార్థులకు పత్రిక, పుస్తక పఠనం , పుస్తక సమీక్ష తదితర అంశాలపై రిసోర్స్ పర్సన్ ఆదమ్ శిక్షణ ఇచ్చారు. అలాగే విద్యార్థులతో నీతి కథలు చెప్పడం చదివించడం వంటి కార్యక్రమాలు నిర్వహించడమైనది. అనంతరం



విద్యార్థులతో ఇండోర్ గేమ్స్ చెస్, క్యారం బోర్డు ఆడించడం అయింది. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

### 22న రాష్ట్రవ్యాప్తంగా ధర్నా

**నరసాపురం జూన్ 2 ప్రభాత వార్త** ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం స్థానిక బస్టాండ్ పక్కన మీరా భవనంలో కట్ట శివ దుర్గారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయం తర్వాత చేనేత ప్రధాన వృత్తిగా ప్రసిద్ధి



చెందిందన్నారు. కార్పొరేట్ విధానాల వల్ల సంక్షోభంలో చిక్కుకుందని, తత్ఫలితంగా చేనేత కార్మికులు ఆకలిచావులకు బలవుతున్నారన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేనేతపై జిఎస్‌టి వేయటంతో చేనేత రంగం మరింత సంక్షోభంలోకి నెట్టబడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి తగ్గించానని చెబుతున్నా చేనేతపై తగ్గించకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేనేత కార్మికులకు సంవత్సరానికి రూ.25 వేలు ఇస్తానని ప్రకటించినా అమలుకు నోచుకోలేదన్నారు. సహకార సంఘాలకు చెల్లించాల్సిన రూ.203కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. ఆప్కో సహకార సంఘాల వద్ద కొనుగోలు చేసిన బట్టలకు డబ్బు వెంటనే విడుదల చేయాలన్నారు. త్రిఫ్టు ఫండ్ కింద చేనేత కార్మికులకు ఇవ్వాల్సిన రూ.27 కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. ఇళ్లు లేని చేనేత కార్మికులకు మూడు సెంట్ల స్థలంలో మగ్గం షెడ్డుతో కూడిన ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. చేనేతపై జిఎస్‌టి పూర్తిగా రద్దు చేయాలన్నారు ఈ సమస్యలపై చేనేత ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 22 తారీఖున రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా ఎడి ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు ఈ సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి వాసా గంగాధర్ రావు, ఉపాధ్యక్షురాలు ఎం చంద్రకళ, ఎన్ వి రమణ , బూడిద జోగేశ్వరరావు, గద్దె హేమ సుందర్ రావ్, మురుగుడు సత్యనారాయణ, చల్ల వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.

### అధికారులు ప్రజా సమస్యలపై

## బాధ్యతగా పనిచేయాలి

### ఎంపీపీ పోచమ్మ



**జీలుగుమిల్లి, జూన్-02, (ప్రభాతవార్త)** ప్రజా సమస్యలు పరిష్కారానికి అధికార యంత్రాంగం బాధ్యతగా పనిచేయాలని మండల పరిషత్ అధ్యక్షురాలు కోర్స ప్ పోచమ్మ తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె శాఖల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీలుగుమిల్లి ఆసుపత్రి సామాజిక వైద్యాధికారి శ్రీనివాసరాజు గత సంవత్సరం అరు మలేరియా కేసులు నమోదయ్యా అని, ఈ సంవత్సరం జ్వరాలు నివారణకు అన్న చర్యలు చేపట్టమన్నారు. మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ పాఠశాలలు పున ప్రారంభం దృష్ట్యా డ్రాప్ అవుట్ నివారణకు అన్ని చర్యలు చేపట్టామని, మండల వ్యాప్తంగా ఒకటో తరగతిలోకి కొత్త అడ్మిషన్ కోసం 222 మంది విద్యార్థులు గుర్తించినట్లు తెలిపారు. ట్రాన్స్ కో ఏ ఈ ఆదిశేషుడు మాట్లాడుతూ పేదలని ఎస్సీ ఎస్టీ వర్గాలు పీఎం సూర్య ఘర్ పథకాన్ని ఉచితంగా సద్విని చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ-02 ఉప్పల లలిత కుమారి, ఎంపీటీసీ నాలి శ్రీను, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదంలో ఇద్దరు మహిళల మృతి పట్ల ఎంపీ దిగ్భ్రాంతి



**వేలేరుపాడు, జూన్2(ప్రభాత వార్త ):** వేలేరుపాడులో జరిగిన అగ్నిప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతి చెందడం పట్ల ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వలగాని సావిత్రి, సిగ పూలమ్మ సజీవదహనమై మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, బాధితులకు తక్షణ సహాయం అందించాలని అధికారులను కోరారు. ఘటనపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. క్లూస్ టీమ్‌ను రంగంలోకి దింపినట్లు, కుట్ర కోణం ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు ఎంపీకి తెలిపారు.


## నాచుగుంటలో నవధాన్యాల సాగు

### 20 ఎకరాల్లో సాగుకు సమాయత్తం



**ఏలూరు, జూన్ 02: ప్రభాతవార్త** ఉంగుటూరు మండలం నాచుగుంట గ్రామంలో మంగళవారం 20 ఎకరాలు విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన (నవధాన్యాలు) బ్లాక్లో సీడ్ పెలెటైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజరు బి.వెంకటేష్ హాజరు అయ్యి రైతులు జి.జయనారాయణ, జి.వెంకటరావు, జి.గంగాధర రావు మరియు ఎమ్మాని గంగాధరరావు లు పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్టు మేనేజరు బి.వెంకటేష్ అక్కడి రైతులకు మరియు ప్రకృతి వ్యవసాయ కేదరు సభ్యులకు సీడ్ పెలెటైజేషన్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. నవధాన్యాలు ప్రాముఖ్యతను వివరించి, ప్రతి రైతు ఈ విధానాన్ని తమ పొలాల్లో అమలు చేయడంతో పాటు ఇతర రైతులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. విత్తనాలను గోమయం మరియు మట్టి మిశ్రమంతో విత్తన గుళికలుగా తయారు చేసి పొలాల్లో చల్లుకోవడం ద్వారా విత్తనాలు ఎక్కువకాలం సురక్షితంగా ఉండటమే కాకుండా భూమిలో తేమ నిల్వఉండి మొలక శాతం పెరుగుతుందని తెలిపారు. రైతులు 25 రకాలు నవధాన్యాలు విత్తనాలను భూమిలో చల్లడం ద్వారా భూసారం పెరగడంతో పాటు సూక్ష్మజీవులకు ఎలాంటి హాని కలగకుండా పంట వైవిధ్యం అభివృద్ధి చెందుతుందని వివరించారు. ఈ విధానంలో సాగు చేసిన నవధాన్యాలు పశువులకు నాణ్యమైన పచ్చిరొట్ట మేతగా ఎంతో ఉపయోగప డతాయని, పశువులు వాటిని ఎంతో ఇష్టంగా తినడంతో పాటు సమృద్ధిగా పోషకాలు అందుతాయని తెలిపారు. ఈ పోషకాహార మేత వల్ల పశువుల ఆరోగ్యం మెరుగుపడి, మంచి నాణ్యత కలిగిన పాలు ఉత్పత్తి అవుతాయని, ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు కూడా తగ్గుతాయని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కోరపాటి లక్ష్మణరావు, డివిజనల్ ఇన్చార్జి ఎన్ఎఫ్ఏ పి. దొలాంబిక, రైతు సాధికార సంస్థ ఫీల్డ్ లెవల్ కేదరు సభ్యులు, స్వయం సహాయక సంఘాలు సభ్యులు మరియు గ్రామ రైతులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూలో డిప్యూటేషన్ విధానాన్ని నిలుపుదల చేయాలి



**పెనుమంట్ర, జూన్-02, (ప్రభాతవార్త)** స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు, శాఖలో ఉన్న మిగులు సిబ్బందిని ఇతర శాఖలకు డిప్యూటేషన్ పై పంపేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, ప్రస్తుతం పని చేస్తున్న మండలాల్లో సిబ్బంది లేక పని ఒత్తిడితో తీవ్ర ఇబ్బంది పడుతూ ఉంటే మరలా ఇప్పుడు సర్ ప్లస్ పేరుతో డిప్యూటేషన్ పై వారి అనుమతి తీసుకోకుండా ప్రతి జిల్లా నుండి కొంతమంది విఆర్వోలను డిప్యూటేషన్ పై పంపించడానికి తీసుకున్న చర్యలను వెంటనే నిలుపుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతి రాజు రవీంద్ర రాజు అన్నారు. మంగళవారం పెనుమంట్రలో ఒక ప్రకటన ఆయన మాట్లాడుతూ గతంలో గ్రామ సచివాలయ వ్యవస్థలో వివిధ కేడర్ లో పనిచేస్తున్న సిబ్బందిని (సర్ ప్లస్) గా చూపించి గతం నుండి రెవెన్యూ డిపార్ట్మెంట్ లో పనిచేస్తున్న విఆర్వోలను ఏ విధంగా మిగులు సిబ్బంది గా చూపిస్తారని ఆయన అన్నారు. ఇప్పటికే ప్రతి మండలంలో విఆర్వోలు సగం మంది ఉండడంతో ఒక్కొక్క విఆర్ఓ రెండు మూడు గ్రామాలకు ఇన్చార్జిలుగా కూడా పనిచేస్తూ తీవ్ర ఒత్తిడితో ఇబ్బందులు పడుతూ ఉంటే మిగిలిన గ్రామాలకు గ్రేడ్ 2 వీఆర్వోలకు ప్రమోషన్లు కల్పించి ఆ ఖాళీలను భర్తీ చేయాలని అన్నారు. అలాగే గ్రేడ్ 2 ఖాళీలను అర్హులైన వీఆర్ఏలతో భర్తీ చేయాలని మేము ప్రభుత్వాన్ని, అధికారులను కోరుతూ ఉంటే ఈ విధంగా గ్రామ రెవెన్యూ అధికారులను తగ్గించడం వల్ల రెవిన్యూ డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న వీఆర్ఏ లకు, వీఆర్వోలకు, సర్వేర్లకు తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. రెవెన్యూ డిపార్ట్మెంట్ లో పనిచేస్తున్న వీఆర్ఏ, వీఆర్వో, సర్వేర్లు కు నష్టం జరగకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు.

### తామర పువ్వులు అలంకరణలో

## అభయాంజనేయ స్వామి దర్శనం

**పెనుమంట్ర, జూన్-02, (ప్రభాతవార్త)** మండలంలోని మార్టేరు జెడ్ వంతెన దగ్గర కొలువై ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామికి ఎంతో ఇష్టమైన మంగళవారం తెల్లవారుజామున నుండి తామర పువ్వులు అలంకరణలో దర్శనం ఇచ్చారు.




అర్చకులు విజయగోపాలచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ యువజన సేవా సంఘం సభ్యులు లో ఒకరైన కర్రి అచ్చుత రామారెడ్డి మాట్లాడుతూ ఆలయం దాతలు సహకారంతో అభివృద్ధి చెందుతుంది అని ఆయన అన్నారు. అలాగే ప్రతి మంగళవారం స్వామి వారిని ప్రత్యేక అలంకరణలో దర్శనం ఇస్తున్నారని ఆయన అన్నారు. తెల్లవారుజాము నుండి భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామి వారి ప్రసాదాలు స్వీకరించారు.